# ఆంధ్రభూమి

సర్వవిషయములను చర్చించు
సచిత్రాంధ్ర మాసపత్రిక.

స్థాపితము ౧౯౩౩.
సాలుచందా 1-8-0.

సంపాదకుడు :
ఆంధ్ర శేషగిరిరావు, బి.ఏ.

సంపుటము : ౪. ధాతు, వైశాఖము : జూన్, 1936. సంచిక : ౧౨.


## సంపాదకీయ సమాలోచన

### ౧. ఆంధ్రునకు అభ్యుదయ పరంపరలు. రాష్ట్రము మాటయేమి?

ఆంధ్రునకు ఈనడుమ అభ్యుదయముమీద అభ్యుదయము కలుగుచున్నది. తెనుగు కమ్మబిడ్డ శ్రీ ఈడ్పుగంటి రాఘవేంద్రరావుగారు మధ్యరాష్ట్రములకు ఆక్టింగు గవర్నరు అయినారు. ఆంధ్ర వేదాంతి సర్ యస్. రాధాకృష్ణన్ గారు ఆక్సుఫర్డు విశ్వవిద్యాలయమున స్పాల్డింగు ప్రొఫెసరయినారు. ఆంధ్రజస్టిసు ముత్తా వెంకటసుబ్బారావుగారు మదరాసు హైకోర్టు ప్రధానన్యాయమూర్తి అయినారు. ఆంధ్ర విద్యాశేఖరుడు డాక్టర్ వంగల శివరాముగారు జినీవాలో లీగ్ ఆఫ్ నేషన్సు సెక్రటేరియటు పొలిటికలు సెక్షనునందు ఉన్నతోద్యోగమును పొందినారు. ఆంధ్రమహాశయులు సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడుగారు మదరాసు గవర్నరు కానున్నారు. ఇవి ఆంధ్రుని పరిపాలనాదక్షతకు, ప్రతిభాప్రాగల్భ్యములకు, న్యాయశాస్త్రపరిజ్ఞానమునకు, వేదాంతవిజ్ఞానమునకు, విజిగీషామనీషకు అమోఘనిదర్శనములు. ఈరూపమున ఒక్క మద్రాసు రాష్ట్రములోనేగాక రాష్ట్రాంతరమగు మధ్యమాగాణములందును, ఒక రాష్ట్రాంతరమునందేకాక దేశాంతరమగు ఇంగ్లండునందును, ఒక దేశాంతరమునందేకాక ఖండాంతరమగు ఐరోపాయందును ఆంధ్రునికీర్తి స్వైరవిహారము గావింపగలదు. అయితే ఆంధ్రవ్యక్తులకు కలిగిన ఈ అభ్యుదయములు ఆంధ్రులకు ఎంతగ సంతోషకరవిషయములయినను ఆసంతోషమున మనము పరవశులము కాకూడదు. ఆంధ్రజాతికి సమగ్రమగు అభ్యుదయము ప్రత్యేకరాష్ట్రము ఏర్పడినపుడే కలుగును. అట్టి ప్రత్యేకరాష్ట్రసిద్ధికి ఈమహావ్యక్తులెల్లరు దీక్షవహించి దోహదము చేయునప్పుడే వారు దేశమును, జాతిని మఱువని మహనీయులై మాతృఋణమును తీర్చినవారగుదురు. ఈ వ్యక్తుల అభ్యుదయము సమగ్రజాతీయాభ్యుదయమునకు కొంతకు కొంత అక్కఱకువచ్చినప్పుడే ఆంధ్రదేశచరిత్రపు పుటలలో శాశ్వతముగ ఉట్టంకితము కాగలదు.

**౯. కీ. శే. పి. వి. దాసు గారు :—**

‘సీతాకళ్యాణము’, ‘కృష్ణలీలలు’ అను రెండు మహత్తరమగు టాకీలను ప్రసాదించి తెనుగునాటి సంతతిని వినోదింపజేసిన నిపుణమతి శ్రీ పి. వి. దాసుగారు గతమాసము 10-వ తేది ఆదివారము ఉదయము 4-20 నిముసములకు మదరాసున మరణించిరి. మరణించుసరికి వారికి నలుబదియారు సంవత్సరములు. ప్రకాశమానములైన ఈనలుబదియారు సంవత్సరములలో వారు మదరాసువచ్చి ఇచట వేల్ పిక్చర్సు స్టూడియో నిర్మించిన తరువాతి వత్సరములే అత్యంతప్రకాశమానము లయినవని చెప్పవచ్చును. ఏమన బందరులో వారు బర్మాషెల్ ఏజెంటుగ నుండినప్పుడుగాని; బందరు, రేపల్లెలందు సినీమాల నిర్వహించినపుడుగాని; మునిసిపల్ సంఘసభ్యత, జిల్లాబోర్డు సభ్యత వహించినపుడుగాని లేని తేజము మదరాసున వేల్ పిక్చర్సు నిర్మాణముతో ప్రారంభమైనది. మదరాసునకు సొంతస్టూడియోలేనిలోటు తీరినది. లోటుతీరుటయేగాదు అందుండి వెలువడిన సీతాకళ్యాణము, కృష్ణలీలలు టాకీలు తెలుగు టాకీలలో ఉత్తమశ్రేణికి చెందినవయినవి. దాసుగా రిటీవల ‘శశిరేఖాపరిణయము’ అను తెనుగుటాకీని తయారుచేయుటయందు దీక్షితులయి యుండిరి. అది ముగింపుదశకు వచ్చిన ఈయదనున దాసుగారి మరణము మఱింత విషాదకర మగుచున్నది.

**౯. కీ. శే. మోచర్ల రామచంద్రరావు పంతులు గారు :—**

మెయి 16-వ తేదీ శనివారము సాయంకాలము నాలుగుగంటలకు సర్ మోచర్ల రామచంద్రరావు పంతులుగారు బెంగుళూరున పంచత్వమొందిరి. ఆధునికాంధ్రమేధావులలో పంతులుగారు అగ్రశ్రేణికి చెందినవారు. చనిపోవుసరికి వారికి అరువదియెనిమిదియేండ్లుండినను ప్రజాహితకార్యాచరణమున వారింకను యువకులయ్యే యుండిరి. అరవలలో రంగస్వామిఅయ్యంగారివలె ఆంధ్రులలో రామచంద్రరావు పంతులుగారు రాజ్యాంగతత్త్వశాస్త్రమున పారముముట్టిన పండితులై యుండిరి. నూతనరాజ్యాంగసంస్కరణములు అమలునకు రానున్న ఈసమయమున రాజ్యాంగతత్త్వశాస్త్రపండితులగు ఈమదరాసు నాయకు లిరువురును మరణించుట మదరాసు రాష్ట్రపు ప్రత్యేకదౌర్భాగ్య మనక తీరదు. మదరాసు రాష్ట్రపు భూమితనఖాబ్యాంకునకు పంతులుగారు ప్రాణము. రైతు ఉద్యమములకు వారు ఆదినుండియు మంచి పట్టుకొమ్మలై యుండిరి. శ్రీవారి మరణమువలన ఏర్పడిన లోటు ఒకపట్టున తీరునదికాదు. కాని ఆయనను ఆంధ్రులు పూజింపవలసినరీతిని పూజింపలేదని అంగీకరింపక తీరదు. ఆయనకు మదరాసుగోక్లే అను బిరుదము ఆంగ్లేయు డొకడిచ్చెనేకాని ఆంధ్రుడీయలేదు. సప్రూవంటి విచక్షణత, గోక్లేవంటి పరిజ్ఞానముగలిగి నిరాడంబరుడు, ప్రజాహితుడు అయి మెలగిన రామచంద్రరావుపంతులుగారు భారతదేశముననే ఆంధ్రేతర భాగములం దెక్కడనైన పుట్టియున్నచో ఇంతకంటె హెచ్చు ఔన్నత్యమును పొందియుండును. ఆయనచేయగలంతపనియు చేయజాలకపోయినచో ఆతప్పు ఆయన తెలివిని ఉపయోగించుకొనలేకపోయిన ప్రజలది, ప్రభుత్వమువారిది కాని ఆయనదికాదు. ఇంతకును ఆయన ధన్యజీవనుడు. ఆయననామము ఆంధ్రచరిత్రలో నిలిచియుండగలదు.

# కుక్క కాటుకు చెప్పు దెబ్బ

రచయిత :

పమ్మి రామశాస్త్రి

౧

రాత్రి పదకొండు, పన్నెండు ఆసమయాన్ని వీధి తలుపు దగ్గరగావేసుకొని, అన్నపూర్ణ పట్టుబట్టలు తడిపి ఆరవేయబోతూంటే, వర్జమల్లా లోపల ప్రవేశించి, చేతిలోపని చేసుకోనీయకుండా 'అందరూ క్షేమమా ? అన్నపూర్ణప్పా' అని—సమాధానం కోసం ఆగకుండానే—'ఇల్లా ఓసారిరా; నీతో అర్జంటుగా మాట్లాడవలసుండి వచ్చా' అంటూ గుక్కతిరక్కుండా అనేసి శ్రీరాముణ్ణి తలచుకొంటూ చేత్తో ఆనుకొని ఓచోట కూర్చున్నాడు చలపతి.

'ఎవరువా'రంటూ అన్నపూర్ణ దగ్గరకొచ్చిచూసి 'ఓహో! మీరా? ఎంతకాలానికి చూశానండీ అన్నయ్యా, ఏమదృష్టం! ఏమదృష్టం! మావదిన్ని తీసుకు రాలేదేం? అదుదుంబిడుచుమంటూ అంథ వివాహ సమయానికే రావాలా—చెప్పండి? ఆడదాన్ని—వంటరిదాన్ని—ఊఁ ?' అంది.

'ఔనుగాని ముందిల్లావచ్చి కూచో; నీతో ఓవిషయం మాట్లాడాలి.'

'అల్లాగేవస్తానుగాని—ముందిది చెప్పండి; తెల్లవారగట్ల పిల్ల పెళ్ళని తెలిసేవచ్చారా ? లేకపోతే ఏదో మాట్లాడాలనా ?' అంది అన్నపూర్ణ—నవ్వుతూ.

'పెళ్ళనేనమ్మా; శుభలేఖ అందిందిగా!'

'అందిందిగదా?'

'ఇప్పుడేం? నాలుగురోజుల క్రిందటే వచ్చింది, రావడం; కాని నే నీమధ్య వూళ్ళో లేకపోవడంచేత ఈవేళ మధ్యాహ్నమే చూడ్డం తటస్థించింది—చూసినవెంటనే బయలుదేరివచ్చా.'

'అల్లాగా? మంచిపనిచేశారు. బ్రహ్మానందంగా వుంది నాకు.'

'నీకంత ఆనందంగావుంటే వుండొచ్చుగాని నాకు మట్టుకు అంతగా యేంలేదు; చెప్పొద్దూ ?'

'ఏం—అల్లా అంటారేం ?'

'కాకపోతే యేమిటమ్మా?—నీవేమీ అనుకోకు సుమా; కుండపగలగొట్టినట్టు, నిజం మొహంమీద అనేశే స్వభావం నాది; కొందరికి మళ్ళే లోపలోకటి పైనోటి నాకు చాతకాదు—విన్నావూ? నీకా...'

'ఔను; నాకూ తెలుసు నాసంగతి.'

'నీకా—ఫదెకరాల కొంద్రుంది ; ఋణఘణాదులా లేవు—రెండువేలు వడ్డీకి తిరుగుతున్నాయని కూడా వెనక మాడబ్బాగాడు—(నాలుకకరచుకొని) కాదు - కాదు పొరపాటున వెనక మేం వాడికి పెట్టిన పేరే వచ్చేసింది—కామయ్య, అంటూవుండే వాడు.

అన్నపూర్ణ ముఖమండలంమీద హాసజ్యోత్స్న త్రుటికాలం ప్రసరించినట్లే ప్రసరించి మటుమాయమైపోయింది; వెంటనే 'ఎంతస్నేహంగా వుండేవారు మీరు?' అని సన్నగా దీర్ఘంతీస్తూ అని, కన్నీటితో నిండని ఆ మెకళ్ళను గట్టిగా చెంగుతో అద్దుకుంది.

'అల్లా విచారిస్తే ఏంలాభం ? ఊరుకో' అని, 'నేను చెప్పింది నిజంకాదంటావా?' అంటూ ముదరకించాడు చలపతి.

'ఏమిటో! నిజమేకాని—రోజులు బాగున్నాయి కావన్నయ్యా—ధరవరలు పడిపోవడమూ—ఇవ్వ

వలసినవాళ్లు ఇవ్వలేకపోడమూ—' అంది అన్నపూర్ణ ఆరోహణక్రమాన్ని హెచ్చించిన స్థాయిలో.

'నీస్థితికి నువ్వు, దానవిక్రయాధికారాల్తో ఘటక రాలకొంట్రా, కొంపాగోడీ కలిగుండి, ఒక్కగాని ఒక్క కుమార్తెయుండీ, సెంటుభూమేనా లేక నిరాధారనికంజనుడైన ఆశుంఠకా కట్టిపెట్టడం రత్నమంటి పిల్లను? మాణిక్యమంటి బిడ్డను ? శుభం పలకరా మంకెన్నా అంటే ఏదో అన్నట్టన్నాననుకోకు; వాడికీ నాకూ వెనకవుండే స్నేహాన్ని పురస్కరించుకొని మాట్లాడుతున్నా; అసలాహాళ్ళకి ఉపకారమంటే, నేనెప్పుడూ వెనుదీయను; అందులోనూ, స్నేహితుడూ, వాడికూతురుపెళ్ళిఅంటే, నాకు చేతనైన సహాయంచేయకుండానూ, తోచిన మంచిసలహా ఇవ్వకుండానూ ఊరుకోగలనా?'

'ఔను; మీరల్లాంటివారే; కాని ఇప్పుడు చేయవలసిందేమిటి? గంటకో, రెండుగంటలకో పెళ్ళి కూడా అయిపోవడానికి సిద్ధంగావుంది కదా?'

'ఐతే ఏమమ్మా? చొరవుండాలిగాని—చిన్నప్పణ్ణుంచీ వాణ్ణి పోషించేవాడెవడూ లేకపోవడంచేత మీయింట్లో వున్నంతమాత్రాన వాడికి పిల్లను కట్టిపెట్టాలని ఎక్కడుందమ్మా శాస్త్రం? ఈడూ జోడూ—చదువూసంధ్యా—ఎన్ని చూడాలి! పెళ్ళంటే మాటలే అనుకున్నావా ?'

'నిజమే మరి. మంచిసంబంధం చూడ్డానికి, అమ్మవంక చుట్టాలనీ, అబ్బవంక చుట్టాలనీ నాకెవరున్నారు చెప్పన్నయ్యా?'

'ఔనులేవమ్మా! నాకు కాస్తముందుగా తెలియపరచకూడదూ? ఎక్కడేనా మంచి సంబంధం చూడనైనా చూద్దును; అంథగావస్తే నాకుర్రాడికే చేసుకొందును. చూస్తూ చూస్తూ చిలకనితీసికెళ్ళి కసాయివాడి కిస్తాముటమ్మా?'

'ఇప్పుడు సాధనమేమిటి? తీరా అంతా ఏర్పాటయిపోయింది.'

'ఏర్పాటయిపోయినా మరేం భయంలేదు; మేనరికంగానీయ్; గీనరికంగానీయ్; నువ్వేమీ సందేహించకుండా ఈముహూర్తానికి వివాహం ఆపుచేశేయ్. తర్వాతసంగతి నేను చెపుతా.'

'ఎల్లాగ ? ఇంతప్రయత్నమూచేసి పెళ్ళిఆపటమేనా? లోకులు కాకులల్లా దూశేయరూ? ఇప్పడిదాకా ఈచుట్టుపట్లవాళ్ళందరూ ఇక్కడేవుండి ఏవేవోపనులుచేసి వెళ్ళేరు; ఇంకోగంటకో రెండు గంటలకో మళ్ళీ అందరూవస్తారు. తెల్లారగట్లేగా పెళ్ళి?' అని ఊరుకుని ఏదో ఆలోచిస్తూ కూచుంది కొంతసేపు.

'ఔనమ్మా; ఏం మునిగిపోయింది?'

'గట్టిగా మాట్లాడకండి; అప్రక్కగదిలోనే పడుకున్నాడు మాశంకరం; వాడివన్నీ వింటే కొంపమునుగుతుంది.' అంది అన్నపూర్ణ నెమ్మదిగా.

శంకరం నిద్రపోవడంలేదని ఆమెకు తెలియదంటారా ? జీవితంలో వివాహానికి సాటియైన మహోత్సవం మరోటి వుండబోదనీ, జ్ఞానంవచ్చిన పెళ్ళికొడుకే అయితే, కాబోయే వివాహోత్సవసందర్భాలనుగూర్చిన ఆలోచనలు తుపానులల్లా చెలరేగి నిద్రపోనీయకుండా చేస్తాయనీ ఆమెకుమాత్రం తెలీదూ?

చలపతి 'నీకేంభయంలేదు; వివాహం ఆపుచేసేయ్—ఈముహూర్తానికి.' అన్నాడు.

'ఎల్లాగా?' అంది—తెలివైనవాళ్లు ఇది మనస్ఫూర్తిగా అన్నది కాదురా అనుకొనేటట్టు.

'శతకోటిదరిద్రాలికి అనంతకోటివుపాయాలు. ఏమీలేదు. మీఅన్నగారికి ప్రాణంమీదకొచ్చినట్లు టెలిగ్రాం వచ్చిందనీ, అక్కడికెళ్ళిపోతున్నాననీ పొరుగింటి ఏపుల్లమ్మచెవులోనో ఊదేశి, డబ్బాగట్రా జాగ్రత్తచేసుకొని శంకరంగాడికి తాళంచెవులిచ్చేసిరా; వాడు ఇల్లు కాస్తూవుంటాడు.'

'మాఅన్నయ్యకూ నాకూ చాలాకాలంనుంచి మాటలులేవని ఊళ్ళో అంధరికీ తెలుసునుగా !'

'ఔనమ్మా ; అందరికీ తెలుసునని నేనూ ఎరుగుదును. ఐతేమాత్ర మేం? తోడబుట్టినవాడు—ఎంత

విరోధైనా—చావుబ్రతుకులమీద వున్నప్పుడు చూడ్డానికి వెళ్ళడం తప్పని ఎవరంటారమ్మా? ఈ మాత్రం సద్ది చెప్పలేవూ?'

'సరేమరి; అల్లాగే చెప్పాలి.'

'అల్లా నసుక్కు. వెళ్ళి చెప్పేశిరా.'

'అల్లాగే చెబుతానుగాని, తర్వాతసంగతేమిటి? ఎక్కడికి వెళ్ళటం?'

'రాజమండ్రీలో నీభర్తకూ నాకూ ముఖ్యస్నేహితుడు వెంకటచలం ఉన్నాడుగా! వాడింటికి వెడితే సరి.'

'ఊఁ వెళ్ళి,'

'తర్వాత నేను చెబుతానుగా.'

'ఏదో సంబంధం నిశ్చయించి ఈముహూర్తానికే చేసేస్తే బాగుండును.'

'నీవంత తొందరపడితే ఎలా? ఐనసంబంధం కావాలంటే తొందరగా కుదురుతుందా? (నవ్వుతూ.) నువ్వంత కాదూ కూడదూ అంటే మావాడున్నాడు మరి; వెయ్యిన్నూటపదహార్లేనా కట్నం ఇవ్వాలి గదా?......డబ్బేమైనావుందా హాజరుగా?'

'అబ్బే ఎంతోలేదన్నయ్యా. వందరూపాయలున్నాయి దగ్గర; కానిరోజు లొచ్చాయి. ఎక్కడా డబ్బుపుట్టడంలేదు. ఐనా మీతో నేనెక్కడ తూగగలను? కుర్రాడివంతుకు ఫదెకరాలువస్తుంది కాబోలు నేం?'

'ఫదేం? పన్నెండెకరాలొస్తుంది.'

'ఐతే కట్నం, వెయ్యో, రెండువేలో కావాలి; నేనిప్పుడెక్కణ్ణుంచితేను?—పైసా అప్పుపుట్టని ఈరోజుల్లో—'

'నీకేమమ్మా ఫదెకరాలభూమి వున్నదానవు, నువ్వే అలాఅంటూవుంటే?...'

'ఏంచెప్ప నన్నయ్యా! ఇవ్వవలసినవాళ్ళివ్వరు—డబ్బుకు బహు ఎటామటీగావుంది.'

'పోనీ - డబ్బు హాజరుగాలేకపోతే కట్నంక్రింద నాలుగెకరాలు రాసీయవచ్చుగా?'

'అల్లా మీరంగీకరిస్తే ఇంకేం? విధిగా అలాచేస్తా; ఇమ్మంటే నాయావదాస్తీ ఇస్తా; ఒక్కగాని ఒక్కపిల్లగదా! దానికి కాదని నేను మరొకాళ్ళకి పెట్టేదుంది గనకనా?'

'సరే నువ్వట్లా అంటున్నావుగనుక, పోనీ మా వాడికే చేసుకుంటాం.'

'ఇంకేం! బ్రహ్మానందంగావుంది అన్నయ్యా! భగవంతుడల్లా వచ్చారు మీరు. ఇంతకీ మీవంటివాళ్ళయింట్లో పడి అది సుఖించవలసిన యోగంవుండగా మరోవిధంగా ఎందుకుజరుగుతుంది? నాకు చాలా సంతోషంగావుంది. ఔనుగాని అన్నయ్యా...ను...రి...న...గ...ల...మా...టో?'

'నగలకేంలోటు? నా పెద్దకోడళ్ళకిద్దరికీ ఇచ్చినట్లు వెయ్యిరూపాయలిస్తా; కావలిస్తే ఇప్పుడేఇస్తా; పుచ్చుకో' అని జేబులోంచి తీసి పది వందరూపాయల నోట్లిచ్చాడు చలపతి.

'ఉదయం ఎనిమిదిన్నరకో తొమ్మిదికో మరో ముహూర్తంవుందట; ఆముహూర్తానికే చేసేద్దాం పెళ్ళి; నేను పిల్లనుతీసుకొని తప్పకుండా ఉదయం ఆరుగంటలబండికి రాజమండ్రీ వచ్చేస్తా; మరి మీ ఏర్పాటులో మీరుండండింక.'

'సరే; అలాగే—ఇహ నే వెళ్ళనా?

'ఊఁ వెళ్ళండి; ఆరుగంటలబండి కొస్తాంగా!'

'సరే; వెడుతున్నా; నేను ఏడుగంటల కోఫీకి వస్తాను.'

## ౨

చలపతీ, భార్యా, గదిలో కూర్చుని పెట్లలో ఏవో సామాన్లు సద్దుతున్నారు. 'టైమెంతయిందో చూడబ్బాయీ' అని సత్యాన్ని కేకేశాడు చలపతి. గడియారంచూసి 'నాలుగు' అన్నాడు సత్యం. 'ఐతే వేగిరంబండివాళ్ళను రమ్మనిచెప్పిరా; ఉదయం ఏడుగంటల కొచ్చేనా అందుతుందో అందదో; దిక్కుమాలినవూరు; గుర్రబ్బళ్ళైనాలేవు. రెండెడ్ల బండిమీద ఎనిమిదిమైళ్ళ దూరానున్నన్న ఆరైలుస్టేషను కెళ్ళా

లంటే ఎంతేనా ఆలస్యమవుతుంది’ అన్నాడు చలపతి.

సత్యంవెళ్ళి బళ్ళుతీసుకువచ్చాడు. పెళ్ళివారందరూ బళ్లెక్కేరు; బళ్లుఅంటే ఎన్నోనా?—రెండే; పెళ్లికొడుకు సత్యమూ, తండ్రీ, తల్లీ ఒదాన్లో కూర్చున్నారు; రెండోదాన్లో పెట్టెలూ గట్రాపెట్టి వాకలి నరుసుని కూచోపెట్టేరు.

‘మనమిప్పుడు రాజమండ్రీ వెళ్లాలి; అక్కడికొస్తారుట పెళ్లి వారు.’

‘ఏం! వారి స్వగ్రామంలోనే పెళ్లిచేస్తామన్నారే—నాతో!’

‘నేను పొద్దున్న అక్కడికెళ్లి వచ్చాగా! శారదా పిల్లు భయంచేత ఊళ్లోచేయడం విరమించామని చెప్పేరు.’

‘రాజమండ్రీ వెడితేమాత్రం?’

‘అక్కడ భయమేమిటి! ఎక్కడో ఒహరింట్లో తలుపులు బిడాయించి ఆనాలుగుమంత్రాలూ ఏకరువు పెట్టేస్తే చూడొచ్చేదెవరు! తర్వాత వాళ్లవూరెళ్లి ఏనాం వెళ్లొచ్చామని చెప్పుకుంటారు.’

‘ఆలాగా! నాతో అలా చెప్పలేదే!’

‘నాతో చెప్పేరుగా; వాళ్ళ బంధువులొకరున్నారులే అక్కడ; వాళ్లింటికిరమ్మన్నారు. ఐనా—నీకు కాబోయే మామగారున్నాడే—మహ చెడ్డమనిషట; చెప్పేదొకటీ—చేశేదొకటీ; మొన్నదాకా ఇంటి దగ్గిరేనని ఇప్పుడు రాజమండ్రీలో అనడమేమిటి చెప్పు.’

‘ఏంచెప్పను! వాళ్ళకున్న బాధలేమిటోమరి!’

## ౩

‘అబ్బబ్బా! తిరిగేటప్పటికి కాళ్లు పడిపోయాయిరా అబ్బాయి!’

‘ఏం... ఎక్కడోవుంటారని చెప్పేరన్నావుగా!’

‘వాళ్ళ కీసంగతే తెలియదుట; నేను చెప్పలేదట్రా వాళ్లసంగతి! ఊళ్ళో సత్రవులన్నీ చూసివచ్చా—ఎక్కడేనా వున్నారేమోఅని; ఎక్కడాలేరు; ఎలా వుంటారు, రాందే! చూడు ఎంతమోసం చేశారో!’

‘పాపం, వాళ్ళ కేం చిక్కొచ్చిందో.’

‘చిక్కంటావూ ఇంకా!—వాళ్ళ నైజమనక!’

‘సరే. ఈపాటికి ఇంటికెడదాం నడవండి.’

‘ఐనదేదో అయింది; ఇకవాళ్ల సంబంధం చేసుకోకూడదు.’

‘ఆఁ... ఈమాత్రానికేనా! పాపం! వాళ్లు ఏ చిక్కుల్లో వున్నారో! రేపు మనకి కబురు పంపకుండా వుంటారా!’

‘కబురుపంపితేమాత్రం! ఈముహూర్తానికి కాకపోతే, ఇంకా ఈసంబంధం చేసుకోమని ఎక్కడుందిరా—వాళ్ళ పరువుప్రతిష్ఠలన్నీ తెలిసొచ్చాయి దీనితో!’

‘ఆఁ హాఁ... ఈమాత్రానికేనా! ఊరుకుందూ.’

‘అబ్బె! నువ్వట్లాఅనకు; కో అంటే కోటిసంబంధాలొస్తాయి మనకి; వీళ్లే గొప్పవాళ్ళనుకున్నావా!’

‘గొప్పకేంగాని, సంబంధం తీరా నిశ్చయంచేసుకున్నామా! కట్నమంటూ వెయ్యిరూపాయలు ముందుపుచ్చుకున్నావుకదా! ఇంత సులువుగా, వాళ్ళిక్కడ కీముహూర్తానికి రానంతమాత్రాన, సంబంధం, తోసేయడమేనా! అట్లాచేస్తే మర్యాదగా వుండదు.’

‘పిల్లకాకికేం తెలుసురా ఉండేలదెబ్బని—లోకంలో ఎంతమంది మాయవాళ్లున్నారో,—కుర్రాడివి—నీకేం తెలుసునురా? నేనాలోచిస్తానుగా నువ్వూరుకో.’

‘ఆలోచిస్తే ఆలోచించుగాని ఆసంబంధంమాత్రం క్యాన్సిలు చేయొద్దు.’

‘.......... ...............’

## ౪

‘తొమ్మిదిగంటలన్నర బండికి టైమయింది. ఇక ఇంటికివెళ్ళిపోదాం’ అన్నాడు సత్యం.

'ఏమంత తొందరొచ్చింది ? భోంచేసి వెడదాం. నా స్నేహితుడొకడున్నాడులే ఇక్కడ ; వాడెప్పుడీపూళ్ళో నన్నుచూసినా, వాళ్ళింటిదగ్గర భోంచేయందే వెళ్ళనివ్వడు—నీతో ఎప్పుడూ చెప్పలేదనుకుంటా—వాళ్ళ బంధువుల తాలూకు పిల్ల ఒకత్తుందిలే; ఆపిల్లని నీకు చేసుకోమని ఐదారు సంవత్సరాల నుంచి పోరుతున్నాడు. ఎప్పటికప్పుడే నేను ఊఁకొట్టి వస్తున్నా; వాళ్లూ కాస్తో కూస్తో ఉన్నవాళ్లే. ఫదెకరాల పొలముంది; పొలమంటే పొలం కాదది—బంగారపుతునకనుకో; పిల్లకి తండ్రిలేడు. నాలుగైదు వేలు వడ్డీకి తిరుగుతున్నాయి కూడాను ; శుభ్రమైన పెంకుటి కొంపుంది. యావదాస్తీ ఆపిల్లని పెళ్ళి చేసుకున్నవాళ్ళకే సంక్రమిస్తుందిగాని, అన్యత్రా పూచీపుల్లయినా పోదు; సంబంధం మంచిదేయైనా, ఏదో ఉపేక్షచేసి ఊరుకున్నా, తీరా ఇప్పుడు వాళ్ళింటి కెళ్లేమా అంటే ఆసంబంధం చేసుకోమని వాడేం బలవంతం చేస్తాడో !......సరే నడవండి.'

'చాల్లెండి; సంబంధ మప్పుడే స్థిరపరుచుకోవడమయిపోయిందంటే వాళ్లేం పట్టుపడతారులెండి.' అంది చలపతిభార్య.

సత్యం ఏమిటో ఆలోచిస్తూవున్నాడు.

చలపతి వారినందరినీ తన స్నేహితుడింటికి తీసుకు వెళ్లేడు.

౨

'ఇదేమిట్రోయ్! వీళ్ళూ ఇక్కడికొచ్చారే?'

'ఎవరువారు?' అన్నాడు సత్యం.

'నీకు నేను చెప్పేనే—ఆ పెళ్ళికూతురే, ఈపిల్ల.'

'ఊఁ హూఁ.'

'మనమిక్కడికొస్తామని తెలిసి రాలేదుకద వీళ్లు?'

'.........................'

'రండి, లోపలికెడదాం ; మీకెవర్నీ ఎరగరు కూడాను; ఆబల్లమీద కూచోండి నేను లోపలికెళ్ళి వస్తా,' అన్నాడు చలపతి.

సత్యం ఏదో ఆలోచిస్తూ ఆబల్లమీద కూర్చున్నాడు.

'పిల్ల నిన్నుచూసేటప్పటికల్లా ఇంట్లోకి పరుగెత్తుకుపోయిందేమిటి? పైగా ఆకల్యాణంబొట్టూ గుమ్మాలికి తోరణాలూ, వీళ్లహడావిడీ చూస్తే వీళ్లు ముందుగానే ఏదో ఏర్పాటుచేసుకున్నట్టు కనిపిస్తోందే!' అంది చలపతిభార్య, కొడుకుతో. సత్యం మాట్లాడకుండా అల్లాగే ఆలోచిస్తూ కూర్చున్నాడు.

* * *

చలపతి లోపలికెళ్లేడు. అతన్ని చూడ్డంతోటే అన్నపూర్ణ పెద్దపెట్టున ఏడుస్తూ 'చూశారా, శంకరంపని!' అంది.

'ఏం? ఏంచేశాడు?'

'ఏంచేయాలో అదిచేశాడు. మేమూ బండిమీద వస్తూంటే ఎల్లావచ్చాడో—వచ్చి ఆముహూర్తానికే పిల్ల మెడలో పుస్తెకట్టి చక్కాపోయాడు.'

'అరి, దుర్మార్గుడా! ఎంతపని చేశావురా?—మీకు మెలుకువ రాలేదుటమ్మా?'

'రాకేం? అంతా అయింతర్వాత మెలుకువ వచ్చింది; ఇదేం పొయ్యేకాలంరా నీకంటే గుడ్లప్పచెప్పి చూడ్డం మొదలెట్టేడు; ఏమనను వాణ్ణి?'

'మాబాగా చేశాడుగా ! నేను చెప్పలేదుటమ్మా వాడటువంటివాడని?'

'చెప్పేరు—మీలోటులేదు; ఇంతకీ నాగ్రహస్థితి ఇల్లావుంది.'

'ఊఁ...ఇహ నువ్వు విచారించకు ; నేనుచెప్పినట్లు చెయ్.'

'అల్లాగే; అంతకంటేనా ?'

'వెంటనే పిల్లనిల్లాపిలిచి ఆ మంగళసూత్రం తెంపేయ్. కుర్రాణ్ణి తీసుకువచ్చేశాను గనుక, ఈ పూటే చేశేద్దాం వివాహం.'

'నీళ్ళుముంచినాసరే, పాలముంచినాసరే; అంతా మీదేభారం.'

'సరేలే; మరేమీ భయంలేదు; వెళ్ళిమాఅబ్బాయితో మాట్లాడివస్తా; పిల్ల ఎక్కడికో పరుగెత్తినట్టుగా వుంది కేకేయ్.'

౬

'ఏరోయ్, అబ్బాయీ, ఆఖరికీ సంబంధం మనకి తప్పనట్టుంది!'

'అల్లాగా!'

'ఈముహూర్తానికి చేసెయ్యమని పట్టుపడుతున్నాడాయన; సమయానికి వాళ్ళూ ఇక్కడకు రావడం చూస్తే దైవఘటన ఇల్లాఉందేమో అనిపిస్తోంది.'

'అనిపిస్తుంది; అనిపిస్తుంది; అన్నీ ఈవతలకు వినిపిస్తూనే వున్నాయ్, ఎన్నియేళ్లొస్తేయేం? కాస్త మంచీచెడ్డా తెలియాలి. ఆస్తి చాలాకలుస్తుందని ఖాయపరుచుకున్న సంబంధంకాదని ఈకపటనాటకమాడతావా? పుస్తెలు తెంపేయమంటున్నావుగా! పట్నంలోవున్న అన్నయ్యలకేనా ఉత్తరాలు రాయలేదుగదా—వాళ్లొస్తేనే డబ్బుఖర్చని; ఎవరో పెళ్ళి చేసుకోవాలనుకుంటూంటే చెడగొట్టి వీళ్ళనిటు తిప్పేవూ? ఖాయపరుచుకున్న ఆసంబంధం, తోసి రాజంటావా ? నావివాహంచేసేటప్పుడైనా, నాసలహా తీసుకోవలసిన అగత్యం లేదనుకుంటున్నావు నువ్వు; ఎంతసాహసం! ఎంతసాహసం!! వాళ్లు పాపం! రాజమంత్రీ వస్తారని కల్పించి నన్నూ వాళ్ళనీ కూడా మోసగిస్తావా ?'

'నేనేంచేశానురా ?'

'చాలు చాలులే. ఊరుకో—ఎవరికిచేస్తావో చెయ్ పెళ్ళి—నేనిదిగో వెళ్ళిపోతున్నా.'

౭

చలపతి, తెల్లమతాబా వెలిగించి కాసేపక్కడ కూర్చుని 'చూశావా, అన్నపూర్ణమ్మా! నాస్థితిల్లా వచ్చిందాఖరికి; నన్నుధిక్కరించి ఎల్లామాట్లాడతాడో చూడు వాడు.' అన్నాడు.

'ఎక్కడికెళ్లేడిప్పుడు ?'

'ఎక్కడికో వెళ్లేడు. ఊరుకుందురూ—మీరూ మీ తెలితేటలూనూ' అంది చలపతిభార్య చురచుర చూస్తూ.

'సరేలే; ఏంచేస్తాం? వాడి కదృష్టంలేదు; నేనింటికెళ్ళి నెమ్మదిగా వాడికి బోధించాలి.'

'మీరేంచేసినాసరే; అంతా మీదే భారమన్నానుగా.' అంది అన్నపూర్ణ.

'పిల్లమంగళసూత్రాలు తెంపలేదుగదా?'

'ఇంకా లేదులెండి.'

'సరే; అల్లాగేవుంచండి ! నేను తర్వాత చెప్తానుగా; ఏదీ నేను నీకిచ్చిన పైకం? బజారుకెళ్లాల్సిన పనుంది.'

'ఏదీ, ఎక్కడుంది? నిన్ననే అంతమొత్తం ఇంట్లోవుండడ మెందుకని ఒకరికివ్వవలసుండి ఇచ్చేశా.' అంది అన్నపూర్ణ.

ఆమాట వినేటప్పటికి చలపతి నిశ్చేష్టుడయ్యాడు. కొంతసేపటికి 'మరెల్లాగిప్పుడు' అన్నాడు తెల్లబోయి.

'మీరంత ఖంగారు పడక్కర్లేదు; కావలిస్తే నోటురాసిస్తాను పుచ్చుకోండి; నుంచున్నపళాన్ని డబ్బు కావాలంటే దొరుకుతుందా—మరీరోజుల్లో?'

'బాగా నేచేశావ్; అప్పుడే ఎవరికిచ్చావమ్మా?'

'ఇల్లావస్తుందని నేననుకున్నానా ? అన్నయ్యా! ఇంతవరకూ మీరుచెప్పినట్లల్లా చేశానా! ఇకముందు కూడా మీరెల్లా చెబితే అల్లాచేయడానికి సిద్ధంగా వున్నానా !'

'సరేలే... వెళ్ళి అణాబిళ్ళలు పట్టుకొస్తా; నోటు రాసిద్దువుగాని; నాకు డబ్బుపోతుందని భయంలేదు-ఐనా వ్యవహారధర్మం...'

'అబ్బే! దానికేం? కావలిస్తే నోటురాసిస్తా; లేదూ—నెలరోజుల్లో పైకమే ఇచ్చేస్తా—మీకా నమ్మకం నామీదుంటే !'

'నమ్మకంలేకేం ? ఉందికాని—వ్యవహారధర్మంగా! నోటురాసియ్; వెళ్ళి అణాబిళ్ళలు పట్టుకొస్తా.'

'సరే. మీయిష్టం;'

౮

'ఏమమ్మా! పైకం అందిందా ?'

'లేదన్నయ్యా! ఇవ్వవలసినవాళ్లు ఇవ్వడంలేదు ; భూమి కొంత అమ్మాలనుకొంటున్నా నీమధ్య; అమ్మినవెంటనే మీడబ్బు మీకిచ్చేస్తా.'

'నాకివ్వవలసిన డబ్బుకోసమే, భూమమ్మడం?'

'కాదు; ఇంకా కొందరి కివ్వాలి.'

'ఏమాత్రముండేమిటి ఋణం?'

'ఉంది, పన్నెండు, పదమూడు వేలదాకా.'

'అసి నీయమ్మకడుపు బంగారంగానూ! పన్నెండు వేలే? ఎంతమోసం? ఎంతమోసం? ఆస్తికిసరిపడ్డ ఋణముందీ?'

'ఇల్లాగే, ఆయన పోయినప్పణ్ణుంచీ ఋణాలు తీర్చలేక నానాబాధా పడుతున్నాను.'

'ఎంతదానవ్? ఎంతదానవ్? నన్ను నమ్మించి ఇల్లాచేస్తావా? శంకరానికి పిల్లనిచ్చి ఆరాత్రే యథావిధిగా వివాహంచేసిన తర్వాతకాదూ నువ్వు రాజమండ్రీ వస్తా? తెలియదనుకున్నావా నాకు?'

'నాకుమాత్రం తెలియలేదనుకున్నారా? మీరు మీపిల్లాడి కొహ సంబంధం స్థిరపరుచుకొని కట్నం వెయ్యిరూపాయిలు ముందుగానే పుచ్చుకొని మా ఆస్తి కలుపుకోవాలనే దుర్బుద్ధితో ఆసంబంధంతోసి రాజనడం, మాకూ తెలిసింది.'

'నీ విటువంటిదానవని తెలుసుకోలేక పోయాను.'

'మీరిటువంటివారని గ్రహించే ఇట్లాచేశా.'

'సరేలే; నీతో నాకు వాగ్వాదమెందుకు? త్వరలో నాడబ్బు నాకు సర్దుబాటు చెయ్యాలి.'

'నేనివ్వనంటున్నానా? ఉన్న ఫదెకరాల్లో ఏడెకరాలు శంకరంపేర్రే ఉందిగదా? మిగిలిన భూమి అమ్మి తీర్చుకోవాలి, మరి—ఋణాలు.'

'అప్పా! ముందు నాబాకీ తీర్చెయ్యాలిసుమా!

'సరే... చూద్దాం; మీరల్లా తొందరపడకండి.'

'ఏమీ తొందరపడ్డంలేదు; డబ్బు చాలా అవసరంగావుండి అడిగేను.'

'ఇస్తానన్నానుగా.'

* * *

డబ్బుకోసం చలపతి, కాళ్ళరిగేటట్టు రెండేళ్ళు తిరిగినతర్వాత—అన్నపూర్ణ ఒద్దుఒద్దంటూన్నా వినక 'ఇచ్చినట్టు, మీనాన్నకింకా రెండేళ్ళదాకా తెలియనీయొద్దంటూ చెప్పి శంకరం తనతాలూకు డబ్బు వెయ్యిరూపాయలుంటే—తీసుకెళ్ళి సత్యానికిచ్చాడని వదంతి.

# ఆధునికులు

రచయిత:

భళ్ళమూడి నరసింహము

కలరు ప్రపంచకోద్ధరణకై తమజీవము ధారవోయు ని
శ్చలహృదయుల్ ; కలారు సరసప్రసవన్నవహావభావ సం
కలిత మృదూక్తులన్ వెలయు కావ్యములన్ రచియించు నేర్పరుల్ ;
కలరు సమస్తశాస్త్రముల కాకలుదీరిన పండితోత్తముల్.
అవతారపూరుషుం డననొప్పి సమతతో నఖిలంబుగాంచు మహాత్ముడుండ
సర్వఖండంబుల సాటిలేనట్టి కవీంద్రుడై బరగు రవీంద్రుడుండ
అఖిలమతంబుల నరయుచు సంస్కరణవ్యవసాయి మాలవ్యయుండ
అచరేంగితావేదియై తత్త్వవిమోడన ధీమంతు డల జగదీశుడుండ
పరమభక్త కవీశ సంస్కరణ చతుర తత్త్వవిదులుండ నీదుసోదరులు తండ్రి !
యెవ్వరును గొప్పవారు నేడిందులేరొ ? పరమసుచరిత్ర ! గనవొ ? యోభరతపుత్ర !
నాడనంగను నేల యీనాడుగూడ కలరుత్యాగులు, దేశోపకారకులును
పక్షపాతంబు, దోషదృక్త్వాత, మసహనాదికముచీడి సత్యంబు నరయు నెడల,

# జిజ్ఞాస : మీమాంస

**౭౭. ప్రాచీనజైనులు : ఆంధ్రదేశమునకు సేవ ?**

ప్రాచీనమందు జైనమత గురువులు ఆంధ్రదేశమందు యెచ్చటెచ్చట నివాస మేర్పర్చుకొనిరి ? వారు ఆంధ్రులకు చేసినసేవయేమి ?

—అడిదము వేంకటరామారావు.

**౭౯. సిగ : కామవాంఛ**

సిగవల్ల స్త్రీలకు కామవాంఛ ఎక్కువ అవుతుందిఅనీ, కొప్పువల్ల అట్లా ఎక్కువ అవదనీ మా నాయనమ్మ అంటుంది. ఇది శాస్త్రరీత్యా సమర్థింపవచ్చునా ?

—తిరువీధుల తాయారమ్మ.

**౮౦. పాలు**

మనము త్రాగు పాలు సాత్వికాహారమని చెప్పుచున్నారు. కాని ఆధునిక ప్రకృతి శాస్త్రవేత్తలు పాలు మాంసపదార్థమేయనియు, కోడిగ్రుడ్లకును, పాలకును భేదము లేదనియు అనుచున్నారు. నిజమేనా ? అయితే పూర్తి శాఖాహారులు పాలనుత్రాగుట నిషేధమేనా ?

—దుర్భ రామమూర్తి.

---

ప్రమాణగ్రంథముల యాధారముపై వచ్చినది కాదు. నిబంధనగ్రంథములు స్వతః ప్రమాణములు కాకపోవుటచే నీయాచారమునకు ధర్మశాస్త్రాధారమున్నదని చెప్పుటకు వీలు లేకపోవుచున్నది. ధర్మసింధుకర్తయగు కాశీనాథోపాధ్యాయుడు 1805-వ సంవత్సరము వఱకు జీవించియుండెను. ఈతడు పండరీపుర వాసుడు. ఇది యాతని దేశకాలములలోని శిష్టాచారము. నేటికికూడ నిది కొన్నిదేశములలో నుండవచ్చును. ఈయాచారము ధర్మశాస్త్రాధారముపై పుట్టినదని చెప్పుటకు వీలు కన్పట్టదు. పండితుల కెవరికైనను ప్రమాణగ్రంథములలో దీని కాధారము గన్పట్టుచో నీ పత్రికాముఖమున తెల్పుదురుగాక !

—జటావల్లభుల పురుషోత్తము, ఎం. ఏ.

**౭౬. ఆశౌచవిచారము : అనువృత్తము**

శృతులు, స్మృతులు, ధర్మశ్రౌత గృహ్యసూత్రములు, పురాణేతిహాసములు—ఇవి ప్రమాణగ్రంథములు. వీనిలో నెచ్చటను కన్యకాశౌచ మక్కఱలేదను వచనము గన్పట్టుటలేదు. కాన నామెకాశౌచాపవాదము లేదని తేలుచున్నది. కూర్మపురాణములో నైష్ఠిక బ్రహ్మచారులకును, బ్రహ్మచారులకును, వనస్థులకును, సన్యాసులకును నాశౌచము లేదనిచెప్పబడినది.

నైష్ఠికానాం వనస్థానాం యతీనాం బ్రహ్మచారిణాం
నాశౌచం కీర్త్యతేసద్భిః పతితేచ తథామృతే.

ఇట్టిస్థలములలోగూడ కన్యపేర్కొనబడకపోవుటచే కన్యకాశౌచము గలదను నంశమే దృఢపడుచున్నది. పైన పేర్కొనబడిన ప్రమాణ గ్రంథములలోని యంశములను విశదీకరించుటకును, సందిగ్ధాంశముల నా గ్రంథముల యాధారముపై చర్చించి సిద్ధాన్తములను తేల్చుటకును నిబంధనగ్రంథములు ముఖ్యముగ నుద్దేశింపబడినవి. స్వతంత్రముగ ధర్మములను ప్రతిపాదించుటకు నిబంధనకారుల కధికారములేదు. వారు తమ దేశములోను కాలములోను నుండిన శిష్టాచారములను గూడ తమగ్రంథములలో తెల్పుటకలదు. కాన ప్రమాణగ్రంథములలో నాధారము కన్పట్టని నిబంధనగ్రంథములలోని ధర్మము లిట్టి శిష్టాచారములేయని మనము తెలిసికొనవలెను. కన్యకాశౌచ మక్కఱలేదను ధర్మమునకు ప్రమాణ ధర్మగ్రంథములలో నాధారము కన్పట్టుట లేదుకాన నది యిట్టి శిష్టాచారమే యని తేలుచున్నది. కనుక నీయాచారమునకు ధర్మశాస్త్రములో ప్రమాణమున్నదా యను ప్రశ్నగల్గినపుడు ధర్మసింధువచనమును చూపుటకు వీలులేదు. ఏలన : ఆవచన మీయాచారమును పురస్కరించుకొని వచ్చినదేకాని

# మూడో పెళ్ళి పెళ్ళాంతో శ్రీకృష్ణాష్టమివ్రతం

(ఏకాంక ప్రహసనం)

రచయిత:

ఉకుమళ్ల కామేశ్వరరావు, బి.ఏ., బి.ఇడి.

దీనిలోని పాత్రలు : అవధానులు – అద్వైతశాస్త్రి మొదలైనవారు.

రంగప్రదేశం : రాజమహేంద్రవరం.

౧

[అవధానులు ఇల్లు. అవధానులు ఒక తడి గావంచాకట్టుకుని అరుగుమీద కూర్చుంటాడు. ఒండినిండా విభూతిరేఖలు. మెళ్ళో మూడువరసల రుద్రాక్షులపేర్లు. తొడమీద మరొకతడిగావంచా. ఒక చెవిలో పావలా కాసు వుంటుంది, రొండిని పొడుంకాయ.

అద్వైతశాస్త్రి ఒక తెల్లపంచ కట్టుకుని, ఒక తెల్లకండువా కప్పుకుని, నడుస్తూ వస్తాడు. అవధానులు అద్వైతశాస్త్రిని చూసీచూడనట్టుగా వూరుకుంటాడు.]

అద్వై:—ఏమండోయి! అవధాన్లుగారూ!

అవ:—(ఉలికిపడ్డట్టు నటించి) అయ్యా! అయ్యా! తమరా, అద్వైతశాస్త్రుల్లుగారా! దయచెయ్యండి, చిరకాలదర్శనం.

అద్వై:—మరేం తొందరపనులు లేవా యేమిటి, తీరుబాటుగా అరుగుమీద కూచున్నారు.

అవ:—లేకేం లెండి. (చిన్న పిలకముడి విప్పి జాడిస్తూ) ఇప్పుడే స్నానంచేశాను. జపం తప మయాయి. కొంచెంసేపు కూచుని తర్వాత పనులుచేసుకుందాం అని... ఇలా దయచెయ్యండి అరుగుమీదికి.

అద్వై:—వస్తున్నా. (అరుగుమీద కూర్చుని) విశేషాలేమీ చెప్పరూ? అన్నట్టు యీమధ్య మీరు ఊళ్లోలేనట్టు చెప్పుకున్నారు, నిజమేనా?

అవ:—ఔను. నిజమే. కిందటి పున్నానికే తిరిగి వచ్చాను, దరిదాపు పక్షుందినాలయింది. కాశీయాత్ర చెయ్యవలసివచ్చింది.

అద్వై:—ఏమిటీ, కాశీయాత్రా! ఎంత పుణ్యం, మీరొక్కరే వెళ్లారా లేక సకుటుంబంగా యాత్రచేసి వచ్చారా?

అవ:—సకుటుంబంగానే యాత్రచేయించాం. (అవధానులుభార్య, మరదలు ఇత్తడి బిందెలు పట్టుకుని, బుజాన్ని యిన్ని బట్టలు వేసుకుని గోదావరికి వెళ్ళడానికి బైటికి వస్తారు.)

అద్వై:—ఆవెళ్ళేవారెవరూ? మీ తాలూకేనా?

అవ:—ఆ, మా తాలూకే, మా ఆవిడా, మా మరదలున్నూ.

అద్వై:—అలాగా. ఉఁ, ఉఁ.

అవ:—మొన్న కాశీయాత్ర చేసినప్పుడు మరింక ముందుజన్మంలో వైధవ్యమనేది లేకుండా వుండేటందుకుగాను మన ఆచారప్రకారం- చిత్తగించారా – మరి – కొప్పులో పువ్వులుముడిపించుకోని, నాతొడమీదే కూచుని తలవెంట్రుకలు కాశీవిశ్వేశ్వరుడి కిచ్చేసింది మా ఆవిడ.

అద్వై:—అలాగటండీ! ఏమిటీ చెప్పారు

కారు ! ఎంత ఆశ్చర్యం !

అవ:—ఏదో మనలాంటివాళ్ళం యింకా వుండబట్టి ఈమాత్రమేనా మన ఆచారాలనీ, మన వ్యవహారాలనీ, మన మతమనీ యింకా నిలిచివున్నాయి. ఇప్పటి మాల ముండాకొడుకుల కిలాంటివి కావాలా యేడుపా !

అద్వై:—నేను మరోలాగ అంటున్నానని మీరనుకోకండి. ఊరికే మాటవరస కంటున్నా. ముందుజన్మంలోకూడా మీ ఆవిడ ఆడపుట్టుకే పుడుతుందని యెవరు చెప్పగలరు ? నరజన్మ ఎత్తుతుందని మీరు నిర్ధారణ చెయ్యగలరా? చెప్పండి చూతాం. ముందుజన్మలో మీరేమై పుడతారో ?

అవ:—మరలా తర్కిస్తే కుదరదు. మన ఆచారంప్రకారం ముందుజన్మంలో వైధవ్యం రాకుండా ఆలాగ యిచ్చివేయడమే వుత్తమం.

అద్వై:—సరే, ముందుజన్మ మాటకేంగాని ఈజన్మమాట యేంచెప్పారు ?

అవ:—ఇప్పటి విషయమై మీరేం చెప్పగలరు, నేనేం చెప్పగలను, ఎవరేం చెప్పగలరు. ఉన్నసంగతులను బట్టి–మరి చూశారా. . .

అద్వై:—ఔనౌను, మీకిప్పుడు దరిదాపు షష్టిపూర్తవుతూంది. ఇప్పటికీ యింకా దగ్గనైనా దగ్గరు. ఎన్నడూ చిర్రున చీదియెరగరు. మీకేం మహారాజులు. రాయితంతే ముక్కలయిపోతుంది.

అవ:—ఒకవేళ దగ్గినా పొడిదగ్గే. పిక్కశరీరం లెండి.

అద్వై:—సరి, వేరేచెప్పాలా యేమిటి! ఈవిడ మూడోపెళ్ళి పెళ్ళామేకదూ.

అవ:—నే నిలాగుంటూవుంటే భూమిమీద వుండగా సుఖమనేది వుండకపోదు. మొన్ననే రాయిలాంటి కట్టకాసులపేరు చేయించి పెట్టాను.

అద్వై:—ఇంకేం భేషుగ్గావుంది.

అవ:—తమవిషయం, మీరు మళ్లా యెక్కడా సంబంధం. . .

అద్వై:—లేదు లేదు.

అవ:—ఆవిడ మహావుత్తమురాలు, గొప్ప యిల్లాలు. పతిభక్తన్నా, జ్ఞానమన్నా ఆవిడ పేరుచెప్పి తక్కినపేర్లు చెప్పాలి. ఉన్నన్నాళ్ళూ మహావైభవంగా జరిగిపోయింది. పూలరథంలో కూచుని వెళ్ళిపోయింది.

అద్వై:—ఇంతకీ అది ధన్యురాలు.

అవ:—ఇంకా అడిగారా ! అది ఆవిడచేసుకొన్న పూర్వజన్మసుకృతం. పసుపుకుంకంతోనే అలాగ ముత్తైదుతనంతో వెళ్ళిపోవడంవుందే ఆయోగం ఎంతెంతవారికోగాని పట్టదు. ఆవిడకేమండీ, పిల్లలంతా పెద్దవాళ్లై, వాళ్ళకథలూ కార్యాలూ జరిగి, అవన్నీ తనచేతులతోటే జరుపుకుని – కొడుకులు కోడళ్లు కాపరాలు చేస్తూవుండగా, ఇటువంటి మరణముందే, అది మరణ మనిపించుకోదు. అందరికీ అలాంటియోగం పడుతుందా !. . .మీ మూడో అబ్బాయికూడా బియ్యే ప్యాసయాడా ?

అద్వై:—ప్యాసయినట్టుగా మొన్ననే వాళ్ళ లెక్చరర్ గారు చెప్పారట. ఇంకా ఫలితాలు వార్తాపత్రికలలో పడలేదు.

అవ:—చాలాసంతోషం, పరమసంతోషం మీఅబ్బాయి పరీక్ష నెగ్గిందంటే నాకు మహా ఆనందంగావుంది. . .మావాడు మళ్ళీ మెట్రిక్కులేషనుకు కట్టాడు. అప్పిడే యిది నాలుగోమారు. ఈమారైనా గట్టెక్కు

తుందో లేదో, చాలా బాగారాశానంటు న్నాడు. వంచినతల ఎత్తలేదుట, ఉంచిన కలం ఆపలేదుట. ఇంకా రాశేవాడుట కాని అక్కడో పెద్దమనిషి కాయితా లిచ్చాడు కాదుట, వాడికేం పోయి కాలంపుట్టిందో.

అద్వై:—పరీక్షప్యాసులు వాళ్ళవాళ్ళ అదృష్టం.

అవ:—అది పూర్వజన్మాన్ని చేసుకున్న మహాపుణ్యాఫలంవల్ల జరగవలసిందే. మనం కష్టపడితేమట్టుకు అవుతుందా యేమిటి. ఆరేఖ బైటపడాలి, అదృష్టంపట్టాలి. ఆ యేలినాటి శనిరోజులు వదలిపోవాలి, వాడు పరీక్ష కడతేరాలి. ఇంకా రెండుమూడేళ్ళవరకూ ఆశనిగాడు వదిలిపెట్టేటట్లు లేదు జాతకరీత్యా. పోనీ యీమాటుకు కట్టడం మానెయ్యరా అబ్బాయీ అన్నాను.

అద్వై:—ఊఁ ఊఁ, మనప్రయత్నం మట్టుకెప్పుడూ మానెయ్యకూడదు, ఎటువంటి సందర్భంలోనైనా సరే.

అవ:—అదిగదీ. సరియైనమాట సెలవిచ్చారు. అందుకనే పదిమార్లు ఫేలయినా సరే చదవమనే అంటాను. ఆకాస్తా గట్టెక్కితే తీరిపోతుందని.

అద్వై:—ఆ. నిజమే...మరి మీ ఆవిడతో వెళ్ళిన ఆరెండోపిల్ల యెవరని అన్నారు.

అవ.—అదా అండీ. మామరదలు. మీకు తెలిసేవుంటుంది. మొన్ననే కాపరాని కెళ్ళింది. వెళ్ళి నాలుగురోజులయిందో లేదో ఇంతట్లోకీ ప్రళయంలాంటి జబ్బొచ్చి పడిపోయింది. బతికి మళ్లా భూమిమీద అడుగుపెడుతుందని యెవ్వరం అనుకోలేదు. దానిఅదృష్టం, దానిమొగుడు అదృష్టం. సరిసరి అనిపించేటప్పటికి అప్పుడు తిరపతివెంకటేశ్వరుడికి నిలువుదోపు, తలవెంట్రుకలు యిస్తామని మొక్కుకున్నారు. అందుమీద ఆభగవంతుడి కటాక్షం వల్ల నిమ్మళించింది. శరీరం కొంచెం బాగుపడ్డాక ఈమధ్య. వారంరోజులకిందటే తిరపతికివెళ్ళి అదికాస్తా తీర్చుకు వచ్చారు.

అద్వై:—ఆలాగా, నాకీమాటే తెలీలేదు. ఎంతపనిజరిగింది. ఆపిల్లమొగు డేంపనిలో వున్నాడు.

అవ:—వాడొకమోస్తరుగా చిన్నవాడేలెండి మనయీాడు లేకపోయినా పాతికేళ్లుంటాయి. తక్కువవుండవు. ఇక్కడే మన వూళ్ళోనే మునిసిపాలిటీ యిలాకాలో అదేదో పనిష, ముప్పైరూపాయిలిస్తారుష. మీ రాకుర్రవాణ్ణెరగరండీ! అప్పుడప్పుడు-క్రాపింగున్న ఎర్రటి పల్చటిమనిషి మాయింటి కొస్తూవుంటాడు. మీరు చూసే వుంటారు.

అద్వై:—నాకంతబాగా జ్ఞప్తిలేదు. చూసేవున్నానేమో. అంటే మనవూళ్ళోనే వున్నాడన్నమాట.

అవ:—ఆ. ఇక్కడేవున్నాడులెండి. వాడో వుత్త వెర్రిముండాకొడుకు. ఇంతకీ చెప్పవచ్చే సంగతేమిటంటే, పెళ్లాన్నింటికి రావద్దన్నాడు.

అద్వై:—అదేం గ్రహచారం!

అవ:—ఆవెర్రినాగన్న మరేమో వెంకటేశ్వరుడికి నిలువుదోపియ్యాడాని కొప్పుకుంటాడుటగాని - ఇప్పుడుకాకపోతే మరొకప్పుడేనా వస్తువువాహనం చేయించుకోవచ్చుననిష - మరి వెంట్రుకలుమాత్రం తీయించకూడదని పట్టుపట్టాడు.

అద్వై:—అలాగా!

అవ:—ఇంక పట్టులోనూ పట్టుకాదు, వెర్రిపట్టు, మొండిపట్టు, పిచ్చిపట్టు పట్టాడన్న

మాట, సందేహంలేకుండా. అప్పుడు మీ లాంటి పెద్దలందరూ బతిమాలుకుని నాయనా బాబూ వెంకటేశ్వరుడి మొక్కురా అది, మరోటీ మరోటీ కాదని కాళ్లూ, గెడ్డం పట్టుకుని "అన్నప్ప డియ్యక తప్పదు. తప్పనిసరి. మన ఆచారంప్రకారం చెయ్యవలసిందే" అని బతిమాలగా బతిమాలగా ఆఖరికి దారిలోకివచ్చాడు. దారిలోకివచ్చి మళ్లాయేంచేశాడూ, తన పెళ్లానికి బాగా జుత్తెదిగేవరకూ తనయింటికి పంపించొద్దని పెద్దగోలచేసి యింటినుండి ఉరుము లెడుతూ బొబ్బలెడుతూ వెళ్ళిపోయాడు.

అద్వై:—అంతకథ జరిగిందిటండీ! నాకు తెలియనేలేదు.

అవ:—అంచేత ప్రస్తుతం మాయింట్లోనే వుంటూంది. మరేదో యిలాగే జరిగిపోతూంది. ఈకాలపు కుంకలికి పెద్దా పిన్నా భేదంలేదులెండి. వాళ్ళకో దేవుడూ దెయ్యం అంటూలేదు. ఒక ఆచారమంటూ లేదు. తమకు తెలియడంలేదు, ఒకళ్లు చెప్తే వినడంలేదు, విన్నారా– తదుపరి.

అద్వై:—ఇంతకీ అవధానులుగారూ! నేనొకమాట అడుగుతాను కోప్పడకండేం, ఏదో తెలియక అడుగుతున్నానని మెంచుకోండి.

అవ:—మరేం తప్పలేదు, మీబోటి పెద్దలడగ్గా లేంది.

అద్వై:—పైలాంటి ఆచారాలన్నీ దేశానికీ, ప్రజలకీ అనర్థమని మీకు బోధపడడం లేదూ? ఆవెర్రి ముండా దేవుడు మన వెంట్రుకలిస్తేనేగాని మనమీద దయవుంచడూ! మనస్సు ముఖ్యమూ లేక మరి మీరిచ్చేటటువంటి వెంట్రుకలు ముఖ్యమూ? మన వెంట్రుకలు వాడికేం ధనధాన్యాలా, ఆస్తిపాస్తులా? ఇంతకీ ఒంటికి బాధలేని పని కాబట్టి వెంట్రుకలిచ్చేస్తున్నారు. అదేదో కాలో చెయ్యో తెగకోట్టు కోడమో, మెడపిసుక్కోడమో అంటే ఎవడూ యేదయ్యానికీ దేవుడికీ యీకాలంలో మొక్కుకోడు. వీటికి తెగించిన మాథులు పూర్వకాలంలో వుండేవాళ్లులెండి. అది వేరేసంగతి. . . నే నిలాగంటున్నానని మీరు కోప్పడకండి, ఆకుర్రవాడు పట్టిన పట్టు నాకు చాలానచ్చింది. తెలివితేట లున్నవాడు, జ్ఞానవంతుడు కాబట్టే అలా అందరినీ యెదిరించగలిగాడు. . .ఏం దేవుడండీ వెంట్రుకలతో తృప్తిపడే దేవుడు! (నవ్వి) అటువంటి అందమైనటువంటి వెంట్రుకలను– తలకంతా సొగసిచ్చే వెంట్రుకలను– మంగలిపేరుకాని, క్షవరంపేరుగాని చెప్పితే ఎప్పుడూ ఆపాదమస్తకం కంపించే స్త్రీలకు ఆతలవెంట్రుకలు లేకుండా– పరువు, మర్యాద, యోచన, వివేకం లేకుండా అడవి లంబాడీలలాగ వెర్రిపిచ్చి ఆచారాలను పెట్టుకోని, వెర్రి వెర్రి మొక్కులు మొక్కుకొని అహోరిస్తూ వుంటే మనను నాగరికు లనుకోడమూ, అనాగరికు లనుకోడమూ?

అవ:—మీమాట కష్టోస్తున్నా, క్షమించండి. విధవల శిరోముండనాన్ని గురించి కూడా మీ అభిప్రాయా లిలాగే వుంటాయేమో! (నవ్వుతున్నాడు).

అద్వై:—ఆ దురాచారాన్ని దుంపనాశనం చేసెయ్యాలి. దాన్నిగురించి యిప్పుడు వాదనపెట్టుకోను. . .మనం నాగరికులమనా? అనాగరికులమనా? ఇటువంటి పిచ్చి పనులు మనమింకా యెప్పుడూ మానుకోడం? ఆ శ్రీకృష్ణభగవాను డొక్కటేవిధంగా అందరికీ బోధచేసిందేమిటి, మనం

చస్తూన్నాన్న దేమిటి!

అవ:—శాస్తుల్లుగారూ! మీరలా కోప్పడితే నే సమాధానం చెప్పలేను. కాని ఒక్క సంగతిమాత్రం మనవిచేస్తా. ఆలకించండి. ఒక్కసంగతి. మన ఆచారాలూ వ్యవహారాలూ అన్నప్పుడు తత్వశాస్త్రం, వేదాంతం అలాపెట్టి దేశాచారాలప్రకార్ణం చెయ్యవలసిందే, వింటున్నారా?

అద్వై:—ఎప్పటికీ యోచనక్కరలే! మనం చేసుకున్న ఆచారలను మరి మనం విమర్శించుకుని మంచిచెడ్డలు చూసుకోనక్కర్లే! వివేకంలేని యేంమాటలన్నా అవి.

అవ:—నామాట కొంచెం చిత్తగించండి. నేను చెప్పేదేమిటంటే, వెంట్రుకలే యిచ్చివేయడమనే దెంతగొప్పఆత్మత్యాగమో ఆలోచించండి. అంత ప్రేమతోటీ, అంత చక్కదనంకోరీ పెంచుకున్నటువంటి వెంట్రుక లిచ్చివేయడమంటే యెంత గొప్పత్యాగమో అది గ్రహించండి.

అద్వై:—కాళ్లూచేతులూ నరుక్కోవడం అంతకంటే గొప్ప ఆత్మత్యాగంకాదూ? కాని యిది సరియైనమార్గమా? మనస్సుతో తీరిపోయేదానికీ బాహ్యచేష్టలెందుకు? పై దుర్మార్గం మూడుపూట్లా పొట్టవిచ్చేటట్లా తింటూ, యీప్రపంచం ఉత్తమాయ అంటూవుండే దొంగవేదాంతులు నేర్పినది...మన యీ ప్రపంచక జనుల్నిగూర్చి చెప్పేదేమంటే, ప్రార్థన చేతా, భక్తిచేతా భగవంతుణ్ణి తృప్తి పరచవలసిందే. దానితో సరికాదు. ఈ ప్రపంచకవిషయాలమీదకూడా సమానమైన శ్రద్ధకలిగి వుండాలి. దేవుడు అనేటువంటిది మనిషికి మూలమట్టంగా వుండవలసిన విషయంగాని అదే మూలమట్టంగానూ అదే కట్టడంగానూ వుండవలసినదికాదు. పైదురాచారంలో ప్రపంచకంవైపున్న ధర్మం ధ్వంసమైపోయింది. తల బోడిచేయించుకు కూచుంటే ప్రపంచకధర్మం అనగా అందం, సౌఖ్యం, సంసారం మొదలైనటువంటివి నాశనంచేసుకుందన్నమాటేనా. అది న్యాయమా? సవ్యమా?

అవ:—ఆగండి, ఆగండి. ఒక సందేహం విధవలపట్ల శిరోముండనం మంచిదేనా?

అద్వై:—శిరోముండనంవల్ల స్త్రీల కోమలమైన మనస్సులు క్రూరంచేసేస్తున్నాము. శిరోముండనంపైనే నీతివర్తన ఆధారపడి వుండలేదని మనకు తెలిసినసంగతే...తల బోడయినంత మాత్రాన్ని తలపులు బోడి అవవు. ఇదంతా నేను ఒక్కప్రపంచక జనులవిషయమై చెబుతున్నాను. అంతేగాని కేవలం దేహచింత మానివేసి ఆత్మసాక్షాత్కారం, ఆభగవంతునితో ఐక్యమైపోడమే ఆదర్శంగా పెట్టుకునేటటువంటి ఆమహాఋషిసత్తములున్నారే, ఆ పరబ్రహ్మస్వరూపులు వారి విషయంకాదు నేను చెప్పేది. అవతల భగవంతుడూ, ఇవతల ప్రపంచకం ఈరెండు ధర్మాలూ నెరవేర్చవలసివుంది సంసారులికి.

అవ:—మీరన్నది నేను కాదనను, కాదనడానికి నేనెంతవాణ్ణి. ఏదో ఈ ఆచారాల నేవి నశించిపోయేవరకూ ఇలాగ జరుగుతూవుండవలసిందే, తప్పదు.

అద్వై:—ఆమాట నిజమేకాని నేను నొక్కి చెప్పేదేమంటే దురాచారాలను నాశనం చెయ్యడానికి ప్రయత్నంచెయ్యాలి. అంతేగాని మనకెందుకని వూరుకుంటే కుదిరే సంగతికాదు. చెడ్డఆచారాలు పోవడం—

మంచిఆచారాలు రావడం జరగాలి. నాగరికతగల జాతికీ, దేశానికీ విధాయకమది.

అవ:—తమరు సెలవిచ్చినప్రకారం జరగవలసిందే, మీలాంటి మహామహులు పూనుకుంటే జరక్కపోతుందా !

(''అయ్యగారూ, ఏమండోయి, బాబుగా రండీ, ఏమండో శాస్త్ర్లోరు''అని కేకలు)

అవ:—ఆఁ ఆఁ–అరవకు, వస్తున్నా(వెళ్లును)

(''కలవపువ్వులు తెచ్చానండి, రండి–బాబూ రండి, బేగెల్లిపోవాలి, పొద్దెక్కిపోనాది'' అని కేకలు)

అవ:—పిల్లా !

(''ఓయ్''అని కేక)

అవ:—ఆకలవపువ్వులు పుచ్చుకుని లోపల పడేయించు.

(''అలాగే''అని కేక. అవధానులు తిరిగి వచ్చి కూచుంటాడు.)

అవ:—అయ్యా, శాస్త్రుల్లుగారూ ! ఇంతకీ తమతో అసలుసంగతి మనవిచెయ్యడమే మరిచిపోయాను. మాటలసందడిలో పడిపోయాను. . .మాఇంట్లో యివాళ దీపాలవేళప్పుడు శ్రీకృష్ణాష్టమీ వ్రతం చెయ్యడానికి నిశ్చయించుకొన్నాం. తమ రావేళకు తప్పక దయచేసి నన్ను కృతార్థుణ్ణి చెయ్యాలని మరీమరీ కోరుకుంటున్నా.

అద్వై:—ఓ! నిరభ్యంతరంగా, ఇటువంటి పుణ్యకార్యానికి రాకపోతానా. వేరే బొట్టుపెట్టి పిలవాలా ! వ్రతానికి కావలసిన సామగ్రిఅంతా సిద్ధంచేయించి వుంచారా ?

అవ:—దానికేం కొదవ? రెండువేల కలవపువ్వులు తెప్పించాను. ఇదిగో యిప్పుడీ కేక వేసినవాడు వాడే. అది సిద్ధమయింది.

అద్వై:—రెండువేలే! రెండుచెరువులు ధ్వంసమయేయన్నమాట! అన్ని పువ్వులే!

అవ:—అసలు యెస్టిమేటులో నాలుగువేలని వేయించాను, మహావైభవంగా జరుపుదాంకదా అని. ఇల్లి వీడికి చెప్తే బాబోయి అన్నిపువ్వులు దొరకవని గుండెబాదుకున్నాడు. అట్లాఅయితే అథమం మూడువేలేనా తెప్పించిపెట్టని మాటయిచ్చాను. దొరకడం కష్టంగావుందని రెండువేలు మాత్రమే తెచ్చాడు. భక్తికి అంతెక్కడ? ఏదో ఎక్కడికక్కడే తృప్తిపడాలి. చేసినకొద్దీ వుందని వూరుకున్నాను. వెయ్యికి మూడుచొప్పున ఆరు రూపాయిలు బిళ్ళకుడుములా వాడిచేతిలో పడేశాను.

అద్వై:—అబ్బా !

అవ:—ఇలావ్రతం చేయిస్తానని చెప్పి దేవుడిగుళ్ళో అందరినీ చందావెయ్యమన్నాను. ఆమట్టుగ సీయామ్మగారు అంటే మన బుచ్చన్నప్లీడరుగారితల్లి భారమంతా తనమీదే పెట్టుకుని కాస్త సర్ది పెట్టింది.

అద్వై:—ఉఁ ఉఁ.

అవ:—తమ రేమీ ఈ సంవత్సరం ఉత్సవం తలపెట్టలే ?

అద్వై:—నాపూజంతా ఎంతలెండి! ఏదో రెండుపువ్వులువేసి నాకున్నశక్తి యింతే అని మనస్ఫూరా ఒక్క నమస్కారంచేసి వూరుకుంటాను.

అవ:—తమ కింకా తెలిసిందో లేదో మన కొండయ్యశాస్త్రికూడా ఈవ్రతం చేస్తానంటున్నాడు !

అద్వై:—అలాగా, మంచిదే.

అవ:—వాడిమొహం చేస్తాడు, వెర్రి ముం

డాకొడుకు. మొన్న నన్నడిగాడు, ఎక్కడేనా కలవపువ్వులు తెచ్చేవాళ్లుంటే వాకబ్బుచేసి పెట్టమని. నాకెవరూ తెలియదన్నాను. వాడికి ప్రాయశ్చిత్తం జరగాలి లెండి. ఆమధ్య చల్లావారింట్లో నేను సత్యనారాయణవ్రతం చేయించడాని కొప్పుకొని నాదగ్గిర పుస్తకంలేకపోతే, వాడి నొకమారు "ఇవ్వవోయి పుస్తకం" అన్నాను. అంటే నాపుస్తకం మునుపే పోయిందన్నాడు, అదీ పుస్తకం తన ఇంట్లోవుంచుకునే !

అద్వై:—ఉఁ.

అవ:—అందుకు తగిన ప్రాయశ్చిత్తం చేశాను లెండి. వాడివ్రతం తగలడింది. పువ్వులూ గివ్వులూ యెక్కడాదొరకలే.

అద్వై:—ఎంతపని చేశారు !

అవ:—అలా వాడికోమారు నమ్మకంగా జరిగితేగాని బుద్ధిరాదు. (లేస్తూ) మరొక్కమారు బజారువెళ్ళి రావలసివుంది... మరి మీరు ఇదే పదిపిలుపులుగా భావించుకొని నన్ను సంతోషపెట్టాలని ప్రార్థిస్తున్నాను, ఉంటానుమరి.

అద్వై:—చిత్తం, అదెంతపని? తప్పకుండా వస్తా. సెలవిప్పించండి.

అవ:—శుభం, శుభం.

(వెళతారు)

౨

[చీకటివేళ. అవధానులుయిల్లు. రెండున్నరగజాల చతురంగల గదిలో, అవధానులు, సోమిదేవమ్మ పీటలమీద కూర్చుంటారు. దీపధూపాలు. కలవపువ్వులు గజమెత్తుకుప్పగా పూజచేయబడి వుంటాయి. గదికి రెండువైపులా అమ్మలక్కలొకవైపూ, శాస్త్రుల్లవారొకవైపూ కూర్చునివుంటారు. అద్వైతశాస్త్రివస్తాడు.)

అవ:—అయ్యా ! వచ్చారా ? నమోనమః. దయచెయ్యండి. ఇలాగు.

అద్వై:—(శ్రీకృష్ణపటానికి నమస్కారంచేసి) వ్రతం ఎంతమట్టుకు జరిపించారు ?

అవ:—విష్ణుసహస్రనామాలూ, అష్టోత్తరశతనామాలూ అన్నీ చదవడమైపోయాయి. ఇంక వ్రతఫలం మాత్రమే వుంది. అదే చదువుతున్నా.

అద్వై:—చిత్తం, మనకొండయ్యశాస్త్రి తానుకూడా ఒకమారు వ్రతం చూస్తానన్నాడు. వాణ్ణికూడా తోడ్కొనివస్తా.

అవ:—కొండయ్యేనా ! చిత్తం, చిత్తం వేగిరం దయచెయ్యించండి.

(అద్వైతశాస్త్రి వెళ్లును)

(అవధానులు వ్రతఫలం చదువుతున్నాడు కొంతసేపటికి అద్వైతశాస్త్రి, కొండయ్యశాస్త్రి వస్తారు.)

అవ:—కూచోండి. కూచోవోయి కొండయ్యా! ఆఖరుకే వచ్చింది వ్రతం. మరెంతోలేదు. నువ్వొచ్చినందుకు చాలా సంతోషం !

కొండ:—అదే నాకు పదివేలు !

అవ:—(వడివడిగా చదువుతున్నాడు) ఎంతోలేదింక. అయిపోయింది, అయిపోయింది. శారసాల పంచిపెట్టెయ్యండి, వేగిరం, వేగిరం.

సోమి:—అలాగే.

ఒకటోశాస్త్రి:—అదేమిటండోయి, అలాగంటున్నారు ? శారసాల అంటున్నారేమిటీ !

ఒకటోవిధవ:—సోమిదేవమ్మగారుకూడా ఒప్పేసుకుని ఆలాగే అన్నారు.

అవ:—ఏమిటీ నేను బారసాల అన్నానా? లేదండీ, ప్రసాదం పంచిపెట్టమన్నాను, కాదుటే.

సోమి:—(సిగ్గుతో) నాకు ప్రసాదంలాగే విన బడింది.

రెండోశాస్త్రి:—ఇంతటి అఖండమైన వ్రతం చేయిస్తున్నారంటే సద్యఃఫలితం కన బడ కేంపోతుంది.

రెండోవిధవ:—నిజమే! కాకపోతే మరి!

ఒకటోశాస్త్రి:—మనకు తెలియకుండానే ముందు జరగబోయేవన్నీ మనతోటే చెప్పేస్తా డా(శ్రీ)కృష్ణమూర్తి.

ఒకటోవిధవ:—సోమిదేవమ్మగారు కూడా అలా అన్నారు. మరింక తప్పుతుందా యేమిటి! ఎంతటి అదృష్టమో చేసుకోక పోతే ఇలాంటివ్రతం చెయ్యడం కలుగు తుందా? దానికి ఫలం కలగకపోడ మం టూ వుంటుందా?

అందరూ:—తప్పదు. జరిగి తీరుతుంది.

అవ:—తమరందరకీ ప్రసాదంఅందిందా అం డీ. అందనివాళ్లెవళ్ళైనా ఆడవాళ్ళుగాని మొగవాళ్ళుగాని వుంటే కటాక్షించి పు చ్చుకోవాలి. అది నాప్రార్థన!

అందరూ:—ప్రసాదమందింది మాకు.

అవ:—నాప్రార్థన మన్నించి తమరంతా ద యచేసి వ్రతం జయప్రదంగా జరిపించి నన్ను కృతార్థునిచేసినందుకు మీకు నా పునఃపునః నమస్కారాలు.

అందరూ:—పెద్దలు—మీకు మొదట మా అభివందనాలు.

(అందరూ లేచిపోతారు.)

అద్వై:—(పోతూ తనలో) కొండంతపూజ చేశాడు. చేస్తేమట్టుకు ఏంఫలం? ఏమి ప్రయోజనం. చివరికి శ్రీకృష్ణభగవాను డుపదేశించిన కర్మఫలత్యాగానికి వ్యతి రేకమే అయింది.

(అందరూ వెళ్ళిపోతారు)

## సౌఖ్యరహస్యము

రచయిత:

గోదావరి సత్యనారాయణ, బి.ఏ.

కొదువలేనట్టి శాంతిసంపదను బడయ
మెండుగా నీవు మది కోరుచుండెదేని,
దుఃఖపరిణామములనుండి దూరమైన
భవ్యసౌఖ్యంబు గన నాసపడెదవేని,
ప్రేమమయజీవనములోని విస్తృతసుధకు
డెందమున దప్పిగొని మూర్తి జెందెదేని,
స్వార్థతను వీడి నీచత సారద్రోలి
పాపకార్యాలచెంత పోవలదు నీవు.

బహుళదుఃఖాన్వితంబైన పథమునందు
మిగుల సంతాపమునుబొంది వోగిలెదేని,
కరము శ్రమజెంది తొట్రిల్లు కాళ్ళతోడ
వక్రగతి నీవు పెడత్రోవ బడితివేని,
కష్టమనుమాట వినరాని గాథశాంతి
నిలయమునుజేర హృదయాన తలతువేని,
స్వార్థమునుజంపి తుచ్ఛజీవనము వేగ
బలియొసంగుము సౌఖ్యసంప్రాప్తికొఱకు.

# ఆమె ఒక జాతిమనిషి

రచయిత:

ఆకుండి సత్యనారాయణ

[గతసంచికకు తరువాయి.]

వెనకటింటి పెరటితలుపు తెరిచేసరికి 'అది పెరడా?' **అని** ప్రశ్నించాడు శాస్త్రి.

'చూదురుగాని రండి!' అని ఆమె ముందునడువగా వెనకనే అతడు వెళ్లాడు.

రకరకముల చామంతి, గులాబిమొక్కలు పూలతో కలకల్లాడుతున్నాయి. వాటిని చూసేసరికి శాస్త్రికి అమితమైన ఆనందం కలిగింది. ఊగుతున్న కొబ్బరిమట్టలలోనుంచి రేగుతున్న చల్లనిగాలి ఎన్నిసార్లు సర్దుకుంటున్నా లక్ష్యపెట్టకుండా విశాలం ముంగురులనూ, పైటచెరగునీ ఊరికే చెదరగొడుతూంది. విశాలం పూలమొక్కల మధ్యనుంచి మెల్లగా సాగుతూంది. శాస్త్రి ఆమె అందాన్నే చూస్తూ పక్కనుంచి నడుస్తున్నాడు. ఆమె జుట్టుయొక్క సువాసనా, ఆ మెరిసే కళ్లూ, ఆపైటఎత్తులో దాగిఉన్న అందముయొక్క తలపూ అతణ్ణి వెర్రెత్తిస్తున్నాయి. ఇంతవరకూ ఎవరికాపుమీద వారున్నారు. కాని ప్రేమ ఎంతమధురమైందో అంత తీవ్రమైంది. దానిశక్తికి లొంగిపోకుండా ఉండడం ఎవరితరం? అతడలా చూస్తున్నకొద్దీ అతని కింకా దగ్గరగానూ, అతనికోసమై ఇంకా అందంగానూ ఉండాలనే అభిలాష ఆమెకు తీవ్ర మవుతూంది.

విశాలం చేతికందుబాటులోఉన్న రెండు గులాబీపూలుకోసి ఒకటి శాస్త్రికిచ్చి ఒకటి తనతలలో ఉంచుకుంది. ఇరువురూ గుబురుగా పెరిగిన జాజిపందిరికిందకు వెళ్లారు. విశాలం మెల్లగా అంటూంది: 'అబ్బ!...ఏమిటండీ ఆపనీ...' కాలం జరిగిపోయింది—

వారాముూల విశ్రాంతికోసం కూర్చుని ఉంటారు. కూర్చోడమా! ఉత్తనేనా? ఆశ్చర్యకరమైన సంగతి. శాస్త్రి అంటున్నాడు: 'అబ్బాయిగారి డాబామీద ఎవరో ఉన్నట్లుంది!' అమెకుకూడా తెరచాపలలో ఎవరో మసులుతున్నట్లయింది. కాని అటువంటి అమూల్యమైన, అతిమధురమైన సమయంలో అటువంటివాటిని గురించి ఎవరు తలబెడతారు? ఆమె పూర్తిగా లొంగిపోయింది. చిరునవ్వుతో 'ఎవరూలేరు' అంది.

నాలుగుగంటలయింది. ఆమె చప్పున లేచింది. ఇరువురూ వెలుపలకు వచ్చారు. శాస్త్రి మండడిద్వారంతన్న తనబసకు వెళ్ళిపోయాడు. అతడప్పుడే వెళ్ళిపోవడం మంచిదయింది. విశాలం లోనికివచ్చిన రెండుమూడు నిముషాలలోనే భర్త తలుపుతట్టాడు. ఆమె తలుపు తెరిచింది. ఆమెచేతిలో ఏదో పత్రిక ఉంది. పాపం, ఇంట్లో ఒక్కర్తా ఉన్నందున ఏమీతోచక భర్తవచ్చేవరకూ దానిని చూసుకుంటూ కాలంవెళ్ళబుచ్చి ఉంటుంది!—

౬

శాస్త్రి వెళ్ళిపోతున్నాడు. అతడు వెళ్ళి

పోవాలని ఎంతో తొందరపడుతున్నాడు.

'ఒక్కరోజుండకూడదా?' అంది విశాలం.

ఊహు. అతనికి మరి ఆగడానికి అవకాశంలేదు. ఇప్పటికే చాలా ఆలస్యమైందని అత డెంతో విసుక్కుంటున్నాడు.

'ఓస్! ఒక్కరోజుండమంటే ఉండకూడదా? నువ్వు వెళ్ళిపోతే నాకేమీతోచదు.' అంది విశాలం దీనంగా.

శాస్త్రికి మాటలకోసం తడుముకో నవసరంలేదు. చిరునవ్వుతో అన్నాడు: 'తోచకేం? అబ్బాయి ఉన్నాడు కాదూ?'

అబ్బాయి—! ఆమె కామాట కొంచెం కష్టంగా వినబడింది. అబ్బాయి సంగతి ఇతని కెలా తెలిసింది? ఆమె ఒక్కసారి తుల్కుపడింది. కాని, అంతలోనే తేరుకుని అబ్బాయి విషయమై అతనికి కొంచెం అసూయకలిగించాలనే ఉద్దేశంతో 'అబ్బాయి ఉన్నాడులే— చాలా సందడిమనిషి. అతనిమాటలూ అవీ చాలా తమాషాగా ఉంటాయి—' అంటూండగానే 'సరేలే—ఇప్పు డతని ఊసెందుకు?' అన్నాడు శాస్త్రి.

అతని ధోరణిచూస్తే అబ్బాయి విషయమై అతడు ఈషత్తూ అసూయచెందినట్లుగాని, ఆ లక్ష్యమే అతనికున్నట్టుగాని కనబడలేదు. అది అతని సహృదయత్వంవల్లనో, గర్వంవల్లనో, లేక అబ్బాయినిగురించి అసూయపడేటంత మమకారం విశాలంయందతనికి లేకపోవడంచేతనో నిర్ణయించడం కష్టం.

'పోనీ, ఈఒక్కపూటా ఉందూ! సరదాగా గడుపుదాము!' అంది విశాలం తిరిగి దీనమైన స్వరంతో.

ఊహు. అతడు ఒక్కపూటకూడా మరి ఉండలేదు.

బహుశా శాస్త్రి ఇప్పటికి ఈ ఆటతో విసువెత్తి ఉంటాడు. మొదటిచూపులోనే విశాలాన్ని ఆకర్షించి సుమారు రెండు వారములు ఆమెను కేవలం తనదానినిగా చేసుకుని ఆమెతో తన ఇష్టమువచ్చినట్లు హాయిగా గడిపాడు. అతడు కోరిందంతే. అంతకంటె ఆమెతో కొనసాగా ఇక్కడ ఆడుకుంటూ కూర్చుండికి అతని కవకాశంలేదు. అదే అతని ఆశయంకాదు. ఒకస్త్రీకోసం దేవులాడుతూ కూర్చోడంకంటె అతడు చేయవలసిన ముఖ్యమైన పనులెన్నో ఉన్నాయి.

కాని విశాలానికి తగనిధైర్యం వస్తున్నట్లుంది. ఇప్పుడామె దేన్నిగురించీ ఆలోచించలేదు. ఏలక్ష్యమూ ఆమెకున్నట్లు కనబడదు. వారిరువురకూ ఉన్న సంబంధం ఎంతోకాలం దికాకపోవచ్చును. కాని శాశ్వతమైనదిగా ఉండడానికి తగినంత గాఢంగా ఆమె హృదయంలో హత్తుకుపోయింది.

'అబ్బ! ఈపూట నిన్ను వెళ్ళనీయను' అని అతనిచేయి గట్టిగా పట్టుకుంది. 'తనకు అధికారముందా, ఇది చేయవచ్చునా, కూడదా?' అనే ఆలోచనే ఆమె కప్పుడు లేదు. ఎవరైనాచూస్తే? భర్తచూస్తే... లేక తెలుస్తే?—తల పగిలిపోతుంది! అయితేనేం? ఆమె కాలక్ష్యమేలేదు. కాని ఆమె తనవేళ్ళకింద అతని అయిష్టతను గ్రహించి ఉంటుంది. మెల్లగా చేయి వదిలింది.

అతడు తొందరగా 'నేనువెళ్తాను మరి— వేళవుతూంది; ఇంకా సామానూ అదీ సర్దుకోవాలి' అంటూ కదలిపోయాడు.

అతడు వెనకటింటి ముందరిచీడీలో సామాను సర్దుకుంటూ ఉంటే మందడిద్వారంలో నిలుచున్న విశాలంవక్షం తీవ్రంగా కొట్టుకుంటూంది. ఆమె అతనివంకే చూస్తూంది.

అతడుకూడా తనవంకే చూస్తున్నందున వెళ్ళిపోయేముందు మరోసారి తనచెంతకు వస్తాడని ఆమెనమ్మకం. వస్తే అతనికేదో చెప్పాలనో, లేక జ్ఞాపకచిహ్నంగా ఏదేనా బహుమతీ ఇవ్వాలనో ఆమెకోరిక—కాని అతడు మరి రాలేదు. అక్కణ్ణించే చిరునవ్వుతో తన కృతజ్ఞతను తెలియచేసి వెళ్ళిపోయాడు.

ఆమె అక్కడే నిలబడిపోయింది—

కొంతసేపటికి తేరుకుని మెల్లగా ఇంట్లోకి వెళ్ళింది. మంచంపైని వ్రాలి వెక్కివెక్కి ఏడ్చింది. ఎంతో బాధ పడింది.అయినా తనని తప్ప ఎవరినీ ఆమె నిందించలేదు. ఆమె మనస్సు పశ్చాత్తాపంతో, దుఃఖంతో ఇంకా తీవ్రంగా బాధపడుతూంది—తనపాపానికి ఏమిటి పరిహారం? తనసంగతంతా భర్తతో స్పష్టంగా చెప్పివేస్తే తనమనస్సుకి శాంతి కలుగవచ్చును. కాని ఎలాచెబుతుంది? చెబితే ఏమైనా జీవముంటుందా? చెప్పలేదు. కాని చెప్పకపోయినంతమాత్రాన లోపమేమిటి?—ఆమె హృదయంలో పరివర్తనం కలిగింది; ఆమె ప్రవర్తనలో పూర్తిగా మార్పు వచ్చింది.

ఇప్పుడు భర్తను భోజనానికి లెమ్మనవలసివస్తే వంటింటిలోనుంచి కేకవేయదు. దగ్గరకువెళ్ళి తొల్లింటివలెనే ఎంతో మర్యాదగా, ఆప్యాయంగా స్నానానికి లెమ్మని చెబుతుంది. అతడు లేచేసరికి స్నానానికి వేడినీళ్లూ, పీటా, సబ్బుబిళ్లా, తువ్వాలూ అన్నీ సిద్ధంగా అమరుస్తుంది. స్నానానంతరం అద్దం, దువ్వెనా, అంగారు, పట్టుపంచ అన్నీ క్రమంగా తనే అతని కందిస్తుంది. అతడు ఆఫీసుకు వెళ్లేసమయాన అతనిదుస్తులు తనేతీసి అతనికిచ్చి, తిరిగి అతడు ఇంటికి రాగానే వాటిని తనే పుచ్చుకుని జాగ్రత్త పెడుతుంది. అయినా ఆమెకు సంతుష్టికలుగలేదు.

ఒకరోజున రాత్రి రెండుగంటలవేళ విశాలం మేలుకుని భర్తను మెల్లగా పిలిచింది—

'ఏమండీ, పడుకున్నారేమిటి?'

విశ్వనాథం పక్కమీదనుంచి లేచి'ఏమీ?' అన్నాడు.

'ఏమీలేదు; నా కేమో తోచకుండా ఉంటే పిలిచాను.'

అతడు దగ్గరకువచ్చి కూర్చున్నాడు. ఇరువురూ ఏవో మాట్లాడుకుంటున్నారు—

ఇంతకూ విశాలం సాటిలేని యువతి: ఆమె సంపూర్ణమైన హృదయంతో అంది: 'ఏమండీ, నేను మీఎడల ప్రవర్తించవలసిన విధంగా ప్రవర్తించలేదుకదూ?...నాకు చాలా విచారంగా ఉంది.'

అమాయకములైన ఆమాటలు అతణ్ణి కదిలించాయి. ఆమె ఉద్దేశమేమో గ్రహించకుండానే ఆమెను ఓదార్చాలని అతనికి బుద్ధి పుట్టింది—'అదేమిటి? విశాలం, ఆమాటలు! నువ్వేం తప్పుచేశావు? నీవంటివా రెవరున్నారు! నువ్వు నాకు లభించినందున నిజంగా నేనెంత అదృష్టవంతుణ్ణి!' అన్నాడు.

విశాలం కళ్ళలో కృతజ్ఞత తాండవించింది. ఆమె మనసులోని బాధ పూర్తిగా తొలగిపోయింది. ఆమె రోజురోజుకీ ఎంతో నెమ్మదిగా, మంచిగా మారిపోతూంది. గృహకృత్యములయందు, భర్త సంరక్షణయందు ఎంతో శ్రద్ధవహిస్తూంది. భర్తను సర్వోత్కృష్టునిగా తెలుసుకుంది. మనసులోనైనా అతణ్ణిదప్ప ఇంకెవరినీ ఇప్పుడామె కోరలేదు. అతని చూపుల్లోనూ, చేష్టల్లోనూ నాగరికతా, రసికతా గోచరించకపోవచ్చును—కాని ఎంత అమాయకుడు, ఎంత ఉదారుడు!

పవిత్రత కేవలం సహించదగ్గదేగాక, అవసరమైందికూడానని అనుభవపూర్వకంగా మరోసారి తెలుసుకోబడింది.

# వ్యావహారికాంధ్రము కూడ కృతకమే యగుచున్నది

రచయిత:

దువ్వూరి సూర్యనారాయణమూర్తి

['నేటి వ్యావహారికభాష యొక నియమములేక బయలుదేరుచున్నది...నియమములేక వెలువడుచున్న నీ వ్యావహారికమువలన విలక్షణమైన యొక కృతకాంధ్రము తయారగుచున్నది...నియమరహితభాషనుండియే తద్రూపమైన సంకరభాష, కృతకపదజాలము పెచ్చు పెరుగుచున్నది...']

నేడు భాషావిషయమై పండితు లనేకు లనేకమార్గములను త్రొక్కుచున్నారు. ఆంధ్రభాషావల్లి వేయితలలెత్తి ప్రాకు రోజులలో భాష కేవలగ్రాంధికవ్యావహారికములలో నేదియో నొకరీతి నడువవలెనన్న నది యెన్నటికిని చెల్లుబడికానిదే. అవసరమును బట్టి వాడుకొనుటకు రెండుభాషలును ఉండి తీరవలయును. అందు ముఖ్యముగా రూపకములు, కథలు వ్రాయుటకు వ్యావహారికము లేకున్న నేటి పత్రికాయుగము పలువురకు సుబోధముకానేకాదు. పరమార్థమాలోచింప రమణీయార్థస్ఫూర్తి యున్నపుడు భాష యెట్టిదైనను బాధలేదు. పాత్ర వెండిదైనను బంగారుదైనను పాత్రలోని పదార్థము యొక్క మంచిచెడ్డలనే భోక్త పరిశీలింపవలెను. తాను భుజించునది పదార్థముగాని పాత్ర కానుగాన. దీనినే 'చమత్కారజనకభావనావిషయార్థప్రతిపాదకశబ్దః కావ్యం' అని పెద్దలు చెప్పినారు. అనగా కావ్యత్వసిద్ధికి భావనోల్లిఖితమైన యర్థముగల శబ్దమునకే యర్హతకలదుగాని యనర్థవత్తుకు తావులేదు.

ప్రస్తుతము నేటి వ్యావహారికభాష యొక నియమములేక బయలుదేరుచున్నది. దేశభేదమునుబట్టి వ్యవహారభేదముండుట సహజమేయైనను భిన్నదేశప్రయుక్తపదస్వరరూప వ్యావహారికభేదము నటుంచి తక్కిన నియమములలోనైన సారూప ముండుటలేదు. ఒక జిల్లాలోని లేఖకుల భాషయైన నొకతీరున నుండదు. నియమములేక వెలువడుచున్న నీ వ్యావహారికమువలన విలక్షణమైన యొక కృతకాంధ్రము తయారగుచున్నది. ఇది వ్యావహారికగౌరవమును న్యూనతపఱచుటయే గాక తన స్వాభావికత్వమును చెఱుపుకొనుచున్నది. కనుకనే గ్రాంధికవాదులచే పరిహాసపాత్రమగుచున్నది.

ఈమధ్య ప్రబుద్ధాంధ్రలో 'శాస్త్రి' అను పేరున నెవరో గిడుగువారినిగూర్చి వ్రాయుచు:

'వ్యావహారికభాషకి హక్కుభుక్తాల్లోంచి తప్పిపోయిన గురుపీఠాన్ని మళ్ళీదఖలుపరిచిన వారీయిద్దరే. (రెండవవారు గురజాడ అప్పారావుగారు)'

'రామమూర్తిపంతులుగారు భాషయొక్క పూర్వోత్తరాలన్నీ క్షుణ్ణంగా తెలిసిన పండితులు.'

'పంతులుగారి సింహగర్జనలు భాషాతత్వాన్ని బోధపరిచాయి' అని యుదాహరించినారు.

కాని వీరిరువురరచనలను పరిశీలింపగా నంత విశిష్టత వీరిలో గనబడలేదు. ప్రథమోపదేశికులగుటచే నిట్లు వ్రాసిరేమో యనుకొంటిని.

# భక్తనంద నాటకప్రదర్శనము

కంట్రాక్టు నాటకము లాంధ్రదేశంలో ప్రబలినదాది నాటకము చూడడమంటే నాకు పరమఅసహ్యం పుట్టింది. ఇలాంటప్పుడు ఇటీవల మాయూరులో ఆంధ్రనాట్యమిత్రమండలివారు భక్తనంద నాటకం ప్రదర్శించారు. ఏదో కొత్తనాటకముకదాయని, ఆడేవారు యెమెచ్యూర్సుకదాయని, బాగుంటే కొంచెంసేపుండి చూద్దాం లేకపోతే అరగంటలోనే తిరిగి వద్దామని వెళ్లాను. జనంరా లేదనికాబోలు నాటకం 10 గంటలకు మొదలుపెట్టారు. నాలుగు నిమిషాలుండి తిరిగి వద్దామనుకున్న నాకు నాటకము మంగళమువఱకు కూర్చున్నచోటినుంచి లేవాలని బుద్ధిపుట్టలేదు. నాటకరచన, రచనకు వన్నెతెచ్చే నటకుల చాకచక్యం నా అంతరంగాన్ని ఆకర్షించి ఈనాలుగు వాక్యాలు చెప్పడానికి ప్రోత్సహించాయి.

ఈనాటకాన్ని రచించినవారు పాలకొల్లు మునిసిపల్ హైస్కూలులో ఆంధ్రోపాధ్యాయులుగానున్న అంద్ర శేషగిరిరావుగారు. ఇందులోని ఇతివృత్తము దక్షిణదేశములో నందనార్ అని ప్రసిద్ధికెక్కిన మాలభక్తుని చరిత్రం. నాటకమామూలాగ్రంగా చూచునప్పటికి హరిజన దేవాలయప్రవేశమును ప్రోత్సహించడం, వితంతువుల వెట్టిచాదస్తపు ఆచారాలు



భక్తనంద నాటకకర్త.

వెలిపుచ్చడం, బాల్యవృద్ధ వివాహాలను ఖండించడం, పశుబలి మాన్పించడం కవిగారి ఆశయాలులాగ కనబడుచున్నాయి. నందునిచరిత్రము భక్తిరసప్రధానం అవడంచేత హాస్యరసం



శాస్త్రి : కనకమ్మ.

కొంచెం చేర్చినేకాని నాటకం రక్తికట్టదనే యుద్దేశంచేత కాబోలు భక్తిలో హాస్యరసాన్ని మేళవించారు. మేళవించడంలోకూడా మిక్కిలి నేర్పరితనంచూపించారు. తీర్థానికి తీర్థము ప్రసాదానికి ప్రసాదము కాకుండా అంతర్నాటకం అసలు నాటకంలో మిళితమయింది.

నందుని మూడు స్టేజెస్‌లో చూపించారు. రెండవనందునిపాత్ర మాస్టర్ మల్లేశ్వరరావు ధరించాడు. ఇతడు బాలుడైనను తన మధురగానవాహినిని ప్రేక్షకుల నూగులాడించాడు. 3-వ నందునిపాత్ర ధరించినవారు మహారాజశ్రీ కాశినాధుని సత్యనారాయణగారు. వీరిదగ్గఱ నాటకరంగమునకు సరిపడు గానమున్నది. భావమునకనువైన ఉచ్చారణ, దానికితగిన భావప్రకటన గలిగి ప్రేక్షకుల హృదయములు పల్లవింపజేశారు. భక్తిలో అప్పుడప్పుడు వారు చూపిన ఉత్సాహము, ఆవేగము, తన్మయత్వము నాకండ్లయెదుట ఇప్పటికీ కట్టినట్లున్నాయి.

ఇందు హాస్యరసమును ప్రదర్శించినవారిలో మొదటివారు మహారాజశ్రీ దూర్వాసుల వెంకటశాస్త్రిగారు. వీరు వితంతువగు నాగమ్మ, అనగా, నందుని యజమానుడగు సూరాప్రధానులుగారి చెల్లెలిపాత్ర ధరించారు. వీరు, 'సక్కుబాయి'లో అత్తగారిపాత్ర ధరించిన మహారాజశ్రీ నూరవరపు వేంకటేశ్వర్లుగారినికూడ ఈపాత్రధారణంలో మరపించారని చెప్పవచ్చు. పూర్వకాలపు వెధవముండల వెఱ్ఱిఆచారాలు మూర్తీభవించినట్లుగా అభినయించారు. కాని యీచటను భక్తి లేశమైనను ఉన్నట్లేకనబడలేదు. ఆలోపము గ్రంధకర్తగారిదో లేక వీరిదో తెలియదు. చిదంబరము ప్రయాణమైన తరువాతకూడా వదినెతో, అన్నతో చేసే సంభాషణము మాత్రము కొంచెము రసభంగముగా నున్నదని నాయూహ.

### గిడుగువారి వ్యావహారికము

అసలు **వ్యవహారమ**నగా మనము నిత్యము **వాడు**కొను జీవభాష. ఇది రెండువిధములు: శిష్టజనవ్యవహారము, పామరవ్యవహారమని. ఈవ్యవహారత్వమన్నది గ్రాంధికభాషను ప్రత్యయ, వ్యాకరణకార్యయుక్తముగా నుచ్చరింపకపోయినంతమాత్రమున నలవడునది కాదు. వ్యావహారికమందు చక్కని యర్ధస్ఫూర్తి, యొకవిధమైన యౌపచారికము గలదు. ఈ భాషాస్వరూపమునుగూర్చి శ్రీ గిడుగు రామమూర్తిపంతులుగారే 'వ్యావహారికభాష అనేది శిష్టజనులు వ్యవహారమందు, సంభాషణలోనున్న వాడుకొనే భాష' అని నిర్వచించినారు. వీరి మతానుసారము వీరి వ్యానహారికము పరిశీలింప నందెంతయో యస్వాభావికత్వము కనుపించును. వీరి యప్పకవీయపీఠికయు, సీతాపతిగారి ఛందోదర్పణ పీఠికయు వీరిసిద్ధాంతమునకు లొంగనివి. ఇం దుభయభాషాసాంకర్య మెక్కువగా నున్నది. గ్రాంధికమే వ్రాయనెంచి పొరపాటున నడుమనడుమ వ్యవహారపదములను వాడినట్లు పాఠకులకు తోచక మానదు. అసలు శాస్త్ర విషయములను కథలువ్రాసెడివ్యావహారికములో వ్రాయలేకున్నను తత్సాంప్రదాయములు పూర్తిగా పాటింపవచ్చునుగదా ? అట్లుగాక వీరు గ్రాంధికమే వ్రాయుచు నడుమ నీక్రింది పదముల జొనిపినారు—

'కనబడుతున్నది, వ్రాస్తూ, వ్రాసుకొన్న, తిరిగీ గద్దెక్కించడము, ఉంటుంది, చెప్పితే, వచ్చేది.'

ఇత్యాది పదములు కలిపినంత మాత్రమున వ్యావహారిక మనజాలముగదా?వారి సిద్ధాంత ప్రకారము చూడ నందు తత్సాంప్రదాయములే కనఁబడవు. పైవంటి పదములు నూటికి, కోటికి జొనిపినంత మాత్రమున నే దానికి సంభాషణలోని వాడుక సిద్ధింపదు. మొత్తముపై వ్యావహారికభాషకు వీరిభాషలో నే మాత్రము తావులేదనవచ్చును. అట్టిస్థితిలో వీరిభాషకు త్రిశంకుస్వర్గమేగతి—

### గురుజాడవారి వ్యావహారికము

గురుజాడ అప్పారావుగారు దిద్దుబాటు అను కథను వ్యావహారికములో నడపినారు. కవిభాషితములు మాత్రము శుద్ధగ్రాంధికములోనే యున్నవి.

'ఎంత ఆలస్యముచేస్తిని ? పోకిరీమనిషివలె'–ఇందు గీసిన పట్టుల వ్యావహారమందు మార్పుండి తీరును. ఇట్లే మఱికొన్ని: 'గట్టిగా పిలిచితే కమలిని లేవగలదు.' పిలిస్తే, లేవగల్దు అనియు 'పిలుస్తే' అనియు వాడుక. వీరు 'పిలిచి'వరకు గ్రాంధికమును, ఆ వెనుక వ్యావహారికమును జోడించినారు. 'రాముడిని లేపగల్గితినా వేషమువెయ్యవచ్చును' ఇది 'రావుణ్ని లేపేనంటే. . . వేషంవెయ్యొచ్చు – లేక–వెయ్యవచ్చు' అని స్వాభావికోచ్చారణ.

ఈ కథయందలి పామరోచ్చారణగూడ తబ్బిబ్బులుగానే నడచినది.

'పుట్టినారింటికి యెల్తానంటే లెంపలాయించి కూకోబెట్టాలిగాని మొగోరిలాగ రాతలూ కోతలూ మప్పితే ఉడ్డోరం పుట్టదా బాబూ! యీపు–నానంతాను.'

అని యింతయాసగా మాటలాడు దాసీ రాముడు మఱికొన్ని పట్టుల 'నాకేంబోధకాదు, అననుబాబూ ! అలకచేస్తే, అంత వారుకారనా ? చెప్పలేనుకాని, శెలవిస్తారు, వీధితలుపు' అని గ్రాంధికోచ్చారణ చేయును. శ, చ, స, భేదమువిడిచి మాటలాడు వానికే నడుమ నిట్టి యుచ్చారణ మస్వాభావికము గదా ? టకారముచ్చరించుటకు తకారము

పలుకునోరు కొన్నిచోటుల టకార మదేపనిగా పలుకును.

వీరి 'పేరేమిటి' అను కథలోగూడ నడుమ నడుమ గ్రాంధికాచారముతోడనే పదములు పలికినవి.

'క్షేత్రంగలదు. కొండలనంతటను, ఇవి చూచుటకే మేం వెళ్ళేం, వుండెను, ప్రాణములనయినా యిత్తుముగాని దానిని యివ్వజాలము, ఒకనాటిరాత్రి.'

ఇట్టి వ్యావహారికవిరుద్ధసంప్రదాయములు ఎక్కువగా నున్నవి.

వీరిముత్యాలసరములలోగూడ వ్యావహారికము మృగ్యము. చూడుడు.

'మెచ్చునంటూ వీవు
నీవిక మెచ్చకుంటే మించిపోయెను
కొయ్యబొమ్మలె మెచ్చు
కళ్ళకు కోమలుల సొగసు్కనా?'

ఇందు స్వభావసిద్ధమైన శిష్టవ్యవహారమెంతకలదో గ్రాంధికభాష యెంతకలదో సహృదయు లెరుగకపోరు. ఇట్లే వీరి లవణరాజుకథ, డామన్ పిథియస్, మొదలగు పద్యఖండికలు తొంబదివంతులు గ్రాంధికము తోడను, పదివంతులు వ్యవహారభాషతోడను నడచినవి. ఆడపిల్లలపాటలు, దేశభక్తి ఈ రెండు నెక్కుడు వ్యావహారికమున నడచినవి. ఒకచోట 'గల్ను, మాట్నిజం,' అని ప్రయోగించిన నోరు మఱియొకచో 'కలను, కలదు, మాటనిశ్చయం' అని పలుకుచుండును. ఈ గ్రంథమందలి వ్యావహారికభాషకన్న వీరి కన్యాశుల్కమందలి భాష న్యాచురల్‌గా నుండును. దూరదూరముగా నస్వాభావిక పదప్రయోగముకలదు.

చింతా దీక్షితులుగారి వ్యావహారికము

దీక్షితులుగారు శబరి యను నాటకము వ్యావహారికభాషలో వ్రాసినారు. భాషలో మృదువు, తన్మయత పొడకట్టును. కాని గ్రాంధికవాసన పూర్తిగా విడువలేదు.

'అవునమ్మా అవును, ఇది—ఔనమ్మా ఔను, అని మారవలెను.

అయిపోతున్నావు—ఐపోతున్నావు.

నేర్చుకొంటవి—నేర్చుకొంటాయి, ఇట్లే: పారిపోతాయ్.

వెళ్లుతాను—వెడతాను.

పధ్నాలుగేళ్లు—పద్ధానుగేళ్ళు.

ఇట్టిమార్పు వాడుకలోని సాంప్రదాయము. కొన్నిచోట్ల 'వ్యాజము, దూరము, ఆకాశము అని ముపర్ణకముతో వ్రాసి 'ఆరాధించడం, కోపం, సహాయం, కోసం, చిత్రకూటం, వనవాసం' అని వాక్యాంత పదాంతములయందు సున్నగా వ్రాయుదురు. 'పరుగెత్తును, వాడుతావా, ఇదుత్వమును, పెట్టుకొన్నది.' ఇందొత్వమును గ్రాంధికములు, 'చెప్పుతావు, చెప్పితే' అన్నచోట 'చెబుతావు, చెబితే, చెప్తే' అని వ్యవహారము. ఇది శ్రీపాదవారు వాడుదురు. మొత్తముపై వ్యావహారికనియమములు సరాసరిగా నడువలేదు. ఇది పాత్రలభాష, వీరిసొంతభాష చూడుడు.

'జింకలకున్న <u>చురుకుదనము</u> ఆమెకు కద్దు, ఆమెకళ్లు యౌవన<u>మదమును</u> వెళ్ళగ్రక్కుతున్నవి.'

ఇందు గీచిన పదములు శిష్టోచ్చారణవ్యవహారమున వేరుగా నుండును. దీనిని బట్టి వీరి భాషలోకూడ నెగుడుదిగుడులు కలవనియే నానమ్మకము.

శ్రీపాదవారి వ్యావహారికము

సుబ్రహ్మణ్యశాస్త్రిగారు పెక్కు కథలు వ్రాసినారు. వ్యావహారికము వ్రాయుటలో స్వభావ ముట్టిపడుచుండును, అందొకమాట

యు శిష్టవ్యవహారమును దాటదు. పాత్రలో లీనమై వ్రాయు పరిణతప్రజ్ఞులు. కనుకనే చక్కని భాష వీరికలవడినది. వీరిభాష చదువునప్పుడు పాత్రలు సాభినయముగా కండ్లయెదుట నిలుచును. కథాభాషలోనేగాక శాస్త్రీయవ్యాసములలోగూడ వీరిభాష పొల్లుపోదు. వీరివలె వ్యావహారికము వ్రాయువారు చాల తక్కువ. నోరు, చేయికూడ బాగుగా తిరిగినవి.

వీరి వడ్లగింజల కథనుండి :—ఈ కథయందే సకృత్తుగా వ్యవహారమునకు పనికిరాని గ్రాంథికసాంప్రదాయములు దొరలినవి. అవియైనను చాల తక్కువ.

'స్నానపుగది, అంగాస్త్రపుగుడ్డ' ఇందు పుగాగమము వ్యాకరణసాంప్రదాయము. 'స్నానాలగది. అంగాస్త్రంగుడ్డ' అనిన బాగుండును. ఇట్లే 'భూమిమీద—భూమ్మీద

చేతిలో—చేతులో

కబురుచేస్తాములే—...చేస్తాంలే.

అనిగదా వ్యావహారికసాంప్రదాయము. ఇంతకు వీరిభాషలోని సుగుణము పై వారి భాషలోవలె శబ్దములుగాని క్రియలుగాని గ్రాంథికప్రత్యయములలో నుండవు. అట్లని నియమములేకపోలేదు. ఏపదము నెట్లుచ్చరింతురో యట్లే యెన్నిచోటులనైన వాడుదురు. తామొకసారి పలుకుకొని వ్రాసినట్లుండును. ఈభాష కొకవిధమగు స్టాండర్డు వీరిలో దొరకును.

ఇ క్లైవరియిష్టము వచ్చినట్లు వారు వ్రాయుచున్నారు. ఇట్టి యస్వాభావికపుభాష పెరిగి యిది విలక్షణమైన కృతకాంధ్రమును పుట్టించుచున్నది. భాషలోని గ్రాంథికవ్యావహారికసంకరము పదములలోనికికూడ దిగినది. అట్లు వ్రాయుట యందమనియో లేక యెవరియిష్టానుసారము వారు వ్రాయుటే ఏతద్భాషాలక్షణమనియో వారి యాశయమై యుండును. కొందఱి రచనలనుండి—

'చూచుతోంది.' ఇందు 'చూచు'వఱకు గ్రాంథికము : తోంది వ్యావహారికము. ఇట్టి పదములు వినుసరికి కటువుగానుండును. ఇట్టివే 'ముందుపనిచూచుగుందూ!, మాకుతోచుతోంది' మొదలగునవి. 'విచారింపతగ్గ విషయం ఏమిటంటే' ఇందు గ్రాంథికత్వము ప్రయోగింపబడినది. వ్యావహారికదృష్టితో జరుగునో రీపదమున కుంటువడితీరును.'కనబరచేరు' ఇది 'కనపరిచేరు' అని వాడుక, ఇందు సరళాదేశము రకారముపై నత్వము గ్రాంథికయుక్తములు. ఇట్టి పదములనుండి 'కనంబరుస్తే, కనఁబరుస్తా' ఇత్యాది రూపములుగూడ మున్ముందు పుట్టును. 'పారిపోతవి, ఉంటవి' ఇట్టివి గ్రాంథికభాషలో నున్న 'రామునివి, నావి, తిన్నవి' మొదలగు 'అవి' కలసినవానిలోని యెనాలాజీ ఐయుండును. ఇది వ్యవహారోచ్చారమందు ప్రసిద్ధముకాదు. 'వ్రాసును' ఆహా! ఏమి వ్యవహారము. 'రాస్తూఉంటుంది' అనినబాగు. దీనినిబట్టి 'వ్రాసుచున్నది' కూడ బయలుదేరవలసినదే. అసలు 'రాత' తప్ప 'వ్రాత' వ్యావహారికములో లేనేలేదు. వీనినిబట్టి ఉంటది, వెళ్తది ఇత్యాదులును 'త్రోసును, మోసును' మొదలగునవియు శిష్టవ్యవహారమున బయలుదేరవచ్చును. 'చేస్రీ, వేస్రీ, ఊర్కోను' గూడనిట్టివే.

మఱియు నిందు కొన్ని సంధులుచేసిన పరుల కర్థబోధ కానేరదు. అట్టివి చేయకుండుట మంచిది. 'మాపిల్లింటికి వెళ్ళింది, మాఅప్పిచ్చింది' వీనివలన పాఠకులు చదువునపుడు సరిగ నర్థముగాక, పిల్లి, అప్పు, అను

నభిప్రాయములు తీసికొందురు. ఇట్టి సంధులున్ను పెద్దలే చేసినారు.

అన్యదేశ్యపదములు వ్యావహారికమున వచ్చునపుడు వానిని సంస్కరించి వ్రాయుచున్నారు. గ్రాంథికమందైన నీసంస్కార మవసరముగాని వ్యావహారికమం దనవసరము. ఆపద వ్యవహారము మనమెట్లు చేయుదుమో తద్రూపముననే దింపుట మంచిది. లేనిచో దానియందలి యందము మందగించును. చూడుడు :

'ఖాతరీ, ఫకీరు, ఫిర్యాదు' మొదలగునవి 'కాతరా, పకీరు, పిర్యాదు' అని వ్రాసిననే సొంపు. అంతేగాని వాని నిజరూపములతో వ్రాయకూడదు. మన వ్యవహారములో 'కిరసనాలు, మేరేజి' అనియే యుచ్చారణగలదు. దీనినిట్లే వ్రాయవలెనుగాని తద్భాషాసాంప్రదాయప్రకారము. 'కెరోసిన్ ఆయిల్' 'మేరియేజి' అని వ్రాయుచున్న స్వాభావికత్వము కిట్టునా? మఱియు 'లాంత రిల్లాపట్రా' అన్న దానికిని 'లేంట్రెన్ పట్రా' అన్న దానికిని భేదములేదా? ఇందేది స్వాభావికోచ్చారణకు సరిపడునో సులువుగా తెలియును. ఇట్లే 'ఖులాసా, ఖూనీ' శబ్దములు. 'కులాసా, కూనీ' అని వ్రాయవలెనేగాని మార్చరాదు.

ఇంక లేఖనమందుగూడ కొందఱు 'చేసాను' అని వ్రాయుదురు. అంతకన్న 'చేశేను' అనుట మంచిది. ఇట్లే యితరములగు పదములందు 'తిట్టేను, అడిగేను, ఇచ్చేను' అని వ్రాయుటలోనే యుచ్చారసామీప్యము సిద్ధించును. 'కోరసాగారు' అని వ్రాయుటచే 'ఖిలేదారుగారు, దివాన్‌జీగారు' వలె నీ 'కోరసాగారు' కూడ క్రియగా భాసింపక నొకవ్యక్తిగా తోచి యర్థముకుదురక యాలోచించువారు గలరు. అనునాసికోచ్చారణగల పదముల కర్ధానుస్వారముచేర్చి గురజాడవారు వ్రాయుదురు. 'ఏఁవేఁవ్,' వలె. ఈయాచారమితరులలో నుండదు. ఉచ్చారణకు తగిన వ్రాత యదే.

నియమరహితభాషనుండి యేతద్రూపమైన సంకరభాష, కృతకపదజాలము పెచ్చుపెరుగుచున్నది. ఇది కేవలము కృతక మనక తీరదు. ఇట్టి పరిస్థితులలో వ్యావహారికభాషావాదులు. 'అల్పజ్ఞానముగల పండితమ్మన్యులు వచ్చీరాని ప్రాచీనకావ్యభాషలో, నిర్దుష్టముగా కావ్యభాష వ్రాయగలవారు మిక్కిలి అరుదు. వ్రాయబూని చేతకాక కృతకభాష సృజించి ఆంధ్రభాషకున్నూ వాఙ్మయమునకున్నూ హానికలుగజేస్తూన్నారు.' అని వ్రాయుచు నియమములేని కృతకపదశిలల నెగుడుదిగుడుగా నమర్చి నియమసుధాబంధనములేకనే యీ వాఙ్మయమహోన్నతసౌధమును నిలబెట్టుచున్నారు. కొంద ఱుత్సాహవంతు లీసౌధ మింద్రభవనమే యనియు, నీ శిల్పచక్రవర్తులు కిరీటమాంధాతలనియు పొగడుచున్నారు. నిర్మితి పూర్తి కాకమునుపే కొంద రంతస్థులలోని కెక్కుచున్నారు. పండితపూత్కారములచే సౌధ మల్లలాడుచున్నది. ఇప్పటికైన కర్తవ్యమూహించి ఈ వ్యావహారికమునకు నియమబద్ధమైన పునాదులు నిలిపి సాధ్యమైనంతె యభివృద్ధిలోనికి తెచ్చి నియమరహితభాషయను తప్పు పేరును తప్పించివేయుదురని నేటి శిల్పప్రభువులకు మనవిచేయుచున్నాను. ఆంధ్రు లొకరి నొకరతీతముగా పొగడుకొనుచు కార్యసాఫల్యమును గూర్చి యర్ధకుశిలోనే పూర్ణానంద మొంది యిష్టమున్న వ్యక్తుల నెత్తివేయుట సర్వకళానాశనహేతువని గ్రహింతురు గాక!

# చిరదినాలకి కలుసుకున్న చిన్నారిదంపతులు


రచయిత:

నవుడూరి వెంకటరమణ


## ౧

### అతని మాటలు

లీలా! నే మరిచిపోతానో, మరిచిపోనో నీకు తెలీదూ? నే నావూరు వెళ్ళినదినము మొదలు నాకు చీకటి రాత్రులు. నేడు చంద్రుడు తిరిగి యుదయించినాడు. ఇంతకాలము నా జీవితనాటకములో విషాదాంకము. నేటి కది ఆనందంగా మారింది. ఇన్నిదినాలు నాభావనాప్రపంచంలో విషవాయువులు. ఇప్పటి కవి మందమారుతాలయాయి. ఇన్నాళ్లు నాశరీర మర్ధాంగము. నేటి కది బూర్ణాంగంగా మారింది. నే నిన్నాళ్లు నా ఆశాసౌధముయొక్క భూగృహములోవున్నాను. ఈవాళ మళ్ళీ ఆనందమయస్వర్గసౌధాగ్రము ప్రవేశించా. నేను వెళ్ళినది మొదలు లీలానామమంత్రజపమే నా జీవనాధారమైనది. ఆలీలానామమంత్రమే నాజన్మతారకమయింది.

నిన్ను ఎడబాసినది మొదలు సర్వము మరిచాను. చదువులేదు, సంధ్యలేదు. మిత్రులతో విలాసార్థంగా బీచికెళ్ళడం మానేశాను. సినీమాలన్న యేవగించాను. వేళకి బడికెళ్ళడం మానేశాను. తిండికూడ వేళకిలేదు. ఎల్లకాలము నీ ఆకృతి మనసులోవుంచుకుని నీచెయ్యులదలచుకుంటూ, నీముద్దుపలుకుల నూహించుకుంటూ, ఎప్పుడూ కూర్చుండేవాణ్ణి. నీ సుందరవదనారవిందంనుండి వెలువడే మధురమందహాసాన్ని తలుచుకుంటూ అర్ధనిమీలితుడనయేవాణ్ణి. రాత్రి పడుకున్నప్పుడెల్ల మనము పూర్వముసలిపిన సరససల్లాపాల్ని తలుచుకుని ఆనందించని రాత్రిలేదు. లీలా! ఎప్పుడూ నీమీదే మనస్సు. నువ్వే నాహృదయమంతా వ్యాపించావు. నన్ని వియోగసముద్రంలోంచి చేయూతిచ్చి గట్టెక్కించే దానివి నువ్వేఅని నమ్మాను. నా ఆలోచనలు, ఆశలు అన్నీ నీకోసమే. అంతా నీమయమే. నీవే నాసర్వస్వమవి. నిన్ను మళ్ళీ సందర్శించే భాగ్య మెప్పుడొస్తుందా అని యిలా స్వాతివానకు ముత్యపుచిప్పలా కాచుకుని వున్నాను. అప్పుడప్పు డీచిరవియోగం భరించలేక ఆత్మహత్య చేసుకుందామనికూడా బుద్ధి పుట్టేది. కాని యింతలో నీమధురమందహాసము నాకండ్లయెదుట స్ఫురించేది. వెంటనే తన్మయుణ్ణాయి ఆబుద్ధి మరల్చుకునేవాణ్ణి. ఎల్లాగయినా నీవద్దకువచ్చి నిన్ను చూద్దామని ఆశకలుగుతూండేదప్పుడు. నీకీమధ్యసుస్తీ చేసినట్టు విన్నాను. దాంతో స . . నుతిపోయింది. 'నీకెందుకొచ్చింది నాకేనా రాక' అనుకున్నాను. నాకు తెలియపర్చనందుకు మీనాన్నను బహుదూషించా. లీలా! కలలో నీవు వచ్చినట్లు, నన్ను చుంబించినట్టు చూచి వుండుండి నిద్రిస్తున్నవాణ్ణి తటాలున మేలు

కొనేవాణ్ణి. నలుప్రక్కలా జూచి నిన్ను గానక స్తబ్ధుడనయేవాడిని.

నాప్రవర్తన నాకే విపరీతంగా కనబడింది. నాలో నేనే నవ్వుకునేవాణ్ణి. ఛీ! మనం యింత చులకన కాకూడదనుకున్నా. నీవూసు మరిచి పోదామని ఎంతో ప్రయత్నించా. కాని సాధ్యంకాలేదు. నే నేపనిచేసిన అందులో నిన్ను చూచేవాడిని, ఏపనీచేయక ఒక్కడిని సముద్రపొడ్డున యిసుకలో కూర్చుంటే నావూహాలు, ఆలోచనలు అన్నీ నీమీదకే పరుగెత్తేవి. ఎంత తిప్పుకుందామని ప్రయత్నించినా తిరిగేవికావు. పోనీ సినిమా కెళితే కొంత వూసుపోతుందేమోనని అలా చేసిచూచా. అదీ నాప్రవాసాన్ని ద్విగుణీకృతంచేసింది. ఆ సినీమాలో ప్రియాప్రియులిరువురు కూర్చుండి వుంటే నాకట్టిభాగ్యం లేదుకదాఅనిపించేది. ఆరాత్రల్లా అదేవేదనతో బాధపడేవాణ్ణి. నా వూహాపథంలోంచి నీ ఆకృతి తొలగించుకుందామనుకున్నా, అదీ సాధ్యంకాలేదు, ఏ అందమయిన స్త్రీ కనబడినా, ఆమెలో నీపోలికలు వెదికేవాడిని. నీకాలిగోరికయినా వారు సాటి కానట్లుండేవారు నాభావనామనస్సుకు. ఏ కార్యంచేస్తున్నా, నీవూసులేనిదే అయేది కాదు. సర్వము నీవయి తోచేదానివి నాకుంచితహృదయానికి.

నిత్యము ఏకాంతంగా కూర్చుండేవాణ్ణి, ఏకాంతాన్ని సేవించేవాణ్ణి. నలుగురులోంచి ఎప్పుడుపోతామా అనిపించేది నాపరితప్త హృదయానికి. ఏకాంతంకోసం ఎన్నోపాట్లు పడేవాడిని. ఏకాంతమన్న నాకేదో వెర్రి ఆనందం కలిగేది ఏకాంతంలో హాయిగా అడ్డు లేకుండా జంకు సంకోచం లేకుండా, వూహాసౌధాల్ని నిర్మించుకుని ఆనందింపవచ్చును కదా! అని అనుకునేవాణ్ణి. ఎప్పుడూ ఏకాంతంగావుండి నాలో నేనే గొణుకుకొనేవాణ్ణి. నీతరువాత ఏకాంతమే నాకానందంకలిగించిన వస్తు వీ ప్రపంచంలో. నువ్వుకుట్టియిచ్చిన రుమాలు ఎల్లకాలము నాహృదయానికి దగ్గరగా వుంచుకుంటూ దాన్ని నాపరితప్త హృదయాని కదుముకుని అధికతరానంద మనుభవించేవాణ్ణి. దానిని ముద్దుబెట్టుకుని తన్మయత్వంపొందేవాణ్ణి. దానిజిలుగులో నీరూప సౌందర్యం చూచేవాడిని. దానికుట్టులో నీ హస్తసౌభాగ్య మూహించెడివాడిని. నీ తరువాత దానినే ప్రియతమవస్తువుగాతలంచాను. లీలా! లీలా! నాప్రేమవాహిని కట్టువీడి పారుతున్నాది.దాన్ని నేనడ్డలేకపోయినాను. లీలా! నాముద్దులీలా ! నాప్రియమగు లీలా!......

(గాఢపరిష్వంగము. అన్యోన్యతన్మయత్వము.)

## ౨

### ఆ మె మా ట లు

నాథా ! ధన్యురాలినయాను! ధన్యురాలినయాను. మహాదృష్టవంతురాలిని. నాభర్త నన్నింతగా ప్రేమిస్తున్నాడని చెప్పుకుందుకి గర్విస్తాను. మీరు నన్నింత ప్రేమించడానికి నాలోవున్న శక్తియేదో తెలియదు. నేను సామాన్యస్త్రీని.మీరు సామాన్యపురుషులు. కారణంలేకుండానే, నేనుకూడ మిమ్ముల నింతకన్న యెక్కువగా ప్రేమిస్తున్నా, మీకన్న ఎక్కువ ప్రవాసాన్ని నే ననుభవించాను.

మనం ఎడబాసినరోజున మీరు 'నిన్ను విడిచి ఎట్లుంటానో' అన్నమాట యిప్పటికి నాహృదయకుహరంలో ప్రతిధ్వనిస్తూంటుంది. అట్టిసమయాల్లో నాశరీము గగుర్పొడుస్తుంది. నన్నువిడిచి మీరెలావుంటున్నారో అని నాకు సంశయంకలుగుతూండేదప్పుడప్పుడు. నాహృదయములో మీరూపము గట్టిగ హత్తుకొని

యున్నాది. దాన్ని చెరపేశక్తి నాకులేదు. నాకర్ణపుటాల్లో యిప్పటికి మీమధురరసైకభాషణాలు పడుతూంటాయి. అప్పుడప్పుడు నేనేదయిన సగముపనిచేస్తూ, మీరు తలపుకు రాగానే తన్మయత్వంపొంది అల్లే అచేతనై యుండేదాన్ని. మావాళ్ళెప్పుడయినా మీగురించి మాట్లాడుతే నాశరీరము పులకించేది. అల్లాంటప్పుడు వెంటనే నాగదిలోకిపోయి అర్ధనిమీలితనై మీఫొటో హృదయానికంటిపెట్టుకుని పడుకునేదాన్ని. నన్నునేనే మరచి అకస్మాత్తుగా దాన్ని ముద్దుపెట్టుకొనేదాన్ని నాఫొటో మీఫొటో ఒక్కదగ్గిర నిలబెట్టి రెప్పవేయకుండా అలాచూస్తూ యుండేదాన్ని వెర్రి ఆనందంతో. ఒక్కొక్కప్పుడు వాటి రెండింటిని కలిపి ముద్దేసుకునేదాన్ని అర్థంలేని సంతోషంతో. ఇంతలో మళ్ళీ ఎవళ్లైనా చూస్తారేమోనని బెదరుచూపులతో నలుపక్కల చూచేదాన్ని.

మీ ప్రేమచిహ్నముగా మీరిచ్చిన ముద్దుపుస్తకముతీసి అస్తమానం చదువుతూండేదాన్ని. దాన్ని మీతోసమానంగా ప్రేమించాను. మీసుందరరూపాన్ని ఆ చిన్ని పుస్తకములో చూచేదాన్ని. అలాటప్పుడు టక్కున ముద్దెట్టుకునేదాన్ని. నేనడగ్గానే యిచ్చేసారు మీకలం. అందుకప్పుడు చాలాసంతోషించాను. దానివల్ల మీకిబ్బంది కలిగిందేమోనని తరవాత చాలావిచారించాను. ఎందుకడిగానని నాలో నేనే తిట్టుకున్నాను. పంపించేద్దామనుకున్నాగాని అలా చేయలేక పోయాను. నాథా! నాకుచేసిన సుస్తీ నిజముగా జ్వరము కాదది. అది ప్రేమజ్వరము. అందులో నేననేకమార్లు మిమ్మల్నిగూర్చి పలవరించానని మావొదినావాళ్లు చెప్పి నన్ను హాస్యాలు చేసేవారు. 'నామొగుణ్ణేకదా! పలవరించా' ననేదాన్ని సిగ్గుతో. ఈదుర్భరవియోగమే అలా జ్వరరూపంలో బాధపెట్టిందంటే. దానికి దివ్యౌషధము మీనామస్తోత్రమే. దాంచేతే విశ్రాంతి పొందాను. మీహృదయసౌకుమార్యం నాకుతెలుసును కాబట్టి, మీరు బెంగపెట్టుకుంటారని నేనే వుత్తరంరాయొద్దన్నాను.

నాయందత్యంతప్రేమ వెలిబుచ్చుతూ మీరు వ్రాసిన వుత్తరాలు మీతోచింపేశానన్నాకాని, అవి చింపలేదు. నాచేతుల్తో నేనంతటిపని చేయలేక పోయాను. అప్పుడప్పుడవన్నీ రాత్రిళ్లు చదువుతూ, ఆ ఆనందంలో అలాగే పడుక్కొని నిద్రపోతూండేదాన్ని. ఆ వుత్తరాలు గుండెలు మీదపడేసుకుని మళ్ళీ మర్నాడు మా అమ్మ లేపుతేలేచి ఆవుత్తరాలుచూసి నాపిచ్చికి నవ్వుకునేదాన్ని. మీలాగే నేనుకూడ మిమ్మల్ని స్మృతిపథంలోంచి తొలగించుకుందామని ప్రయత్నించా. కాని నాతరమయిందికాదు. నేనేపనిచేసినా, మీరే జ్ఞప్తికివచ్చేవారు. భోజనంచేస్తూంటే మీరుచేసే మధురసంభాషణ, హాస్యపుచేష్టలు జ్ఞప్తికివచ్చేవి. ఏదైనా పుస్తకం చదువుతూంటే మీరు కళ్లుమూయడం.....అవీ తట్టుతూండేవి నామనసుకు. నేను మీకన్న అధైర్యపడ్డాను. మీకన్న ఎక్కువ ప్రవాసాన్ని అనుభవించాను. వుండుండి అల్లా తన్మయత్వంపొంది ఎవ్వరేది అడిగినా పరధ్యాన్నంగా జవాబిచ్చేదాన్ని. నాపరధ్యాన్నానికి కారణం వాళ్ళకి తెలిసినా తెలియనట్లు నటించేవారు నాముందర. నాచాటుగా మనలగురించి ఎన్నో మాట్లాడుకునేవారు. వాటిల్లో కొన్ని నాచెవుల్లోపడి అమితానందం కలిగించేవి. నిజంగా మీరెప్పుడొస్తారని యిలా రోజులు లెక్కపెట్టుకునేదాన్ని. ఒకరోజు తగ్గింది

కదా అని ఏరోజుకారోజు ఆనందించేదాన్ని. అప్పుడే మళ్ళీ యింకా యిన్నిరోజులుందికదా అని నిస్పృహ చెందేదాన్ని. ఇన్నాళ్లు నాకేమి హెచ్చరికలేదు. సంతోషములేదు. అలా పరధ్యాన్నంగా ఏదో ఆలోచిస్తూ, శూన్యంగా కూర్చుండేదాన్ని. కలలో మిమ్మల్ని చూడని రోజులేదు. మనస్ఫూర్తిగా ఒక్కనవ్వైరగను. ఇన్ని పండుగలయాయి. కాని ప్రతీపండుగ నా దుఃఖాన్ని పెంపొందించింది కాని కుందించలేక పోయేది. మీరే నాదగ్గరవుంటే ఆపండుగ లెంత శోభించివుండేవో? నాకెన్ని బహుమతులొచ్చేవో? యీ మధ్య నాపుట్టింరో జెళ్ళిపోయింది. ఆనాడుకూడ నాకేమి ఆనందం కలగ లేదు. నాథా! మీతలపు వచ్చినప్పుడల్లా తన్మయత్వమందుతూండేదాన్ని. మిమ్ముగూర్చి ఎవరేనా చెప్పినప్పుడల్లా నాశరీరము పులకించేది.

ఈదినంకోసం ఎన్ని దేవుళ్ళకి మొక్కానో, ఎంత తపస్సుచేశానో, దేవుడికి తెలుసు. ఇన్నాళ్లు ఎప్పుడు దేవుడిగుడికెళ్ళినా ఈదినం కోసమే ప్రార్థించా. ఇన్నాళ్ళకు మన వియోగము తీరింది. మనకు శుభదినాలు తిరిగి ప్రారంభమయాయి. నాథా!.....

(తన్మయత్వము - గాఢపరిష్వంగం.)

# ప్రేయసీ!

రచయిత:
ములుమూడి ఆదిశేషాద్రిరెడ్డి

౧

కనుగొను మీఝరిన్; సఖి! అకల్మషమా సికతాతలాల, నే
ప్రణయపిపాసి యస్థికలపై ప్రవహించి పునీతయయ్యెనో.
కనుగొనజాల రెవ్వరును గాని తదీయరహస్యగానమున్
వినిన యెడందలే, ప్రకృతిప్రేమమహత్వముల న్నెఱింగెడిన్;

౨

విరియంబూచిన నీగులాబి హృదయావిర్భూతసౌరభ్య మీ
ధరణిన్ ఏమహనీయుప్రేమరసపాత్రంబౌచు వర్థిల్లెనో
కరమాహ్లాదము ప్రేమితాత్ముల కొసంగంజాలె నీనాటికిన్
దరుణీ! ప్రేమపరీతమా ప్రకృతియౌదార్యంబు లింతేసుమీ;

౩

ప్రణయారాధననిర్వృతిన్ పరిణతప్రాప్తైక్యభావాల, జీ
వననైవేద్యములిచ్చి మున్నెవరు విశ్వవ్యాప్తు సేవించిరో
కనుమీ వారిపవిత్రగాథలను, నక్షత్రాక్షరాల్ గూర్చి మి
న్నున మేల్ బంతిగ వ్రాసె నీశ్వరుడు సంతోషంబుతో ప్రేయసీ!

# అతని ఆసుపత్రిలో పదునైదువందలమంది డాక్టరులు

అమెరికాయందలి బాటిల్ క్రీక్ శానిటోరియమ్ ప్రపంచప్రఖ్యాతమైనది. ఆశానిటోరియమ్ స్థాపనాచార్యుడు డాక్టర్ జాన్ హార్వే కెల్లాగు. దాని నిర్వాహకుడును ఆతడే. లోకమునందలి డాక్టరులలో శక్తిసామర్థ్యములందు ఆత డద్వితీయుడనుట ఎట్టి మినహాయింపులు కాని లేని సత్యము.

తొమ్మిదివందల సంవత్సరములకు పూర్వము ఐరోపాఖండమునందలి నార్మండీ నుండి ఎత్తివచ్చి ఇంగ్లండును జయించి అచట ప్రభుత్వము స్థాపించిన విలియమ్‌విజేతతోకూడ నార్మండీనుండి ఇంగ్లండుకు వచ్చిన కుటుంబములలో కెల్లాగు కుటుంబమొకటి. అప్పుడు విలియమ్‌తోకూడ ఇంగ్లండుకువచ్చిన కెల్లాగు వంశస్థుని పేరు జాన్ కెల్లాక్. మన డాక్టరు ఈజాన్ వంశస్థుడు. అనంతరకాలమున ఈ వంశీయులు ఇంగ్లండునుండి అమెరికాకు వలసపోయిరి.

ప్రపంచమునందలి డాక్టరులలో జాన్ హార్వే కెల్లాగ్ శక్తిసామర్థ్యములందు అద్వితీయుడని చెప్పియున్నాము. శక్తిసామర్థ్యములందే కాదు ధనసంపాదనయందును ఆతడు ఈ ప్రపంచమునందలి డాక్టరులలో అద్వితీయుడే. హార్లిక్సు, మెల్లిన్సు మొదలైన తయారీ ఆహారములవంటి ఆహారములను కొన్నిటిని తయారుచేసి వానితో వర్తకముచేసి ఆతడు చేరలకొలది ధనమును ఆర్జించినాడు.

వృత్తిచే ఆతడు డాక్టరే. కాని ఆతనియందు వైద్యాంశకంటె వ్యాపారాంశ హెచ్చు. వ్యాపారిఅగుటయే కాదు ఆతడు గొప్ప విద్యాప్రదాతకూడ.

ఆతనికి స్వతంత్రమగు ఆలోచనాశక్తి అగ్గలము. ఏవిషయమునందును ఆతడు ఇతరులతో ఆలోచించి ఎఱుగడు. తనకు తోచిన భావములనే కార్యరూపమున బెట్టువాడు. ప్రారంభించిన కార్యమును జయప్రదముగ నిర్వహించుటకు వలయు జవసత్త్వము లాతనికుండినవి.

ఆతని జీవితకథ అభూతకల్పనలతో కూడిన వృత్తాంతమువలె నుండును. అందరాని పొందరాని ఆదర్శమును అందిపొందుటకు అలమటించి అందిపొందిన ఒకానొక నిఱుపేద బాలుని కథతో డాక్టర్ జాన్ కథ జతపడుచున్నది.

డాక్టర్ జాన్ తల్లిదండ్రులు వ్యవసాయమువలన జీవనముచేయుచుండినవారు. వారి వ్యవసాయక్షేత్రము ముక్కారుపండు కేదారక్షేత్రముకాదు. వట్టి గొడ్రాళ్ళదిబ్బ. అదియు కొద్దిపాటిదికాని విస్తీర్ణమైనదికాదు. డాక్టర్ జాన్ పుట్టుక అట్టిచోట.

ఆతనికి పదునాలుగేండ్లు నిండగా తన పొట్టకు తానే సంపాదించుకొనవలసిన వాడయ్యెను. కాగా ఆగ్రామపాఠశాలలో నాతడు ఉపాధ్యాయవృత్తిని స్వీకరించెను.

ఆతనికి పుస్తకపఠనాభిలాష అగ్గలము. ఆతని విశేషాభిమానమును చూఱగొనిన గ్రంథకర్తలలో రోమకవేదాంతియగు సెనికా తొలుత పేర్కొనదగినవాడు. సెనికా వేదాంతియొక్క సుభాషితములలో — సత్యాన్వేషణము కావింపుము, సత్కార్యములు

ఒసరింపుము — అనునది అతనికి బాగుగా నచ్చినది.

పదునాలుగేండ్ల బాలుడు - చేతిలో చిల్లిగవ్వ లేదు - నేర్చినవిద్య విశేషమైనదికాదు - తానప్పుడు చేయుచున్నపని ఒక చిన్న పాత కొంపలో పదిపండ్రెండుగురు పిల్లకాయలను పోగుచేసి వారికి అక్షరములు నేర్పు బడిపంతులు ఉద్యోగము. అట్టివాడు గోమకమహావేదాంతియగు సెనికాయొక్క మహావాక్యరత్నమగు 'సత్యాన్వేషణము కావింపుము, సత్కార్యములు ఒనరింపుము' అనుదానిని తన జీవితమున ఆదర్శముగా చేకొనుట వింతగా నుండక మానదు.

మఱియు అత డాయాదర్శమును గొనుసరికి మిక్కిలి బలహీనుడై యుండెను. పైగా ఊపిరిసలుపనీయని క్షయరోగముతో ఉక్కడగియుండెను. అతడు పెరిగి పెద్దవాడగుట నమ్మరాని విషయమని అతనికి జన్మమిచ్చిన తల్లిదండ్రులే నమ్మియుండిరి.

కాగా సెనికావేదాంతి వాక్యము ననుసరించి ఆ కెల్లాగ్ యువకుడు తన ఆరోగ్య విషయమున ముందుగా సత్యాన్వేషణము కావించుటకు దొరకొనెను. తన శరీరమును ఆమూలచూడము అతడు పరీక్షగావించుకొనెను. ఒక వైద్యకళాశాలకు పోయి అందు చేరెను. వైద్యవిద్యాపూర్తి గావించి అతడు డాక్టరు ఆయెను.

అతడు క్షయరోగమును పూర్తిగ కుదుర్చుకొనెను. ఎట్లు? ఆరుబయట పండుకొని నిద్రించుట అలవాటుచేసికొనుటచేత. సన్ లైట్ సబ్బుల వర్తకమున విశ్వవిఖ్యాతిగాంచిన లీవర్ హ్యూమ్ వలెనే డాక్టర్ జాన్ హార్వే కెల్లాగ్ కూడ ఏబది సంవత్సరముల నిండాఱుకాలము ఆరుబయటనే నిద్రించువాడు, ఆరుబయట అనగా కొందఱివలె నాతడు తలవాకిటివసారా అనికాని, ఇంటిముంజూరు లనికాని, వరండాలనికాని అర్థముచేయలేదు. చంద్రకిరణములు, నక్షత్రకాంతులవచ్చి నేరుగా తనను తాకు బంగసబయలున ఆతడు నిద్రించువాడు. శీతకాలములందు ఉదయమున ఆతడు లేచి చూచుకొనుసరికి తఱుచుగా అతనిపక్క అంతయు మంచుతో ముద్దయై యుండునది.

ఏబది సంవత్సరములుగ ఆతడు ఆరుబయట నిద్రించుటయేకాదు- ఏబదియైదు సంవత్సరములుగ ఆతడు మాంసమును దరికి చేరనిచ్చి యెఱుగడు. పప్పుదినుసులు, ఫలములు, కూరలు వీనితోడనే ఆతడు ప్రాణధారణము గావించుకొనువాడు. దినమునకు రెండు సారులు మాత్రమే ఆతడు భుజించువాడు.

ఏరోగమునకైనను ముఖ్యకారణము పెద్దపేగులయందు క్రిములు ఉత్పత్తియగుటయే యని ఆతడు గాఢముగ విశ్వసించినాడు. మఱియు మాంసాహారమువలననే పెద్దపేగులలో క్రిములు చేరుటకు ఆస్కారము కలుగుచున్నదని ఆతని నమ్మకము.

డాక్టర్ కెల్లాగ్ ఆహారవిషయమున విశేషపరిశోధన గావించెను. హార్లిక్సు, మెల్లిన్సు మున్నగు తయారీ ఆహారముల విషయమున తీవ్రపరిశోధనలు సల్పి ఆత డొకక్రొత్తరకము తయారీఆహారమును కనుగొనెను. కనుగొనుటయేకాదు దానిని వ్యాపారరీత్యా విరివిగా ప్రకటించి విశేషవిక్రయము సాగించి విస్తారధనమును ఆర్జించెను.

విస్తారధనమును ఆర్జించెను. ఎందఱు ఆర్జింపలేదు? అది యొకవిశేషముగా చెప్పనేల? ఇతర ధనస్వాములవలె డాక్టర్ కెల్లాగ్ ధనమునకు కాపున్న దయ్యము కాలేదు.

తన ధనరాసికి ఉచితోపయోగ్యవృత్తిని కల్పించినాడు.

ఎట్లు? అత్యాశ్చర్యకరమైన ఆరోగ్య దేవాలయమును నిర్మించి. ఆ ఆరోగ్యదేవాలయమే బాటిల్ క్రీక్ శానిటోరియమ్ అను పవిత్రనామమున ప్రపంచప్రఖ్యాతి నార్జించినది.

ఆ ఆరోగ్యాశ్రమమున ఇపుడు డాక్టరులైననేమి, నర్సులైననేమి పదునైదువందల మంది పనిచేయుచున్నారు. పదునైదువందల మంది డాక్టరులయు, నర్సులయు పనిని గొను ఆఆసుపత్రి ఎంత పెద్దదైయుండునో, పాఠకుడా! ఊహకేమైన అందుచున్నదా? 1930-వ సంవత్సరమునాటికి ఆ ఆరోగ్యాశ్రమమున లక్షానలుబదియైదువేలమంది రోగులు రోగనిర్ముక్తులయిరి.

సత్యముగామారిన స్వప్నమునకు ఆశానిటోరియమ్ ఒకసాక్షి. అసలే అమెరికాదేశము ఆసుపత్రులకు ప్రఖ్యాతివహించినది. అట్టి అమెరికాదేశపు ఆసుపత్రులలో కెల్లకెల్లాగ్‌చే స్థాపింపబడిన బాటిల్ క్రీక్ శానిటోరియమ్ విశేషప్రఖ్యాతి వహించినది. మఱియు ప్రపంచమునందలి అనేకములగు ఆసుపత్రుల వలె అది ధననష్టముతో నిర్వహింపబడుట లేదు. దానిఖర్చులకు వలయు డబ్బు, దానివల్లనే వచ్చుచున్నది. ఆసుపత్రులన్నియు ఈ మాదిరిగా నుండుట కోరదగినది. అయితే కెల్లాగ్ ఆసుపత్రికి దానిఖర్చు దానివల్లనే వచ్చుచున్నదనుటచే అందలి ప్రతిరోగియు దానికి డబ్బుకట్టవలసియున్నదని ఊహింపరాదు. అచట చికిత్సనొందు రోగులలో ఎందఱో ఉచితచికిత్స నొందుచుందురు. అయినను కెల్లాగ్ బుద్ధివైశద్యముచేత ధననష్టములేని ధర్మవైద్యమునకు ఆ ఆసుపత్రిని తావలముచేసినాడు.

డాక్టర్ కెల్లాగునకు పిల్లలనిన అపార ప్రేమ. వారి పెంపకము అతనికి విలాసకరమైన పని. తల్లిదండ్రులు ఎవరో తెలియని అనాథశిశువులను నలుబదిఇద్దఱను చేరదీసి వారికి అర్థము, ఆరోగ్యము ఇచ్చి విద్యావంతులను చేసి వారి జీవనమార్గమును చక్కచేసినాడు,

రోమకవేదాంతి సెనికానుండి తాను గ్రహించిన మహావాక్యరత్నము యొక్క ఆదర్శమును ఆచరణాపూర్వకముగ ప్రదర్శించినాడు. తన జీవితకాలమంతయు అతడు సత్యమును అన్వేషించినాడు, సత్కార్యములు చేసినాడు.

ఆసెనికా వేదాంతి సుభాషితమే కెల్లాగ్‌ను ఇంతటివానినిగా గావించినది. జీవితపథమున ఏదైన ఆదర్శముకొఱకు అన్వేషించుచు తారట్లాడుచుండు ఈవ్యాసపాఠకుల కెల్లరకును జాన్ కెల్లాగ్ గొనిన ఆదర్శము తప్పక వరణీయముకాదగినది. విశ్వసనీయమైనది, న్యాయబద్ధమైనది, ధర్మయుక్తమైనది అగు -సత్యమును అన్వేషింపుము, సత్కార్యములు ఆచరింపుము- అను సుభాషితముకంటె మేలైన సుభాషితము ప్రపంచమున మఱియొకటి యున్నదా?

ఎల్లరును సత్యమును అన్వేషింతురుగాక! ఎల్లరును సత్కార్యములను ఆచరింతురుగాక!

ఆంధ్రభూమి

సచిత్రాంధ్ర మాసపత్రిక.

| | |
|---|---|
| సంవత్సరపు చందా | రు. ౧-౮-౦ |
| విడి సంచిక | రు. ౦-౨-౦ |

# ఎన్ను లేని సస్యము

రచయిత:

ముక్కవిల్లి వేంకటనారాయణ, బి. ఏ.

చల్లనిప్రభాతవాతంబు వెల్లివిరిసి
వీచుచుండెను, మల్లెలు పూచియుండె,
చివురుజొంపాలచాటున జేరియుండి
కోకిలలు గానరసమొల్క గూయుచుండె,
ఉదయభానుండు ప్రాక్సతీసదనవీధి
వీడుకోల్కొంది మెల్లన వెడలసాగె,
అతివయొక్కతె యెంటిగృహాంగణమున
కవ్వమాడించుచును, బాష్పకణము రాల్చె—
ఇరుగుపొరుగింటి చిరుతడు పరుగులిడుచు
ముద్దుమురిపెంబుగురియంగ 'కొద్ది వెన్న
పెట్టు' మంచును గోరగా పెట్టెనామె
నిమ్మకాయంత వెన్న గారమ్ముతోడ.
వెన్నతినుచును బాలుండు వెడలసాగె
విడువకుండగ నతనిపై వీక్షణముల
బరపి, కన్నీరు కోలకుల బరువులెత్త
కవ్వమటనుంచి సతి బాష్పకణము రాల్చె—

*　　*　　*

పడుచుప్రాయంబు—ముప్పది వత్సరములు
భర్త యువకుడు, ఆరోగ్యభాగ్యయుతుడు
గడనకలవాడు లోటేమి ? కాంత ! నీకు,
కంటనీర్వెట్ట నిపుడేమి కారణంబు ?

*　　*　　*

"మాకు నిద్దరి కింతటి భాగ్యమేల ?
ఇన్నిపాలేల ? ఇంతటి వెన్నయేల ?
భవనరాజంబునకును దీపంబువోలె
సుతుడులేకున్న జన్మలో సుఖముగలదె ?
పెరటిలో నావు లేగపై బరపుప్రేమ
గూటిలో పక్షి కూనపై జాటుప్రేమ
తనయుపై జూపనోచని తల్లిబ్రతుకు
బ్రతుక నేటికి భూదేవి బరువుగాక.
జననిపోషణనొందిన సార్థకంబు
జననియై పోషణలజేయ జనునుగాని,
మాతృఋణమును వేరొకమార్గమునను
దీర్పనెంచుట యెంతటి తెలివితోటు."

---

## ఆంధ్రభూమి : ఏప్రిలు సంచిక

ఇది సర్వవిషయములను చర్చించు సచిత్రమాస పత్రిక. ఆవిధానానికి లోపమేమిరాకుండానే వున్నది. ఈ సంచికలో పత్రికను సాధ్యమయినంతవరకు ఆకర్షవంతంగా చెయ్యటానికిగాను 'వెనుకటి ధాతుసంవత్సరపు కరువుకథ', 'అతనితోట మొక్కల ఇంద్రజాలపుశాల', 'ఇట్టిదంపతులు ఇప్పుడున్నారా?' 'రైళ్ళువచ్చిన కొత్తలో' అనేవ్యాసాలు ఉన్నవి. పత్రిక తెరచిన తర్వాత వీటిని చదవక వదలిపెట్టడానికి బుద్ధిపుట్టదు. అటువంటి వ్యాసాలను సమకూర్చటంలోనే వున్నవి సంపాదకుని తెలివి తేటలు. పత్రికను ఇంటరెస్టింగు చెయ్యటానికై సంపాదకుడు పడుతున్న శ్రమ పై వ్యాసములవల్లనే వ్యక్తమవుతున్నది. కౌరపుశనగలు చాలా చప్పగా నున్నవి. గర్భస్రావపుహక్కుపై విమర్శలను ప్రచురించినందువల్లను, ఆంధ్రదేశానికి యేది రాజధానిగా ఉండవలెననేవిషయమై వ్యాసములు ప్రకటింప నిశ్చయించినందువల్లనూ, సంపాదకులు నేటియుద్రేకసమస్యల విషయమై చాలా శ్రద్ధచూపుతున్నారని తేలుతున్నది. ఎడవల్లి సూర్యనారాయణరావుగారి దుర్యోధన పాత్రనుగురించి ఏ. వి. సీతారామయ్య యమ్.ఏ. గారి పొగడ్త ఒకటిఉన్నది. అంతగా దుర్యోధనుని పాత్రను పొగడటానికి కారణము వ్యాసరచయితకు నటునియందుండే అభిమానమో, లేక, రచయిత యొక్క దృష్టిలోపమో తెలియటంలేదు. జిజ్ఞాస: మీమాంస మొదలయినవన్నీ వెనుకటివలెనే ఉన్నవి. పత్రిక ఇట్లాగే ఆకర్షవంతంగావుండి, నాలుగు కాలాలపాటు దేశసేవ చేయగలదని తలుస్తున్నాము.

— గ్రంథాలయ సర్వస్వము.

# ఆంధ్ర రాష్ట్రమునకు రాజధాని పట్టణమేది?

౧

ప్రస్తుతము మదరాసునగరమే ఆంధ్రరాష్ట్రమునకు రాజధాని నగరముగా నుండవలెను. అటుపిమ్మట అవసరమని తోచినచో అన్ని తెలుగు జిల్లాలవారును కలసి యేకగ్రీవముగా మరియొక పట్టణమును రాజధాని నగరముగా నిర్ణయింపదగును. కాని మదరాసు నగరమే రాజధాని నగరముగా నుండవలెననుటకు అనేకముఖ్యకారణము లున్నవి. (1) మదరాసును రాజధానిగా నంగీకరించినచో ఇపుడున్న యేర్పాటులను మార్చ నవసరముండదు. మరియొక పట్టణమును రాజధానిగా చేసినచో నందులకు చాలధనమును వ్యయపరుపవలసియుండును. ఇపు డట్టి వ్యయము అవసరముండదు. మదరాసు నగరములో ఆంధ్రరాష్ట్రప్రభుత్వ కార్యాలయము ప్రత్యేకముగా నుండును. ఆప్రభుత్వమువారు ఆంధ్రరాష్ట్రమును ప్రత్యేకముగా పరిపాలించెదరు. (2) మదరాసు రాజధానిగాచేయుటవలన రాయలసీమ జిల్లాలు మున్నగు జిల్లాలవారికిగూడ చాల సౌకర్యముగా నుండును గాన వారు దీనినంగీకరించెదరని నేను రూఢిగా చెప్పగలను. ఈరీతిగా అన్నిమండలముల వారును కలసి పనిచేయునెడల రాష్ట్రాభివృద్ధి అతిశీఘ్రముగానే కలుగగలదు. (3) పరిశ్రమలు వాణిజ్యము బ్యాంకీలు మున్నగు సౌకర్యములన్నియును మదరాసులో హెచ్చుగానున్నవి, కాన ఈసౌకర్యములను వదలుకొనగూడదు. మరియొకనగరమును రాజధానిచేసినచో వీటినన్నిటిని అచట వృద్ధిబొందించుటకు చాలకాలముపట్టును. (4) మదరాసుజిల్లాలో ముఖ్యముగా ఉత్తర భాగమునందు తెలుగుభాష మాతృభాషగగల ప్రజలు మిక్కిలి హెచ్చుగా నున్నారు. వారి నందరిని ఆంధ్రరాష్ట్రముననే చేర్చవలెననుట కెట్టి సంశయమునులేదు. వీరిలో చాలమంది వాణిజ్యము మున్నగు కృషులను సలుపుచున్నారు. వీరిలో చాల శ్రీమంతులుగూడ కలరు. (5) మదరాసు రాష్ట్రమున చేర్చవలె ననుట కాక ఇతరులు ఆక్షేపింప వీలులేనట్టి చరిత్రసంబంధము లగు కారణములు గూడ చాల కలవు. ఆంధ్రదేశమున చంద్రగిరిరాజుల పరిపాలనలో మదరాసు నగరము వారిరాజ్యములోనిదే అను విషయము నెవ్వరునుగూడ ఆక్షేపించజాలరు. మదరాసు నగరము చుట్టును ఆంధ్రభాషను మాటలాడువారు పెక్కులక్షలమంది నివసించుచున్నారు.

—వేమవరపు రామదాసుపంతులు.

౨

నికరమైన ఆంధ్రజాతిని, ఆంధ్రత్వమును బలపరచాలంటే, మదరాసునే ముఖ్యపట్నంగా చేసి అరవల మధ్యను తలదాచుకోవడ మెందుకు? ఉన్నకాస్త ఆంధ్రత్వమూ నశించడానికా? ఇంతపెద్ద మనష్యులన్న కాంగ్రెసువారే తమిళనాడు, ఆంధ్రకాంగ్రెస్ ప్రావిన్షియల్ హెడ్డుక్వార్టర్సు చెన్నపట్నం చేసికొని పనిజరిపిస్తూంటే చూడసొంపూ, వినసొంపుగానూ ఉంది. ఇంకను రెట్టింపుగా వుంటుంది ఆంధ్రరాజధానికి మదరాసు ముఖ్యపట్నం అంటేను. తెల్లవారితే అరవగాలి తగిలి వాళ్ళ స్వభావాలే అలవడతవి. మెట్రపాలిన్ అన్నదేకదా ఏ

దేశానికైన ఆదర్శమార్గం చూపించాలి. అరవలు మనం ఒకదగ్గరుంటే మనకార్యభంగం తప్ప మరేమీ ప్రయోజనంలేదు. అయితే మరోమహాపట్నం ఏది? ఆంధ్రులకు రాజధాని కాదగిన మరో మహాపట్టణమేది? మనమెంత వ్యవసాయదారులమైనా వర్తకవాణిజ్యాలుండక తప్పదు. అందుకు రైలుబాటలు, రేవుస్థలములు అవసరము. ఇట్టి రేవుస్థలముల కన్నిటికిగాని, అన్నిటికి అందుబాటులో నొక స్థలమునగాని ఒక సుప్రసిద్ధమగు హార్బరుండాలి. ఇప్పటి పరిస్థితులలో రాకపోకలకు గాలివిమానములు వచ్చినతరువాత ఏరోడ్రోము లుండాలి. మదరాసు గవర్నమెంటులాగు ఆరునెలలు కొండమీద ఆరునెలలు కొండదిగువను యుంటే ఎంత ఖర్చు? అట్లుగాక పండ్రెండునెలలు ఒకదగ్గరనే యుండుటకు వీలగు శీతోష్ణస్థితిగల స్థలమయితే చాల లాభదాయకము. నీరు, ఎలెక్ట్రిసిటీ, కూడా దినకృత్యములకు, పరిశ్రమలకు బాగుగా సలఫరా కావాలి. ఒక విశ్వకళాపరిషత్తు దానితో సహా కళాశాలలు, వానిలోనున్న విద్యార్థులకు క్రీడాస్థలములు ఉండాలి. ప్రజలు సాయంకాలము వినోదార్థముగాని, ఆరోగ్యసాధనమునకుగాని, విశ్రాంతినిమిత్తంగాని పోవాలంటే నిర్మలమగు సముద్రపుటొడ్డుండాలి. అట్టి పట్టణమునకు మానవసృష్టి దైవసృష్టికూడా కలిస్తే అత్యంతరామణీయకముగా నుండును. ఆంధ్రులకు ముఖ్యపట్నం కాదగిన పట్నం తయారుచేయుటకైనా అన్నిలక్షణములు కలిగియున్నది విశాఖపట్నం. (1) ప్రపంచముననున్న స్వాభావసిద్ధములగు హార్బర్లలో విశాఖపట్నం హార్బరు ఒకటి. వాణిజ్యానికి, నేవల్ బేస్‌గా తయారవడానికి అది చాలా అనుకూలమైన హార్బరు. గవర్నమెంటువారి యుద్దేశంకూడా దీన్ని గొప్ప నేవల్‌హార్బరు తయారు చేయాలనేనట. ఇది అనుకున్నట్టు తయారైతే మదరాసు హార్బరును త్రోసి రాజనును. శీతోష్ణస్థితికి (వాల్తేరు) విశాఖపట్నం పెట్టిందిపేరు. ప్రభుత్వమువారు యిచ్చట 12 నెలలూ పనిచెయ్యవచ్చును. ఈకారణముచేతనే మదరాసు, ఇండియా ప్రభుత్వములు ఆంధ్రవిశ్వ కళాపరిషత్తుకు దీనిని పీఠముగా నిర్ణయించినవి. శీతోష్ణ, నైసర్గిక స్థితులబట్టి విదేశీయులు దీనిని బ్రైటన్ ఆఫ్‌ది ఈస్ట్ అని పిలుస్తారు. వాల్తేరు (విశాఖపట్నం) యిండియాలో మొదటి తరగతి రైల్వేలలో రెండింటికి (యమ్.యస్.యమ్, బి.ఎన్.ఆర్ లకు) జంక్షన్. ప్రక్కనున్న విజయనగరం రాయపూరు లైనుకు జంక్షన్. మనదేశములోనున్న మూడు ముఖ్య రాజధానులకు—మదరాసు, బొంబాయి, కలకత్తాలకు—విశాఖపట్నం సమదూరమున నున్నది. హార్బరు యూనివర్సిటీ లుండనేయున్నవి. వైద్యకళాశాలయున్నది. లాకాలేజి రానున్నది. అచ్చటనున్న మండలాధికారుల కచ్చేరీలనే కొద్దిమార్పులతో ప్రభుత్వశాఖాధికారుల కచ్చేరీల కనువగునట్లు చేయవచ్చును. ప్రభుత్వ కార్యాలయము, శాసన సభాభవనములు కట్టవలయును. ఇవి ఏస్థలముననైనను తప్పవు. ప్రస్తుతము కావాలంటే గవర్నరుగారిభవనమునకు ఏ వడ్యాన్ రాణిగారి 'సూర్యాబాగ్'నో పుచ్చుకొనవచ్చును. శాశ్వతసౌధముల నిర్మాణమునకు తగురాయి విశాఖపట్నములో దొరకును. ఉక్కు యినుము సామానులు కావలసినచో టాటానగరం తగు దూరములోనే యున్నది. ఎలెక్ట్రిసిటీకి లమ్మసింగి స్కీమువచ్చినను సరే లేదా ప్రస్తుతం థెర్మల్ స్టేషన్ను స్థాపింప గవర్నమెంటువారు స్కీములు సాంక్షనుచేసిరి. పని ఈసంవత్సరమున ఆరంభింతురు. నీటిసప్లైకికూడా కొన్నిలక్షల విలువగల స్కీములున్నవి. పనికూడా జరుగుచున్నట్లున్నది. ఉదకమండలము, కొడైకనాలు తరువాత ఇదియే వేసవిలో

విశ్రాంతికి తగుస్థానమని చెప్పవచ్చును. పై రెండు స్థలములకు పోలేని కొంతమంది ధనికులు బెంగాల్ మొదలగు ప్రాంతములనుండి యిటకు వత్తురు. ఏరోడ్రోముకు (డాల్ఫిన్ సునోస్) వంటి స్థలము మరియొక టా ప్రాంతములనుండదని నా అభిప్రాయము. దాని వెనుకనున్న లోవతోట (వాలీగార్డెన్సు) ఆపట్టణమునకు సహజ సౌందర్యము నొనగూర్చును. గాలి విమానము లెగురుటకును, దిగుటకును నిది మంచి యనువగు స్థలము. ఏరోపాకు 'రాకాఫ్ జిబ్రాల్టరు' వలె నీకొండ ఇండియాకు ఉపకరింపగలదు. ఈ కొండపై నొక గొప్ప మిలిటరీ స్టేషను గూడా స్థాపించవచ్చును. దివ్యస్థలము కావాలంటే 10 మైళ్ళలో శ్రీ సింహాచలమున్నది. ఈ మహాపర్వతము చుట్టునున్న లోయలు, ధారలుయొక్క సొగసు చెప్పనలవిగాదు. విశాఖపట్నము పెరుగుట కత్యంతావకాశములున్నవి. ఇప్పటి కప్పుడే పట్నం పెరుగుటగూడ నారంభించెను. హార్బరును సరిహద్దులతో కలసి అధమము 20 చ॥మై॥ విస్తీర్ణముండును. ఇంత వైశాల్యము ఏ పెద్ద సిటీకైనను చాలును. వాల్తేరు పెద్ద జంక్షన్ గనుక పెద్ద రైల్వేఆఫీసులు, కర్మాగారములు కూడా గలవు. విశాఖపట్నం చుట్టుపట్ల తాలూకాలు మంచి చేతిపనులకు, ఫలపుష్పాదులకు ప్రసిద్ధి. పాడిపంటలకు కృష్ణగోదావరులవలె గాకపోయినను, కార్మికులకును కర్షకులకును సమానముగా జీవనోపాధి నొనగూర్పగల పట్టణం. ఇన్ని గుణసంపదలచే నొప్పారు మహాపట్నం ఆంధ్రరాజధానికి ముఖ్యపట్నం అగుట కోరదగినది. అట్టి దానిని వదలుకొని అరవలమధ్య నోరలోబడుట మన బలహీనత్వమును తెలియజేయును. ఇంతకూ మదరాసు స్థలమాహాత్మ్యమేమోగాని స్వభావసిద్ధమగు మహత్తు, స్థానిక, రాజకీయ, వ్యవహారిక శీతోష్ణ, వాతావరణ విధులచే నేమియు గొప్పదన మగుపడదు. హార్బ రొక బొమ్మరిల్లు. రైళ్లు నన్నుముట్టుకోకు నామాలికాకియన్నట్లు అటు సెంట్రల్ యిటు ఎగ్మోరు. దాగుడుమూతలాటలో తల్లిని ముట్టుకొని మరల పారిపోవునట్లు సెంట్రల్‌కు రైళ్లువచ్చి మళ్ళీ వెనక్కి పారిపోవడం. అటులనే ఎగ్మోరున్నూ. ఏరోడ్రోమూ 12 మైళ్ళ దూరంలోనున్న మీనంబాకములో. ఫోర్టుసెంట్‌జార్జి ఇండియాలో బ్రిటిషు కోటలలో ముఖ్యమయినది. కాని దానికేమియు అడ్డు ఆదరవులేదు. ఈసంగతి వేరేచెప్పనక్కర్లేదు—ఎమ్డన్ సమాచారము తెలిసినవాళ్ళకి. మదరాసు కాస్మోపాలిటన్ టవును. పైగా తమిళుల ఆధిక్యం. మనకు వాళ్ళకు ఎంత ఐకమత్యమో అందరికి తెలిసినసంగతి. ఇక్కడ మనం హెడ్ క్వార్టర్సు పెట్టుకొని హోదా చెలాయిస్తామనుట కలలోనిమాట. మదరాసును రాజధానిగా అంగీకరించుట రాయలసీమ ఆంధ్రులను కూడగట్టుకొనుటకా? మొదటినుండియు రాయలసీమవారికి విశాఖపట్నమనిన అనుగ్రహము తక్కువ. అయినను భగవంతుని దృష్టిలో విశాఖపట్నం కొంత గౌరవస్థానముగలదిగ నున్నది. మనవారు ఆంధ్రవిశ్వకళాపరిషత్తునే వదులుకున్నారు గాని తమిళుల ఆస్కారం విడువలేకపోయిరి. ఆలాగే ఇప్పుడుకూడా చేస్తారేమో. అయితే ఈ కార్యం అంత సులువుకాదు సుమండీ! అభిమానంలేనివాళ్ళకి ఏదిమాత్రం సమ్మతమవుతుంది. పోనీ ఆంధ్రరాజధాని కాదగిన మరొకస్థలమును వారిప్రాంతములో నున్నట్లయితే చూపించమనండి. అంతేగాని మనం మనం కొట్లాడుకొని తమిళులలో దూరటం ఎందుకు?

—యన్.

[పై మాసపు సంచికలో మరికొన్ని అభిప్రాయములు ప్రచురింపబడు

# ఇన్స్యూరెన్సు విషయములు

## మృత్యువును జయించునది జీవితభీమా

మానవుడు అదిఏమి ఆశ్చర్యమోకాని వేనకువేలు మరణించుట కన్నులార చూచుచుండియు తానుమాత్రము చిరంజీవియై, సుఖియై శాశ్వతముగా జీవించియుండునట్లు భావించుచున్నాడు. చాలామంది తాము పరిపూర్ణారోగ్యముతో వున్నామనియు, చాలా కాలము బ్రతికియుండగలమనియు, తమజీవితములను భీమాచేయ నక్కర లేదనియు, భీమాచేయడమువలన నష్టమనియు తరుచుగా చెప్పుచుందురు. కాని ఎల్లకాలము జీవించియుండడము కల్లగనుక జీవితమును భీమాచేసినచో మనవృద్ధాప్యమునందుకాని, మన తదుపరి మన కుటుంబునకుకాని చాలా సౌకర్యములుండగలవు. ఏకార్యమునకైనను కాలము, నియమము అనునవి కలవు. కాని మృత్యువుకు మాత్రము ఒకవేళ, ఒకఘడియ, ఒకవారము, ఒకతిథి, ఒకనక్షత్రము అను నియమము లేదు. మనకు తెలియకుండగనే అది దాపరించును. మన హిందూదేశపు జననమరణముల లెక్కలనుబట్టిచూచి విచారించినచో మనిషికి సగటున ఆయుర్దాయము 22 సంవత్సరములుగా నిర్ధారణయగుచున్నట్లు తెలియుచున్నది. మరియు 100 జనులలో ఆర్గురుమాత్రమే 65 సంవత్సరములవరకు జీవించుచున్నారు. మిగతా 94 గురు అకాలమృత్యువు వాతబడుచున్నారని గవర్నమెంటువారి జనాభా ...లియుచున్నది. అదియుగాక ...గానున్నవారు సహితము ...ందుచున్న నిదర్శనములు మన మెన్నియో చూచుచున్నాము, వినుచున్నాము, ఇకముందును ఇట్టివెన్నియో చూడగలము. కావున మరణమనునది కాలనియమము లెక్కచేయక మనకు కలుగునని నిశ్చయముగా తెలియుచున్నది. తెలియుచున్నదేమి? తటస్థమయ్యే ఉన్నదని చెప్పవచ్చును. అది ఎప్పుడు సంభవించునో కదా? గాలి ఎప్పుడు వీచునో మనము చెప్పగలము. ఏరోజున సూర్యుడు చంద్రుడు ఎన్నిగంటలకు ఉదయించగలరో అస్తమించగలరో చెప్పగలము. కాని మృత్యువునిగూర్చి నిశ్చయముగా ఎట్టి జ్యోతిషుడైనను చెప్పజాలడు. ఇంకను చాలాకాలము బ్రతకగలుగుదుమని ఉవ్విళ్లూరుచున్న యువకులనేకులు అకాలమృత్యువు వాతబడి తమపై ఆధారపడియున్నవారల ననేకులను దారిద్ర్యదేవతకు ఒప్పగించుచున్నారు. ఇట్లు పరమపదము జెందిన వారి నెందరినో మనము చూచుచున్నాము. సంపాదించడములో ఎట్టి తెలివితేటలున్నను, కూడబెట్టుట కష్టసాధ్యమైనపని యని చెప్పవచ్చును. కావున భీమాచేయుటవలన జీవితమును కూడబెట్టుటయేకాక తనపై ఆధారపడియున్న వారిని సౌఖ్యవంతులుగా చేయుటయు వృద్ధాప్యమునందు తాము సుఖపడుటయు గలుగును. కావున ప్రతిమానవుడు భీమాచేయుట చాలా అవసరము. హిందూకుటుంబముల నేటి శోచనీయస్థితియు, ఈ దేశదారిద్ర్యమును తొలగుటకు జీవితభీమాయే తారకమంత్రము.

—యస్. యస్. యన్. గుప్త.

# యుద్ధములో విషవాయుప్రయోగము కూడునా?

రచయిత:

ఆర్. శ్రీరామమూర్తి, బి. ఏ.

'యుద్ధములో విషవాయుప్రయోగము కూడదా?' అను శీర్షికతో 'మే' మాసపు ఆంధ్రభూమి సంచికలో శ్రీయుత జి. వెంకటరావు (బి.ఏ.) గారు వ్రాసిన వ్యాసము చదివి నేను చాల ఆశ్చర్యముపొందితిని. ఆవ్యాసమును వారు ఇటలీతరఫున వాకల్తునామా పుచ్చుకుని వ్రాసినారాఅని అనిపించుచున్నది. ఊరు అందరిది ఒకత్రోవ ఉలిపికట్టెది మఱియొకత్రోవ అనునట్లు ప్రపంచమంతయు ఇటలీని నిరసించుచుండ శ్రీవారుమాత్రము ఇటలీని సమర్థించుటకు గడంగినారు. ఇటలీని సమర్థించుటయేగాదు మనపత్రిక లేవియు యుద్ధమున విషవాయు, విషధూమ ప్రయోగమునుగూర్చి ప్రతికూలప్రచార మొనర్పరాదను ఆంక్షను జారీచేసినారు.

ఇంతకును యుద్ధమున విషవాయు, విషధూమ ప్రయోగము కూడుననుటకు వారు చెప్పిన కారణములు అంత సమంజసములైనవిగ కూడ లేవు.

విషవాయు విషధూమ ప్రయోగముతో చేయబడు యుద్ధము చాల అనాగరికమైనది. యుద్ధశౌర్యమున ప్రధానమైనదగు 'షివల్రీ' అను మహత్తరగుణము అట్టి యుద్ధమునందు మందునకైన కానరాదు. మఱియు అట్టి యుద్ధము సమరసాంప్రదాయములకు పూర్తిగా దూరమైనది.

అదియునుగాక విషవాయు విషధూమములతో యుద్ధము సమర్థనీయమే అయిన దనుకొందము. అయితే అప్పుడు యుద్ధము ఇరుపక్షములయందలి సైనికులకు మాత్రము పరిమితమైయుండదే. యుద్ధరంగమున ప్రవేశింపని—యుద్ధప్రశంసలోనుండని జనులపై కూడ ఈ విషవాయువులు, ఈ విషధూమములు ప్రయోగింపబడవచ్చును. పడవచ్చునేమి? అబిసీనియాలో అట్లు ప్రయోగింపబడియే యున్నవిగదా! యుద్ధప్రశంసలోలేని సామాన్యజనులపై విషవాయు, విషధూమ ప్రయోగముగావించి వారిని పురుగులవలె మాడ్చివైచుటయు యుద్ధనీతియే యగునని చెప్పువారిబుద్ధి పెడతలబట్టినదని చెప్పకతీరదు. ముసోలినీవంటి రాక్షసప్రకృతిగల మానవుడు తలచినచో ఇట్టి విషవాయు, విషధూమములతో ఒకానొక దేశమునకు కలిగింపగల నష్టము అపారమైనదిగా, తిరిగి కూడతీయరానిదిగా నుండును. విషవాయువులనుండి విషధూమములనుండి యుద్ధప్రశంసలోలేని జనులను కాపాడుటకు బురుఖాలు ఉన్నవికదా వానిని ఉపయోగింపవచ్చునే అని వెంకటరావుగారివంటి ముసోలినీపక్షీయులు పలుకవచ్చును. అయితే ఈబురుఖాలు తగిలించు

కొను పద్ధతి నేర్చుకొనుట అంతకష్టములోనిది కాకపోయినను విషవాయు ప్రయోగము హఠాత్తుగ చేయబడుచో ఇక దారియెక్కడ ? విషవాయుప్రయోగముగావించి ప్రజల ప్రాణములీయుటకు ఆయత్తుడై యున్న ముసోలినీ వంటి అసురుడు ఆవిషవాయుప్రయోగము హఠాత్తుగ చేయునేకాని ముందుగ చెప్పి చేయడుగద! అట్టి సమయములందు బురఖాలు ఎక్కడినుండి వచ్చును? అదియునుగాక నేడు ప్రచారమునందున్న విషవాయువుల నుండి ప్రాణిని కాపాడుటకు నేటి బురఖాలు సమర్థములై యుండును. కాని దినదినము క్రొత్తరీతులు విషవాయువులు విషధూమములు కనుగొనబడుచున్న ఈ సమయమున ఇప్పటి బురుఖాలను అసమర్థముగ చేయగలుగు క్రొత్తవాయువులు కనుగొనబడు ననుట నమ్మరాని విషయముకాదు. ఆక్రొత్త వాయువులువచ్చిన క్రొత్తలో—వాని గుణములను పోల్చిపట్టి వానిని నిర్వీర్యముగ చేయజాలు బురఖాలు కనుగొనబడువఱకును—— ప్రాణరక్షణ మెట్లు ?

విషవాయు, విషధూమములను సమర్థించుటకు వెంకటరావుగారు మఱియొక కారణమును చూపినారు. హానికరములైన ఈగలు, దోమలు, ఇసుళ్లు, మిడుతలు మొదలైన వానిని నాశనముచేయుటకు అవి బాగుగ ఉపయోగించును కావున వానినిగూర్చిన పరిశోధనలు విరివిగ సాగవలసినదే అనియు, యుద్ధములో వాని ప్రయోగము అంగీకరింపబడినపుడే అట్టిపరిశోధనలు సాగుననియు శ్రీరావుగారివాదన. ప్రపంచమున ఇపుడు చేయబడుచున్న పరిశోధనలన్నియు యుద్ధముకొఱకే చేయబడుచున్నవని చెప్పుటకు బొత్తిగా అవకాశములేదు. యుద్ధములో వాని ప్రయోగము అంగీకరించినను అంగీకరించక పోయినను వానినిగూర్చిన పరిశోధన సాగుచునే యుండును. క్రొత్తసంగతులు తెలిసికొందమను జిజ్ఞాస మానవులలో ఉండునంతవఱకు ఇట్టి పరిశోధనలు సాగుచునే యుండును. అగుట విషవాయు, విషధూమములనుగూర్చిన పరిశోధనసాగుటకు వానితో చేయబడు యుద్ధములు అంగీకృతములు కావలయుననుట కొసవెఱ్ఱిమాటగాని అన్యముకాదు.

మఱియు విషధూమ, విషవాయు ప్రయోగమునకు అంగీకరించుట నిరంకుశప్రభుత్వముల సంఖ్యను పెంచుట, వానిని సుస్థిరమొనర్చుటయగును ఇపుడు స్వాతంత్ర్యమును గోలుపోయియున్న దేశములు ఎంత ఆందోళన గావించినను వానిని పాలించుచున్న ప్రభుత్వములు విషవాయు, విషధూమ ప్రయోగములకు దొరకొనుచో తిరిగి స్వాతంత్ర్యము సంపాదింపలేవు. అబిసీనియావంటి బలహీనరాజ్యములు అన్యాయముగ తమ స్వాతంత్ర్యమును గోలుపోవుటకు విషవాయువులే కదా ప్రధానహేతువులు. ఉన్నస్వాతంత్ర్యమును కాపాడుకొనుటకుగాని, పోయిన స్వాతంత్ర్యమును తిరిగి పొందుటకుగాని బలహీన పారతంత్ర్య దేశములకు వీలులేకుండ చేయుటలో ఈవిషవాయు విషధూమ ప్రయోగములతో గూడిన యుద్ధము లెంతయు సమర్థములైనవి. భారతజాతికి చెందిన వెంకటరావుగారు ఈ విషయమును ముఖ్యముగ జ్ఞప్తియందుంచుకొనవలయును.

ఎన్నివిధముల చూచినను యుద్ధములందు విషవాయు, విషధూమ ప్రయోగము బొత్తిగా అంగీకరింపరానిదగుచున్నది.

# సోయాబీన్సు—సోయ చిక్కుడు

రచయిత:

నమ్మి జగన్నాథము

సోయాబీన్సు హిందూదేశస్థులకు అందును శాకాహారులకు ప్రశస్తమగు భోజన పదార్థము. దీనిఖరీదు అత్యల్పము. కాని దేహదార్ఢ్యమును అమితముగ పెంపొందించును.

ఈబీన్సులందు 1500 రకములున్నవి. గింజలు బటాణీ, చిక్కుడు వీట్లను పోలియుండును, కాని సోయాబీన్సులో బటాణీలోగాని తక్కిన చిక్కుడులోగాని కంటె ప్రోటీన్సు. ఫాట్సు ఎక్కువగానుండును. దేహపుష్ఠికలిగించుటలో (గుణమునందున కూడా) పై వానికంటె సోయాబీన్సు మిక్కిలి ప్రశస్తమైనవి. అవి వివిధములగు రంగులలోకూడ గలవు—పసుపు, నలుపు, గోధుమరంగు, గీతలు గీతలుగను చుక్కలు చుక్కలుగను. వీటిని పండించుట సులభము. ఎట్టినేలనైనను మొక్కలు బాగుగా వృద్ధిబొందగలవు. ఇవి మంచూరియాలో నిసుక భూమిలోగూడ పెరుగును. ప్రత్తి, గోధుమ పండు భూములు వీనికి మిక్కిలిఉపయోగము. కనుక మన గుజరాతు సింధు మొదలగు ప్రదేశములుకూడ తగు ఫలితము లొసగగలుగును. ఈ మొక్కలలోగల మరియొక ముఖ్యాంశమేమన—అవి పెరుగు నేలను మరింత సారవంతముగా చేయుట. ఇవి నేలనుండిగాక గాలినుండి నత్రజనివాయువును పీల్చు స్వభావముగలవి. 2, 4 నెలల కాలములో అత్యంతమగు ప్రోటీన్సు, కొవ్వుపదార్థములు లోహములు చేర్చును. ఈ పదార్థములను గ్రహించుటలో పసుపురంగుజాతి శ్రేష్ఠము. అందువలన ప్రపంచమున రైతులందరును ఈరకమునే పండింతురు. పండు భూమికిని, పండించు రైతునకును, భుజించువారికిని కూడను బీన్సు ఉపయోగకరములు. పులుసు, పెరుగు, కాయగూర, పప్పు, పిండి, రసము, నూనె యిన్ని విధముల భుజించుట కుపయోగించును. ఈ గింజల పొట్టునున్నా, పిండి అచ్చులున్నా ఎరువుగనూ, పశువులకు పుష్టినిచ్చు మేతగనూ పనికివచ్చును. దీనినూనె కిరోసినాయిల్ బదులుగా దీపములకును, మైనపు గుడ్డలకును, కాగితపు గొడుగులకును, లాంతర్లకును, వార్నీసులకును, అచ్చుసిరాలకును ఉపయోగింతురు.

భోజనపదార్థములలో పప్పుదినుసులన్నిటికంటె నెక్కువ (నూటికి 40 వంతు) ప్రోటీన్సు వీనియందున్నది. వీనియందుగల ప్రోటీన్సు పప్పుదినుసులలో నుండువానికన్న 2 రెట్లున్నూ, గోధుమలలో నుండువానికన్న 3 రెట్లున్నూ, బియ్యమునందుండువానికన్న 5 రెట్లును అధికము. ఇందులో నూటికి 20.3 భాగము కొవ్వుపదా: 24.6 భాగము కార్బొహైడ్రేట్సు, 4.8 భాగము లవణములున్నూ కలిగి పౌనుకు 2100 కేలరీల శక్తియు కలిగించుచుండును. ఇందుండు—ప్రోటీన్సు యొక్క గుణమువలననిది ఆవుపాలకు సరియగుచున్నది.

సోయాబీన్సునూనె ఎ. డి. విటమినులను, లెసిథినును గలిగి వెన్ననుబోలియుండు. సోయాబీన్సులోను కోడిగ్రుడ్లలోను నుండు లెసిథిన్ ఒకేవిధమగునది. మనభోజనములో

నుండవలసిన ముఖ్యమగు ఎ.బి.డి విటమినులను కలిగియుండు గింజదినుసులలో నిది ముఖ్యమైనది. తల్లిపాలుగాని ఆవుపాలుగాని లేని పసిబిడ్డలకు చాల లాభకరము. సున్నము, భాస్వరము మొదలగు ఖనిజములనుగూడ నిది ఎక్కువగా గలిగియున్నది. అందువలన నరముల సంబంధమగు జబ్బులనివారణ కుపయోగపడును. పిండి (స్టార్చి) తక్కువగా నుండుటను జేసి నిది అతిమూత్రరోగులకునుంచిది.

సోయాబీన్సునుండి కూటు, గుగ్గిళ్లు, అట్లు, చపాతీ (రొట్టె), దోసె, కాఫీ, పాలు మొదలైన తినుబండారములను అనేకముగ తయారుచేయనగును.

గింజలను రెండుదినములు ఎండబెట్టి, వేపి పొడిచేసి కాఫీచేయవచ్చును. కాఫీకి బదులుగా దీనిని వాడుకొనుట మంచిది. కాఫీలో నుండు చెడుగుణములేవియు దీనియందులేవు.

పసుపురంగుగల గింజలు పాలుచేయుటకు మంచివి. మొదట ఈపప్పును కొన్నిగంటలు నీటియందు నానబెట్టవలెను. అనగా రాత్రి నానబెట్టి ఉదయము నూరి పాలనుచేయవచ్చును. అట్లు చేసిన ప్రొటీన్సును తీయుటకు సులువుగా నుండును. నానినగింజలు సన్నికల్లు పైనగాని రుబ్బురోటియందుగాని నూరి ముద్ద చేయవలెను. అట్టిముద్దను మూడింతలు నీటిలోకలిపి గుడ్డలోవడియగట్టి మరగబెట్ట వలయును. ఇట్లు 15 నిముషములు మరగనిచ్చి తిరుగ వడియగట్టవలెను. ఇట్లు మరుగుట వలన పచ్చివాసన పోవును. ఈపిండినుండి గూడ నిట్లనే పాలను తయారుచేయవచ్చును. పిండినుండి పాలు తీయుటవలస కాలము, శ్రమకూడా తగ్గును. మరుగుచున్న నీటిలో నీపిండినిపోసి పదినిముషములవరకును కలుపుచూ మరుగనిచ్చి పిమ్మట వడియగట్టవలెను. మన అవసరమునుబట్టి నీటిని ఎక్కువగగాని తక్కువగగాని వాడుకొనవచ్చును. త్రాగునపుడు చక్కెర కలపి త్రాగవచ్చును. ఒకవంతు సోయాబీన్సుపిండి 6, 8 వంతుల వరి లేక గోధుమపిండిలో కలిపి చపాతీలు, పూరీలు, అట్లు, దోసెలు చేయవచ్చును.

నానబెట్టినగింజలు ఉప్పు, నీరువేసి ఉడుకబెట్టి గుగ్గిళ్లుచేసి తినవచ్చును. నానినగింజలు పొడువుగా నుబ్బును. పప్పు కాయకూరలలో వేసి వండుకొనవచ్చును.

మన భోజనపదార్థములలో సోయాబీన్సు కూడా కలసినచో మిగుల మంచిది. తక్కువ వ్యయముతో మిగుల పుష్టికరమగు పదార్థము మనకు లభించును. ప్రస్తుత దేశపరిస్థితులలో ఇట్టి ఉపయోగకరమగు చౌకపదార్థము లభించుట ప్రతివానికిని సంతోషకరమగు సంగతి. దీని పలువిధములగు ఉపయోగములను కనుగొని యూరపు, అమెరికా, జపాను, చైనా, మంచూరియా దేశములలో లక్షల కొలది ఎకరములను దీనిపంటకుగాను ప్రత్యేకించుచున్నారు. మన దేశమువంటి బీదదేశము కూడా దీనివిలువను కనుగొని త్వరలో దీనిని మనదేశములో విస్తారముగా పండించి మన దేశీయులు భోజనసమస్యను పూర్తిగా పరిష్కరించుకొనుట కర్తవ్యము. సోయాబీన్సు యొక్క యుపయోగములను మహాత్మాగాంధీ, డాక్టరు మెక్కారిజన్, ప్రొఫెసరు కంగా, మొదలగు ప్రముఖులనేకులు పొగడి మన దేశమునకు మిక్కిలి ఉపయోగమైనవనియు దెల్పిరి. విదేశములనుండి దిగుమతియగుటంజేసి ప్రస్తుతము రూ॥కి 6, 7 పౌనుల గింజలు దొరకుచున్నను మనదేశమునందే ఎక్కువగా పండించిన ఇంకను చౌకగా దొరుకుట కవకాశమున్నది.

# కారపుశనగలు

ఇటీవల చనిపోయిన ఒక సుప్రసిద్ధాంధ్రునిగురించి సంపాదకీయము వ్రాస్తూ ఒకానొక తెనుగు వారపత్రిక ఇట్లా వ్రాసింది: 'మన ఆంధ్రులు ఈయన పోయినతరువాత పెద్దవాడు పోయినాడని ఏడుస్తున్నారు. 80, 90 ఏండ్లు ఉన్న ముసలి ముండాకొడుకులు ఉన్నా పాడుదైవము ఈయననే వెతకాలా?' ఇది చదివి ఒకమిత్రుడు ఇల్లా అన్నాడు: 'ఏమిచెప్పదుం గురునాధా!'. ఇంతకీ ఈ సంపాదకుడికి సంబంధంఉన్న—బహుశా ఇది ఇన్నూరెన్నూ సంబంధం కావచ్చు—ముసలినాయకు డెవడో ఇంకా చావకండా వున్నాడు కాబోలు. సంపాదకుడు తానుకోరిన వారిని చంపలేడు. చచ్చినవారిని గురించి కోరి సంపాదకీయంమాత్రం వ్రాయగలడు.

... ... ...

ఒకసభనుగూర్చి ఏలూరుపత్రికలో ఒకదానిలో ఇల్లావుంది: '...మున్నగువారును మరియు పెక్కుమంది పురప్రముఖులును బాలురు, వృద్ధులు మాత్రమేగాక నడికాలమువారును చాలమంది సభకువచ్చియుండిరి. కొలదిమంది స్త్రీలుకూడవచ్చిరి.' ఆయితే ఆవూళ్ళో సభలకు బాలురు వృద్ధులేకాని నడికాలము వారు విశేషంగా వచ్చుట మామూలులేదా? నడికాలమువారు పురుషులు చాలమందివచ్చినా స్త్రీలు కొద్దిమందిమాత్రమే రావడానికి ప్రత్యేక కారణాలేమైనా ఉన్నాయా?

... ... ...

'సభలకుపోవు స్త్రీలకు ముఖ్యసలహాలు'* అను శీర్షికతో 'గోలకొండపత్రిక'లో శ్రీమతి య. సీతాకుమారిగారు వ్యాసమువ్రాయుచు సభలలో స్త్రీలు చేసే తప్పులకు కొన్ని నిదర్శనాలిచ్చేరు. అందొకటి: 'వివేకవర్ధనీహాలునందు రంగూన్‌రౌడీనాటక మప్పుడు ఒక స్త్రీ తన ఐదుసంవత్సరముల పిల్లచే బాల్కనీపై మూత్రమువదలించి క్రిందనుండి తలలు తడిసిన పురుషులు పోట్లాడుటకురాగా ఆతల్లి 'మీయింట్లో చిన్నపిల్లలంతా చచ్చిపోయినారా?' అని పోట్లాడసాగింది.' వెనకటికోయిల్లాలు మగణ్ణి కుండతో కొట్టి కుండపగిలిపోతే దానిఖరీదు మగడివల్ల పుచ్చుకుందిట. ఆవిడకంటె ఈవిడే ఉత్తమురాలుగా కనిపిస్తుంది. ఇంతకీ పిల్లలతల్లులు ఏమిచేసినా చెల్లుతుంది.

... ... ...

డాక్టర్ అన్సారిగారికి అసలు పెళ్ళాంగాక ఐరోపియన్ పెళ్ళాంకూడా ఒకఆమె వుంది అని ఆయన మరణానంతరం మనకు తెలిసింది. రాజకీయనాయకులికి చాలామందికి అసలు పెళ్ళాలుగాక అదనపు పెళ్ళాలు ఉంటూవుండడం పరిపాటి అయింది. మన నాయకుల విలక్షణతలో ఇదోముఖ్యవిషయంగా వుంది. కొందరి నాయకుల్ని పెద్దతనంలోనూ, కష్టదశలోనూ ఈ అదనపుభార్యలే పోషిస్తూ వుంటారు. నిదర్శనాలు కావాలంటారా?

... ... ...

'...గ్రామములో పగలు రెండుగంటలకు పిడుగు పడినందున ఒక యువకుని ముక్కు, నోరుగుండ నెత్తురుకారజొచ్చెను. ఉల్లిగడ్డచేనులో పనిచేయుచున్న ఇద్దరు యువతులు అడ్డముపడిరిగాని ఏనష్టము వాటిల్లలేదు.' అని ఒకవార్త. అడ్డముపడ్డాగాని నష్టం కలక్కపోవడం ఏమిటి? స్త్రీలు శక్తిస్వరూపిణులు కాబట్టి పిడుగు వీరిధరిమానా రాలేకపోయిందా?

... ... ...

భార్యలు పొట్టివారైతే పతిభక్తికలవారుగా విశ్వాసపాత్రురాండ్రుగా ఉంటారని ఫ్రెంచి డాక్టర్ మోరో నిర్ధారణచేసి చెపుతున్నాడు. మా పురోహితుడు స్వయంగా డబ్బుసంపాదించుకుని చాలాకాలానికి అనగా నలభయ్యోపడిలో చేసుకున్న భార్య ఆయనకంటె మూరెడుపొడుగు వుంటుంది. ఈ

పరిస్థితులలో ఈ ఫ్రెంచిడాక్టరు చెప్పినదానిని మా పురోహితుడికి చెప్పమంటారా? లేక ఆయనికి తెలియకుండానే ఆడాక్టరువాక్యం ఈసందర్భంలో ఎంతవఱకు నిజమౌతుందో కనిపెట్టిచూడమంటారా?

... ... ...

సయాందేశములో చేపలు నడుస్తాయనీ, ఆనడవడంలో అరగంటకు నాలుగువందల అడుగుల దూరాన్ని అతిక్రమిస్తాయనీ తెలుస్తోంది. ఈశక్తి మదరాసు రాజధానిలోవుండే చేపలికికూడా వస్తే బాగుండును. చాలినంతపనిలేదనే కారణంచేత మదరాసు ప్రభుత్వంవారు ఫిషరీస్ డిపార్టుమెంటును ఎత్తివేయాలని చూస్తున్నారట. ఈపరిస్థితులలో ఇచటి చేపలికి నడచేశక్తివస్తే ఈ డిపార్టుమెంటు వుంచితీరవలసివస్తుంది. కనీసపక్షం నడక నేర్చిన సయాంచేపలనైనాకొన్ని ఇచ్చటికి నడిచివచ్చినా ఈ డిపార్టుమెంటును నిలిపిఉంచే అవసరం మనగవర్నమెంటుకు కనిపించవచ్చు.

... ... ...

డర్హాంలో ఎనభైమూడేళ్ళ ముసలావిడికి వెనకఎప్పుడో ఊడిపోయిన దంతాలు తిరిగి మొలుస్తున్నాయట. ఇప్పటికి ఎనిమిదిదంతాలు మొలిచాయట. మిగతావికూడా మొలిచేసూచనలు కనిపిస్తున్నాయట. అయితే ఆమె ఇకమీద మెత్తగావుండే సాతాళించిన కూరపు శనగల్నే కాకుండా కరకరలాడేటట్లు వేయించబడ్డ శనగల్నికూడా తినగల్దు అన్నమాట. ముసలితనంలో ఇంతకన్నా కోరతగ్గది ఏముంటుంది?

—వి. విశ్వనాథము, బి. ఏ.


భారతదేశ సంస్థల ప్రోత్సహింపుడు

సల్పప్రీమియములు | ప్రత్యేకసౌకర్యములు | ఆధునిక పద్ధతులు.

1. 'ఏ' మొదలు 'జడ్' వరకుగల స్కీము, 2. బిడ్డల విద్యావివాహముల స్కీము. 3. సమిష్టి జీవితభీమా, 4 స్త్రీలభీమా, 5. యావజ్జీవితపు ఫించను ఏర్పాటు, 6. భార్యాభర్తల జాయింటు లైఫ్ స్కీము ప్రత్యేకసౌకర్యము.

అదియు నిదియు అననేల ? వీరువారననేల ? ఎల్లరకును అందుబాటులోనున్న జీవితభీమాపాలసీని పొంది మీపోష్యవర్గమును పోషింపుడు.

కంపెనీ ఆర్థికస్థితి గాంచనగును.
గవర్నమెంటు సెక్యూరిటీ రు 2 లక్షలు.
జీవితమూలనిధి రు 6 ,,
చెల్లించిన క్లెయిములు రు 14 ,,
1933-34 లో చేసిన వ్యాపారము రు 35 ,,

ధారాళమైన కమీషన్, వేతనములపై పలుకుబడిగల ఏజెంట్లు కావలెను.
ఇట్టి విశేషసౌకర్యములు కలవు కాన నేడే వివరములకు సూపరింటెండెంటు

ది వీనస్ అస్యూరెన్సు కంపెనీ, (ఢిల్లి)
The Venus Assurance Company Ltd., Delhi.
బ్రాంచి ఆఫీస్ : 22, సెకండులైను బీచ్, మదరాసు.
లేక మీకు సమీపమునగల ఏ బ్రాంచి ఆఫీసుకైన వ్రాసి తెలిసికొనుడు.

# "ఆంధ్రభూమి" పుస్తకపీఠము

౧౫౦. హిందూదేశము :

### క్రైస్తవ ప్రభుత్వనిర్మాణతత్వము.

...రు బి. డి. బాసుగారు (ఐ.యమ్.యస్.)ఆం... ...ను రచియించిన పుస్తకమున కిది మహీ... ...ప చేసిన ఆంధ్రానువాదము. ...గౌరవముకలది. అనువాదక... ...కముగా నుండి అక్షరాస్యుల... ...న నున్నది. క్రౌనుసైజున 200 ...స్తకము వెల 0-8-0 అణాలే. దొ... ...శ్వసాహిత్యమాల, ముంగండ, (వ... ...పేట, తూర్పుగోదావరి జిల్లా.

### ౧౫౧. తొట్టివైద్యము

...ద్యమునకు జనకులగు శ్రీయుత లూయీ... ...చియించిన నాలుగుగ్రంథముల ననుస... ...క్కర్ పుచ్చా వెంకటరామయ్యగారు ...ఏ. ఎం.) తెనుగున రచియించిన గ్రంథ... ...తము విమర్శనార్థము మాకార్యాలయము... ...కిన ఈపుస్తకము మూడవకూర్పునకు చెం... ...పుస్తకము రెండుకూర్పులను దాటినదను... ...నిది ఆంధ్రప్రజలదృష్టి బాగుగా నాకర్షించిన... ...చెప్పవచ్చును. ఈ మూడవముద్రణము వెనుకటి రెండు ముద్రణములకన్న మిక్కిలి పెంపొందింపబడినది. ఇందు చేర్చబడిన ముఖవైఖరీవిద్యాసంబంధములగు పటములు దీని విలువను హెచ్చించుచున్నవి. పటమటలంక సాధనాశ్రమమునకు చెందిన శ్రీమతి జ్ఞానాంబగారు రచియించిన లూయీకూనే మహాశయుని జీవితసంగ్రహ మిందు చేర్చబడ్డుట ఎంతయు మెచ్చదగినది. గ్రంథమంతయు నలుబది ప్రకరణములుగా విభజింపబడినది. తొట్టిస్నాన పద్ధతిని అవలంబించువారే కాక ఇతరులుకూడ ఈ గ్రంథమును చదువుటవలన స్వస్థవృత్తమును అలవఱచుకొనినవారగుదురు. 'కూనేగారి యభిప్రాయములకు భిన్నమగు విషయమొక్కటియైన నిందు జేర్చబడలేదు' అని పీఠికలో వెంకటరామయ్యగారు చెప్పినను అత్యవసరమైనచోట కూనే అభిప్రాయమునకు భిన్నమగు అభిప్రాయమును చెప్పకుండ నుండలేదు. 807-వ పుట చూడుడు: 'శ్రీకూనేగారు రాత్రులకన్న నుదయమే సంగమమునకు దగినకాలమనియు, రాత్రిసంగమము వలన బలహీనతయు తేజోహీనతయు గలుగుననియు రాత్రికాలమున గర్భస్థమగు శిశువు పగటివేళ గర్భస్థమగు శిశువువలె బలారోగ్యములం గలిగియుండదనియు వ్రాయుచున్నారు. కాని ఇది భారతీయాచారములకును ననుభవమునకు ప్రత్యక్షవిరుద్ధముగా నున్నది. కాన దీనిని పాఠకు లాదరింపరాదని హెచ్చరించెదను. ఇది శాస్త్రవిరుద్ధమును నగును. మనదేశపు శీతోష్ణస్థితిగతులకు ఈ నియమములు చెల్లవు.' ఇది మూలమునకు మెఱుగుపెట్టుటయేయగును. అనుబంధమున చేర్చబడిన ప్రశ్నోత్తరములు పెక్కు సందేహములను తీర్చునవిగా నున్నవి. ప్రకృతి పద్ధతిని ఆరోగ్యసాధనము చేయుటకు ఉపయుక్తములగు అనేకవిషయములను ప్రదర్శించు క్రౌనుసైజున నాలుగువందల పుటలు గలిగి కాలికోబైండుతో ఒప్పుచున్న ఈ గ్రంథము వెల మూడురూపాయిలు. ప్రకాశకులు : ప్రకృతి కార్యాలయట్రస్టు, బెజవాడ.

### ౧౫౨. మెకానిక్సుగైడ్

బందరు ఆంధ్రజాతీయపాఠశాలలో మెకానికల్ ఇంజనీరగు కోట యజ్ఞరామశర్మగారు రచియించినది. దేశమున ఇపుడిపుడే కొద్దికొద్ది పరిశ్రమలు బయలుదేరుచున్నవి. వానిని నిర్వహించుటకు వలయు ఇంజనీరింగు కళాకౌశల్యమును పెంపొందించుటకిట్టి శాస్త్రగ్రంథముల ప్రచురణము విరివిగా దేశభాషలందు సాగవలయును. అగుట ఈ గ్రంథక...

ఈ గ్రంథమును రచియించుటలో దేశహితమునే ప్రధానముగ నెన్నుకొనెనని చెప్పవలసియున్నది. అనుభవపూర్వకముగ వ్రాయబడిన ఈ గ్రంథము ఇంజను డ్రైవరులకు, ఫిట్టరులకు, లేతు టర్నరులకు, మెకానిక్కులకు, ఇంజనీరింగు విద్యార్థులకు మొదలగు వారికి లెస్సగ ఉపయోగించును. దీనిని వ్రాయుటలో దేశపరిస్థితులుకూడ కర్త మరచిపోలేదనుటకు 119-వ పుటలో డెల్టా భూములలో పునాదులకు ఇసుక తెర తగులనప్పుడు చేయవలసిన పద్ధతినిగూర్చి వ్రాయబడిన పంక్తులు నిదర్శనములు. ఇందుచేర్చబడిన యథోచితములగు చిత్రములు దీనిఉపయోగమును హెచ్చించుచున్నవి. వెల ప్రతిఒక్కంటికి రెండు రూపాయిలు. వలయువారు గ్రంథకర్తపేర చింతగుంటపాలెం, మచిలీపట్నముపోస్టుకు వ్రాయునది.

## ౧౫౩. పల్లెపట్టు

ముత్యాలసరములలో రచియింపబడిన చక్కని చిన్న పద్యకావ్యము. ముద్రణము అతిసుందరము. రచయిత : చిరుమామిళ్ళ విజయపార్థసారథిగారు. చిరునామా : ముప్పాళ్ళ, నందిగామపోస్టు, కృష్ణాజిల్లా. దీనినిగూర్చిన విమర్శనము ప్రత్యేకవ్యాసముగ పైమాసపు ఆంధ్రభూమిలో ప్రచురింపబడును.

## ౧౫౪. నిజామురాష్ట్ర పరిపాలనము

నిజామురాష్ట్రపు ఆంధ్రనాయకులలో పేరుమిగిలిన సురవరము ప్రతాపరెడ్డి (బి.ఏ., బి.ఎల్.) గారు నిజామురాష్ట్ర పరిపాలనా విధానమునందలి విషయములనన్నిటిని ఏర్చి కూర్చి కూడినంత సంగ్రహముగ్గ సర్వజనబోధకముగ రచియించిన గ్రంథ మిది. నిజాము ప్రభుత్వపద్ధతినిగూర్చి తెనుగు తెలిసిన ప్రతివాడును తెలిసికొనదగు విధమున పుస్తకము ఒప్పుచున్నది. నిజాంరాష్ట్రము, నవాబుల క్రమము, కొన్ని అంకెలు, రాష్ట్రవిభజనము, శాసనసభ, బాబెహుకూమతు, సర్కారీ కచ్చేరీల విభజన, శాఖలు : వాని వివరములు, రెసిడెన్సీ, జాగీర్లు, సర్ఫెఖాను అను ఇందలి ప్రకరణములు వరుసగా చదివినచో నిజాము రాష్ట్రపు సివిక్సు కరతలామలకమగును. వకీలు వృత్తియందుండియు ప్రజాహితముపొంటె విశేషపరిశ్రమ చేసి ఇట్టి గ్రంథము రచియించినందులకు శ్రీ రెడ్డిగారి నెంతయు కొనియాడుచున్నాము. డెమ్మిసైజున ౨౪ పుటలు. నిజామురాష్ట్రపటము, ఉర్దూపదములకు సరియైన ఆంగ్లపదములు చేర్చియుండుటచే నిజామురాష్ట్రేతరాంధ్రులు దీనిని చదివి విషయ ం సుల భముగా అవగాహనము చేసికొనుట కవకా ే ‹ డినది. బ్రిటిష్‌భాగమునందలి ఆం‌ ష్ట్రమునందలి తమ సోదరు మున నున్నారో తెలిసికొనుట గ్రంథము ఆంధ్రమున లేదు. దీ, దొరుకుచోటు : గోలకొండ ము పుబజారు, హైద్రాబాదు - దక్క

## ౧౫౫. మహామేధావు

ఆంధ్రావళీగ్రంథమాలలో నిది న కము. ఆర్కిమెడీస్, కోపర్నికస్, జొహాన్ కెప్లర్, గెలీలియో, టార్రిసెల్లి జేమ్సుఫెర్గుసన్, సర్ హంఫ్రీ డేవీ అను గురు మహామేధావుల జీవితము లిందు కీ ఈతొమ్మండుగురు మనీషావంతులును యొక్క అభ్యుదయమునకు ఎంతయో తో జీవితచరిత్రలు అవశ్యపఠనీయములు. ' వులు'కు పరిచయవాక్యములు వ్రాయుచు వులను నీగ్రంథము విద్యార్థులలో సత్యవిధేయ గాక సత్యపరిశోధనాసక్తినికూడ పెంపొందించుట సాయపడగలదని నానమ్మకము.' అన్న వాల్తేరుసైన్సుకాలేజీకి చెందిన కొచ్చెర్లకోట రంగధామారావు (ఎమ్.ఏ.డి.ఎస్.సి) గారి పలుకులెంతయు సత్యసమ్మతములు గానున్నవి. ఇట్టి ఉత్తమగ్రంథాలంకారము చే ఆంధ్రభాషాయోషను పూజించిన శ్రీ గొబ్బూరు వెంకటానందరాఘవరావు, బి. ఏ. గారి నెంతయు కొనియాడుచున్నాము. క్రౌనుసైజున ౧౨౨ పుటలు. వెల ఒకరూపాయి. దొరుకుచోటు : తెనుంగుగుడి, ఎలమంచిలి, విశాఖపట్టణము జిల్లా.

Printed at The Andhrabhumi Printing Works, Vepery, Madras.
Editor & Publisher: Andra Seshagiri Rao. B.A.